Volume VI

No. 4

28th July, 1961

(Friday)

6th Seravan, 1883 S. E.

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

# OFFICIAL REPORT

**Part II—Proceedings other than Questions and Answers.**

---

## Contents.


Business of the House [ 193 ]

Point of Information

re: Allegations made by Sri P. Kotaiah against the Minister for Cottage Industries and Excise [ 194 ]

Calling Attention to Matters of Urgent Public Importance.

re: Levy of penalties on Ryots Cultivating tank-bed lands [195—198]

re: Service Conditions of the Telangana Supervisors (P. W. D.) [198—200]

Papers Laid on the Table of the House [200—201]

Amendment to Madras Public Service Commission Regulations, 1950

Amendment to the Andhra Pradesh General Sales Tax Rules, 1957

Notification issued under Section 11 (1) of the Andhra Pradesh Motor Vehicles Taxation Act, 1931.

Notification issued under Section 11 (1) of the Andhra Pradesh Motor Vehicles Taxation Act, 1931.

Business of the House [ 201 ]

Motion on Address by the Governor [202—259]

Note:—*at the commencement of the Speech denotes confirmation not received in time from the Member.

[redacted] & Co., SECUNDERABAD,
[redacted], HYDERABAD-A.P.

# THE

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

*(Part II-Proceedings other than Questions and Answers)*

## OFFICIAL REPORT

---

Fourth day of the Twelfth Session of the
Andhra Pradesh Legislative Assembly

---

## ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY

*Friday, the 28th July, 1961.*

The House met at Half Past Eight of the Clock.

*(Mr. Speaker in the Chair)*

## *QUESTIONS AND ANSWERS*

(See Part I.)

### *BUSINESS OF THE HOUSE*

మిస్టర్ స్పీకర్ : నిన్న కొన్ని పత్రికల విషయంలో-ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో erroneous publication of the speeches of the Leader of the Opposition లేదు అని పత్రికలవారు చూపించారు.

శ్రీ పి. సుందరయ్య (గన్నవరం):— ఉంది. కాని ఆరోజు నేను కాంట్రడిక్ట్ చేయమని పంపించలేదు. వారి దృష్టికి పోయింది. అప్పుడు దానిని పెద్ద సమస్యగా చేయవలసిన అవసరం లేదు అని తప్పితే అక్కడ erroneous వాక్యము ఉన్నది.

మిస్టర్ స్పీకర్ : శ్రీ సుందరయ్యగారు చెప్పని సంగతి ఉన్నది. వారు ఏమి చెప్పారో అది ఎత్తుకోకుండా-మేము పొరపాటున వేశామని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వారు కూడ చెప్పవలసినదే. కనుక ఆ విధంగా చేయవలసిందిగా కోరుతున్నాను, వేయకపోతే తప్పు. అయితే ఒక సంగతి, మన గవర్నమెంట్ లా కమీషన్ ఏర్పాటు చేశారు.

1-8-61వ తారీఖున ఉదయం 9 గంటలకు గవర్నర్ గారు ఈ లా కమీషన్ ప్రారంభోత్సవం చేస్తారు. దానికి తమందరూ దయచేయవలసిందిగా కోరుతూ ఆ రోజు అసెంబ్లీ సమావేశాము మధ్యాహ్నము మూడున్నర గంటలకు కావటానికి నేను మీ అనుమతి కోరుతున్నాను. మీరంతా ఒప్పుకొన్నారని తలుస్తాను.

## *POINT OF INFORMATION*

### *re: Allegations made by Sri P. Kotaiah against the Minister for Cottage Industries and Excise*

లఘుపరిశ్రమలు, ఎక్సైజ్‌శాఖలమంత్రి(శ్రీకొండా లక్ష్మణ్ బాపూజీ):అధ్యక్షా, నిన్న శ్రీ ప్రగడ కోటయ్యగారు గవర్నరుగారి అడ్రస్‌పైన స్పీచ్ యిస్తూ కొన్ని సీరియస్ టైప్ ఆఫ్ ఎలిగేషన్స్ నాపైన (పర్సనల్ గా, మినిస్టర్ గా, ప్రెసిడెంట్ ఆఫ్ ది హైదరాబాద్ అపెక్స్ వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటిగా నాపైన చేసినట్లు ఇవాళ పత్రికలలో వచ్చింది. నిన్న నేను ఇక్కడ లేకుంటిని.ఎక్సైజు అక్షన్స్ వచ్చాయి. అర్జెంట్ మేటర్స్ అటెండ్ చేయుటానికి ఆఫీసుకు వెళ్ళి ఉంటిని. అయితే టేప్ రికార్డ్ కాపీ నేను కోరాను. ఇప్పుడేనాకు కొన్ని కాపీలు ఇచ్చారు, నేనుమళ్ళి ఒకసారి అవి టేపురికార్డులో వెరిఫై చేసుకోవలసి ఉన్నది. ఇంకా ఆ ఆరోపణలకు సంబంధించిన ఇన్‌ఫర్మేషన్ టేబుల్ మీద పెట్టాలని (శ్రీ కోటయ్యగారిని) కోరటము వారు ఇవాళ టేబుల్‌మీద ఆ పేపర్స్ పెడతానని అన్నారట, వారు వాటిని టేబుల్ మీద పెడితే, అవిచూసి టేప్ రికార్డుకాపీ వచ్చిన తర్వాత: మొత్తము ఇన్‌ఫర్మేషన్ నేను తెప్పించి—నేను ఒక స్టేట్ మెంట్ ఇవ్వదలచుకొన్నాను. దానికి టైమ్ ఇవ్వాలని కోరుతున్నాను.

శ్రీ పి. సుందరయ్య :— నేను యిప్పుడే వచ్చు తున్నాను.నిన్న హాజరు కాలేక పోయాను. Table మీద చాల reports ఉన్నాయని కొన్ని letters ఉన్నాయని చెప్పారు. కొన్ని quote చేశారు. అవన్నీ special reports available కావు.

మిస్టర్ స్పీకర్ : మీరు ఢిల్లీనుంచి ఎప్పుడు వస్తారు?

శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ : ఒకటవ తేదీ వస్తాను.

మిస్టర్ స్పీకర్ : రెండవ తేదీ పెట్టుకుందాము. ఆ రోజు మీరు చెప్పవచ్చు. Reply ఉంటే సభలో చూసుకుందాము. రెండవ తేదీ ఉదయమున question hour కావడంతోనే యిది తీసుకుందాము. మీరు explain చేయాల్సి ఉన్నది. వారు ఒకవేళ ఏదైన reply చెప్పుకుంటె చెప్పుకుంటారు.

శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ : Rules ప్రకారం తరువాత చర్చ కాదేమో తమరు ఎట్లా శెలవిస్తే అట్లా.

మిస్టర్ స్పీకర్ : లేకపోతే ఎట్లా? రేపు మంత్రిగారి జవాబు ఉన్నది. రెండు గంటలు యివ్వదలచుకున్నాను. మీరు కావాలంటే అందులో చెప్పుకోవచ్చును, కాని ప్రత్యేకంగా అడుగుతున్నారు. అందులో సుందరయ్య గారు కూడా అడుగుతున్నారు. కనుక యింకో రోజు పెట్టుకుందాము. మీ explanation మీరు యిస్తారు. సుందరయ్యగారు వారి observation వారు చేస్తారు. Close చేద్దాము.

శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ : ఏమైన Points వస్తే, దానికి clarification కూడ వెంటనే నేను చేయవచ్చు.

మిస్టర్ స్పీకర్ : I shall be fair to all the three parties. Allegations చేసిన ఆయన, Leader of the Opposition, తాము, చెప్పేది విందాము. You need not have any doubt.

## *CALLING ATTENTION TO MATTERS OF URGENT PUBLIC IMPORTANCE*

### *re: Levy of Penalties on Ryots Cultivating Tank-bed Lands*

* శ్రీ సి. హెచ్. రాజేశ్వరరావు (చొప్పదండి):- అధ్యక్షా, ఒక ప్రత్యేకమైన విషయం మంత్రిగారి దృష్టికి తేవాలని ఈ మోషన్ ఇచ్చాను. ఇతర జిల్లాలలో పద్ధతి ఆ వివరాలు నాకు తెలియవు గాని కరీంనగర్ జిల్లాలో సర్వ సాధారణంగా అన్ని తాలూకాలలో ప్రత్యేకించి సిరిసిల్ల, కరీంనగర్, సుల్తానాబాద్ తాలూకాలలో చెరువు గర్భాలలో ఉండే భూములు కొత్త చెరువుకట్ట క్రింద మాగాణి సేద్యంలో కలిసే భూములు కొన్ని ఆ ప్రక్కనే ఉన్నాయి. వాటినికూడ షికం భూములు (చెరువు గర్భంలో ఉండే భూములు) అని రైత్వారీ రెవెన్యూ రికార్డ్సులో ఉన్నవి. సర్వ సాధారణంగా లేకున్నప్పటికీ దాదాపు ప్రతి తాలూకాలో చాల చెరువుల క్రింద యిలాంటి భూములు ఉన్నాయి. వాటిని వెనుకబడ్డ జాతులవారు, హరిజనులు దున్నుకోవడం, జమాబంది సందర్భంలో తాసిల్దార్లు, కలెక్టర్లు అక్రమం అని వాటిపైన penalties వేయడం, ప్రతి సంవత్సరం వేలరూపాయలు penalties చెల్లించుకోవడం జరుగుతున్నది. ఇది నిజంగా చెరువు గర్భాలు అనడానికి వీలులేని భూములు. వీటిని పట్టాకు ఇవ్వమని అడిగితే recordsలో షికమ్ భూములు అని ఉన్నాయి కాబట్టి వాటిని పట్టాలపైన

ఇవ్వడానికి వీలులేదని చెపుతున్నారు. వాస్తవంగా అవి సాగులోకి రాగలిగిన భూములు చెరువుకట్టల క్రింద ఉన్న భూములు. వాటిని పోరంబోకుగా పరిగణించమని ప్రభుత్వం ఒక general order ఇచ్చినట్లయితే గవర్నమెంటు అధికారాలు పట్టాలకు ఇచ్చే అవకాశం ఉన్నది. ఇప్పుడున్న orderలో షికమ్ భూములు పట్టాకు ఇవ్వరాదు. అని ఉన్నది, వాళ్ళు సేద్యం చేసుకొనేటటువంటివి. ప్రభుత్వానికి షికమ్‌గా ఉపయోగపడని భూములు కాబట్టి వాటిగురించి ప్రభుత్వం శ్రద్ధగా ఆలోచించి వెంటనే పట్టాలు ఇవ్వడానికి కలెక్టరుగారికి orders ఇవ్వమని కోరుతూ ఈ విషయం మంత్రిగారి దృష్టికి తీసుకువస్తున్నాను,

* ఉపముఖ్యమంత్రి (శ్రీ కె. వి. రంగారెడ్డి): అధ్యక్షా, 1951వ సంవత్సరపు Hyderabad Land Revenue Rulesలో 27వ నిబంధన ప్రకారం చెరువు గర్భం భూములు పట్టాల మీద మంజూరు చేయబడ కూడదు. ఇట్టి భూములు ఏ సమయంలో నైన చెరువు నీటి నుంచి తేలి వ్యవసాయానికి లాయకుగా ఉన్న ఎడల పై rules లో 28వ నిబంధన ప్రకారం అట్టి భూములను నిర్ణీతమైన పైరు సాగుచేయుటకు తాత్కాలికమైన హక్కును తాసిల్దారు వేలం పాట మీద అమ్మవచ్చును. అయితే అట్టి వేలం వేయుచున్నామని ముందుగా ప్రకటించి వ్యవసాయపు season ప్రారంభమునకు ముందు వేలం వేయవలెను. ఒక్కొక్క చెరువు గర్భము భూములు వేరు వేరుగా వేలం వేయవలెను.23-7-58 వ తేదీన రెవెన్యూ డిపార్టుమెంటు G.O. నంబరు 1406 ప్రకారం తదుపరి 26-8-59వ తేదీగల 1724 G.O.ప్రకారం చెరువు గర్భములోని భూములు దాని పరిసర భూములలో ఫోర్ షోర్ భూములు, పట్టా మీద యిచ్చుట నిషేధించ బడినది. 22-10-1959 తేదీగల రెవెన్యూ డిపార్టుమెంటు మెమోరాండంలో పోరంబోకులను పట్టాపై యిచ్చుట గురించి కొన్ని ఉత్తరువులు జారీ చేయబడినవి. పోరంబోకు భూములుగా ఉత్తరువులు జారీ చేయబడినా, మొదట ఏ ఉద్దేశ్యం ప్రకారం ప్రస్తుతం ప్రజల ఉపయోగమునకు వినియోగించ బడకుండా ఉన్న ఎడల అట్టి పోరంబోకు భూములను పోరంబోకు నుంచి ఆయానుగా మార్చి బీద ప్రజలకు పట్టాలపై యివ్వవలెనని ఈ ఉత్తరువులో ఉన్నది. 1-8-1960 తేదీగల రెవెన్యూ డిపార్టుమెంటు మెమోరాండంలో చెరువుగర్భం భూములు పరిసర భూములు పట్టాలపై యివ్వ కూడదని, అయితే రెవెన్యూ రికార్డులలో మాత్రం చెరువులని చెప్పబడి నిజంగా వానివల్ల నీటి supply ఏమి లేకుండా వ్యవసాయం వాని ఆధారం మీద చేయకుండా ఉండిన ఎడల అట్టి చెరువులను కుంటలను జిల్లా కలెక్టరు పరిశీలించి అధికారం గల ఉద్యోగి ఉత్తరువుల మేరకు అట్టి చెరువులను ఆయానుగా మార్చి చెరువుగర్భం భూములను పట్టాలమీద ఇవ్వవలెనని ఉత్తరువులు పంపబడినవి. ఈ విషయమై ఏదైన తగాదా ఉంటే రెవెన్యూబోర్డుద్వారా ప్రభుత్వానికి పూర్తి వివరములతో report

పంపవలెను. 1951వ సంవత్సరం Hyderabad Land Revenue Rulesలోని 28వ నిబంధనకు, 25-7-1958 తేదీగల రెవెన్యూ డిపార్టుమెంటు G.O.కు పరస్పర విరుద్ధం ఉన్నదేమోనని ఇటీవల రెవెన్యూబోర్డు ప్రభుత్వం గృష్టికి తీసుకువచ్చినది. అది ఎట్లు అనగా 28వ నిబంధన ప్రకారం చెరువుగర్భం భూములు ఏక్‌సాల్ వ్యవసాయమునకు కేటాయించబడవచ్చును గాని 1406 G.O. ప్రకారం చెరువు గర్భ భూములు అసలు కేటాయింప బడుటకే వీలులేదు. దానిమీద ప్రభుత్వము 19-4-61 తేదీగల రెవెన్యూ డిపార్టుమెంటు మెమోరాండంలో అట్టి పరస్పర విరుద్ధం ఏమిలేదని విశదీకరింపబడినది, అది ఎట్లు అనగా 28వ నిబంధన ప్రకారం ఎక్‌సాల్ వ్యవసాయమునకు కౌలుకు ఇవ్వవచ్చును గాని పట్టాపై ఇవ్వకూడదు. అని ఆ నిబంధనలు కేటాయింపవచ్చును అన్నపదం కౌలుమీదనే అని ఆ నిబంధనలోనే వున్న "కాలుదరు" అను పదంవాడి వుండుటవల్ల తెలియును. ఇటీవల కరింనగర్ జిల్లా మంతెన తాలూకాలోని మహాదేవపురమునకు మేము వెళ్ళినప్పుడు అక్కడ చెరువులని వ్యవహరింపబడే భూములకు చాలాకాలము నుండి సేద్యమునకు నీటిసప్లయి చేయుట లేదని అక్కడి చెరువు గర్భ భూములకు పట్టాలు యిచ్చుటకు ఉత్తర్వులు ఇవ్వవలయుననియు కోరబడినది. ఆకోరికపై స్టోర్ చేయబడిన నీళ్లు అయకట్టు గలిగి వున్నట్టియు, చెరువు గర్భభూములని అక్కడివాటికి, 28వ నిబంధన ప్రకారం ఏకసాల్ కౌలుమీద వ్యవసాయానికి పర్మిషన్ ఇవ్వవచ్చునని చెప్పడమైనది. కావున, ఆ ప్రకారంగా అక్కడి భూములు యీ సంవత్సరము వానలు లేని పరిస్థితివల్ల ఏక్‌సాల్ కౌలుకు అక్కడి భూములను యివ్వవచ్చునని తహసిల్దారుకు కరింనగర్ జిల్లా కలెక్టరు ఆదేశించాడు. రెవిన్యూబోర్డు కూడా 20-5-1960వ తేదీగల ఉత్తర్వులలో తెలంగాణా జిల్లాల కలెక్టర్లకు అట్టి చెరువు గర్భ భూములను ఏకసాల్ కౌలుకు ఇవ్వవచ్చుననియు, అంతేగాక, అవి నీటిసప్లయికి పనికిరాదని నిర్ణయింప బడినఎడల శాశ్విత పట్టాలుకూడా యివ్వవచ్చుననియు ఉత్తర్వులు జారీచేసి ఉన్నది. కాని ఆ చెరువులు కుంటలు వ్యవసాయానికి నీటి సప్లయి చేయుటకు పనికిరావని నిర్ణయించబడి యిరిగేషన్ ఆధారములలిస్టు నుండి అర్హత గలిగిన ఉద్యోగి, ఆర్డరు ప్రకారం తొలగించునంతకాలము ఆ చెరువు గర్భభూములను పర్మిషన్ లేకుండా వ్యవసాయము చేసినవారి వద్దనుండి, రూల్సు ప్రకారం తావాన్లు వసూలు చేయబడును. సేత్‌వారిలో యిరిగేషన్ ఆధారములని ఉదహరించవలసిన కుంటలుచెరువులు వాటిగర్భభూములు వ్యవసాయానికి ఇవ్వవచ్చునని జనరల్ ఆర్డర్సు జారీచేయమని గౌరవసభ్యులు చేసిన సూచన అంగీకరించబడదు. అయితే యిట్టిభూముల వ్యవసాయము విషయంలో రైతుల యిబ్బందులను యిదివరకే ప్రభుత్వం గుర్తించిందనేది పైన చెప్పబడిన ఉత్తర్వులవలన స్పష్టం కాగలదు.

పనికిరాని చెరువులను లిస్టునుండి తొలగించ వలయునని, అట్లు తొలగించిన పిమ్మట ఆ భూములను పట్టాలపై యివ్వవలయునని యిదివరకే స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేయ బడినవి, కాని ప్రస్తుతం గౌరవ సభ్యులు ప్రభుత్వ దృష్టికి, తమకు వచ్చిన పరిస్థితుల వలన కరీంనగర్ జిల్లా కలెక్టరు గారికి, పైన వుదహరింపబడిన ప్రభుత్వ ఉత్తర్వులు మరల తెలియ జేసిన అందుకు చర్యలు తీసుకొనబడునని తెలియ జేస్తున్నాను.

*re : Service Conditions of the Telangana Supervisors (P.W.D.)*

శ్రీ సి. హెచ్. రాజేశ్వరరావు : అధ్యక్షా, ఈ P. W. D. సూపర్ వైజర్స్‌కి సంబంధించి తెలంగాణా ప్రాంతములో ప్రత్యేక. పరిస్థితి వుంది. దానిని మంత్రిగారి దృష్టికి తీసుకు రావలసిన అవసరముంది. ఇదివరకు హైదరాబాదులో సూపర్ వైజర్స్, ఓవర్ సీర్సు నియమించక ముందు అప్పర్ సబార్డినేట్ కోర్సు అనే ఒక డిప్లొమా కోర్సు వుండేది. దీనిని ఉస్మానియా యూనివర్సిటీ నడిపించేది. అప్పర్ సబార్డినేట్ కోర్సు చదివి ఆ డిప్లొమా పొందిన వారందరినీ సబ్ ఓవర్ సీర్సుగా, ఓవర్ సీర్సు, సూపర్ వైజర్సుగా ప్రమోషన్ చేయడం జరిగింది. ఇప్పుడు, బి. ఇ డిగ్రీకోర్సువచ్చిన తరువాత యీ కోర్సును తీసివేశారు. ఇదివరకు యీ అప్పర్ సబార్డినేట్ కోర్సు పాస్ అయినవారు చాలామంది యిప్పుడు ప్రమోషన్ పొందవలసిన సందర్భాలు వచ్చినవి. ఈ సందర్భంలో ప్రభుత్వంవారు యీ మధ్య ఒక G. O. పాస్ చేస్తూ, అందులో వారంతా తిరిగి పరీక్షలు పాస్ అయితేనేగాని ప్రమోషన్‌కు అర్హులు కాదని చెబుతున్నారు. 10, 15 సంవత్సరాలు ఉద్యోగం చేసి అనుభవం పొందినవారు యీనాడు యిరిగేషన్ డిపార్టుమెంటులో అనేకమంది ఉన్నారు. వారందరినీ తిరిగి పరీక్షలకు కూర్చోమంటే మేమెలా యిప్పుడుకూర్చోగలం. పైగా యీ వృద్ధాప్యంలో మాకు ప్రమోషన్ రాకపోతే మా యిబ్బందులు ఎలాతీరుతాయి, అనివారు ఆందోళన చెందుతున్నారు, ప్రభుత్వం వీటన్నిటిని గమనించి, వారి అనుభవాన్నే గీటురాయిగా పెట్టుకుని, ప్రమోషన్ ఇవ్వడానికి ప్రయత్నం చేయవలసిందిగా నేను కోరుతున్నాను,

*పబ్లిక్ వర్క్స్ శాఖ మంత్రి (శ్రీ ఎ. సత్యనారాయణరాజు :) అధ్యక్షా, తెలంగాణా ప్రాంతంలోని P. W. D. సూపర్ వైజర్ అప్పర్ సబార్డినేట్ కోర్సు పరీక్ష అయినట్టివారి ప్రమోషన్ కావాలంటే వారు పరీక్షలో ఉత్తీర్ణులు కావాలనే నిబంధన ఎక్కడ లేదు. ఆ విధంగా ప్రభుత్వం ఉత్తర్వు ఏమీ జారీచేయలేదు. తెలంగాణాలో అప్పర్ సబార్డినేట్ పరీక్ష అయినవారు అసిస్టెంటు యింజనీర్సుగా, యింజనీర్సుగా ప్రమోషన్ కావడానికి వీలువుంది. అవిధంగానే వారు ఆ పోస్టులకు

నియమించబడుతున్నారని మనవిచేస్తున్నాను. రాష్ట్ర టెక్నికల్ బోర్డువారి తీర్మానము ననుసరించి రాష్ట్రములో ఎడ్యుకేషన్ శాఖవారు తిరిగి ఉత్తర్వు జారీచేశారు. దాని ప్రకారంగా ఎవరైతే S. S. L. C. లేక H. S. C. లేక మెట్రిక్యులేషన్ పరీక్షతో పాటుగా ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలవారు పెట్టిన ఓవర్సీర్స్ పరీక్షలో ఉత్తీర్ణులై Public Works Department లో మూడు సంవత్సరాలు practical అనుభవం గడించుతారో అటువంటివారు కోర్సుకు హాజరు గాకుండా L. C. E. పరీక్షకు private గా కూర్చోవడానికి అర్హులుగా భావించ బడుతున్నారు. పై నుదహరించిన ఉత్తర్వులను అనుసరించి అప్పర్ సబార్డినేట్ కోర్సు పరీక్ష అయిన సూపర్ వైజర్స్ L. C. E. పరీక్షకు ప్రైవేటుగా కూర్చునే సహాయం యిచ్చుటకు చీఫ్ యింజనీర్ జనరల్ గా అనుమతి ఇచ్చారు. ఆ పరీక్షకు ప్రైవేటుగా కూర్చునవచ్చును, కూర్చోక పోవచ్చును, అది మరి యిష్టా యిష్టాలపై ఆధారపడి వుంటుంది. దీనిపై ప్రభుత్వ వత్తిడి ఏ మాత్రం లేదు. వారి వారి స్వభావాలపై అది ఆధారపడి వుంటుందని మనవి చేస్తున్నాను, అసిస్టెంటు యింజనీరుగా ప్రమోషన్ కావలయునన్న అప్పర్ సబార్డినేట్, సూపర్ వైజర్స్ 15 సంవత్సరాల సర్వీసు పెట్టవలసి వుంటుంది. L. C. E. డిప్లొమా వున్న వారు పది సంవత్సరముల సర్వీసువుంటేనేగాని ప్రమోషన్ కు అర్హులు కాజాలరు. L.C.E. డిప్లొమాకు అప్పర్ సబార్డినేట్ కోర్సు పరీక్ష సమమా. కాదా అనే విషయం P. W. D. అడిషనల్ సెక్రెటరీ, చీఫ్ యింజనీర్ జనరల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ఉస్మానియా యూనివర్సిటీ యింజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ గారితో కూర్చుని, సమావేశంలో చర్చించబడి యీ క్రింద ఉదహరింపబడిన కారణాలవలన L.C.E. కోర్సు, అప్పర్ సబార్డినేట్ కోర్సు కంటె ఎక్కువ అని నిర్ధారణ చేయటం జరిగింది.

1. L.C.E. కోర్సు ప్రాక్టికల్ ట్రెయినింగ్ ఒక సంవత్సరం గాక మూడేళ్ళ కాల పరిమితి కలిగివుంది గనుక—

2. L.C.E. సిలబస్ అప్పర్ సబార్డినేట్ సిలబస్ కంటె ఎక్కువైంది గనుక—

ఈ కారణాల వలన, యింకా యితర విషయాలు సమాలోచించుకొని పైనుదహరించిన కమిటీవారు L.C.E. కోర్సు ఎక్కువ అని సాంకేతిక కారణాలవల్ల నిర్ధారణ చేసి అప్పర్ సబార్డినేట్ కోర్సు పరీక్ష అయిన వారు మూడు సంవత్సరాల ప్రాక్టికల్ అనుభవం వుంటే L.C.E. పరీక్షకు హాజరుపట్టీ లేకుండానే కూర్చోనడానికి అనుమతి

యివ్వడం జరిగింది. కాబట్టి గౌరవసభ్యులు యిచ్చిన notice of motion లోని విషయాలు సరికావని తేలుతున్నది.

## *PAPERS LAID ON THE TABLE OF THE HOUSE*

### *Amendment to the Madras Public Service Commissions Regulations 1950*

**The Chief Minister (Sri D.Sanjeevayya)*: Mr. Speaker, Sir, I beg to lay on the Table of the House a copy of notification issued with G.O.Ms. No.829 General Administration (Services-A) dated 3-7-1961 making an amendment to the Madras Public Service Commission Regulations 1950 as adapted in Andhra Pradesh in accordance with clause (5) of Article 320 of the Constitution.

*Mr. Speaker* : Paper laid on the Table.

### *Amendment to the Andhra Pradesh General Sales Tax Rules, 1957*

* *The Minister for Education and Transport (Sri S. B. P. Pattabhirama Rao)* : Mr. Speaker, Sir, I beg to lay on behalf of the Finance Minister, on the Table, under sub-Section (4) of Section 39 of the Andhra Pradesh General Sales TaxAct,1957 a copy of the amendment to the Andhra Pradesh General Sales Tax Rules, 1957, issued in G.O.Ms. No. 372, Revenue, dated 4-3-61 and published at pages 116-117 of Rules Supplement to Part I of Andhra Pradesh Gazette dated 30-3-61.

*Mr. Speaker* : Paper laid on the Table.

### *Notification issued under Section 11 (1) of the Andhra Pradesh Motor Vehicles Taxation Act, 1931*

*Sri S.B.P. Pattabhirama Rao* : Mr. Speaker, Sir, I beg to lay on the Table under sub-section (2) of Section 11 of the Andhra Pradesh Motor Vehicles Taxation Act, 1931

(Andhra Area Act III of 1931) a copy of the notification issued under Section 11 (1) of the said Act and published at page 452 of Part I of the Andhra Pradesh Gazette, dated 9th February, 1961.

*Mr Speaker :* Paper laid on the Table.

*Notification issued under Section 11 (1) of the Andhra Pradesh Motor Vehicles Taxation Act, 1931*

* *Sri S.B.P. Pattabhirama Rao* : Mr. Speaker, Sir, I beg to lay on the Table under sub-section(2)of Section 11 of the Andhra Pradesh Motor Vehicles Taxation Act, 1931 (Andhra Area Act III of 1931) a copy of the notification issued under Section 11 (1) of the said Act and published at page 638 of Part I of the Andhra Pradesh Gazette, dated 23rd February, 1961.

*Mr. Speaker* : Paper laid on the Table.

*BUSINESS OF THE HOUSE*

మిస్టర్ స్పీకర్ :— నిన్న శ్రీ ప్రగడ కోటయ్యగారు కొన్ని allegations చేశారు. ఆ కాగితాలు యిస్తామన్నారు, వాటిని యీవేళ బల్లమీద పెట్టాలి. ఏ సభ్యు లయినా allegations చేసినప్పుడు మంత్రిగారు జవాబు చెప్పేవరకు ఉండాలి. కాని "చెప్పాము; చక్కాపోయాం" అనడం న్యాయం కాదు. సరైన పద్ధతికాదు. అది unparliamentary అవుతుంది. Routine గా ఏదో మామూలు allegations చేస్తే అదివేరు సంగతి. జవాబు కూడ వింటే మళ్ళీ ఏదైనా expression చేసుకో డానికి కూడ అవకాశం వుంటుంది. అట్లాకాక ఏదోచెప్పి చక్కాపోవడం unparliamentary అని సభ్యులంతా గుర్తు పెట్టుకోవాలని కోరుతున్నాను. స్వతంత్ర పార్టీ లీడరుగారు, ప్రతిపక్షంవారు, మంత్రిగారు-అంతా కోరినారు కాబట్టి ప్రగడ కోటయ్యగారు దాఖలు చేస్తామన్న కాగితాలు యీవేళ సాయంత్రంలోపున తీసుకువచ్చి యివ్వాలని కోరుతున్నాను.

* శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య : అధ్యక్షా, మంత్రులు ఊళ్ళోవుండి, అసెంబ్లీకి attend అయిన తరువాత వారు move చేయవలసినదానిని యింకొక మంత్రి

గారిచేత చేయించడం న్యాయం కాదు. మంత్రులు అసలు హాజరు కాకపోతే యింకొక మంత్రిగారు వ్యవహరించడానికి మీరు పర్మిషన్ యిస్తున్నారు, బాగానే వున్నది. సభకు వచ్చికూడ time కు వెళ్ళిపోవడం, యింకొక మంత్రిగారు ప్రతిపాదించడం సభామర్యాదకు భంగమేమో తమరు ఆలోచించాలని కోరుతున్నాను.

శ్రీ యస్. బి. పి. పట్టాభిరామారావు : మాలో మేము adjust చేసుకొంటున్నప్పుడు వారట్లా చెప్పడం న్యాయం కాదని మనవి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ :— General గా మంత్రులంతా వుండాలి. అంతేతప్ప ఒకరికొకరు adjust చేసుకోకపోతే ఎట్లా? The Cabinet has joint responsibility. It is a very small matter.

*MOTION ON ADDRES BY THE GOVERNOR*

మిస్టర్ స్పీకర్ : గౌరవ సభ్యులు సవరణలను ప్రతిపాదించ గోరుతాను.

శ్రీ పి. సుందరయ్య (గన్నవరం) : Sir, I move :

తీర్మానమునకు చివర యీ క్రింది విషయములు చేర్చాలి :

కాని, కార్మిక వివాదాలలో వచ్చిన ఒప్పందాలను, కనీస వేతన కమిటీ నిర్ణయాలను అమలు జరుపలేకపోయినందుకు, కరువు భత్యాన్ని ధరలు పెరిగేకొద్ది పెంచే సూత్రాన్ని అమలు జరుపనందున, ప్రభుత్వ, స్థానిక సంస్థల ఉద్యోగస్థుల కరువు భత్యాన్ని జీతాలలో సంలీనము చేయనందులకు వర్కు-ఛార్జ్డ్ కార్మికులకు, ఉద్యోగస్థులకు, ఉపాధ్యాయులకు వారికి ఇతరులతో పాటు వేతనాలు అమలు జరుపలేకపోయినందులకు విచారము తెలియజేస్తున్నది.

తీర్మానమునకు చివర యీ క్రింది విషయములు చేర్చాలి :

కాని అనేక ప్రాజెక్టులను, పరిశ్రమలను అవసరమయిన డబ్బులేని పరిస్థితిలో నూతన సెక్రటేరియేట్ బిల్డింగ్స్‌కు ప్రజాందోళనను కూడ లక్ష్యము చేయకుండా ఖర్చు పెట్టే ప్రయత్నాన్ని విరమించనందులకు విచారం తెలియజేస్తున్నది.

తీర్మానమునకు చివర యీ క్రింది విషయములు చేర్చాలి :

కాని ఒక పర్యాయము తాను నిరాకరించిన వ్యక్తినే తిరిగి వైసు-ఛాన్సలరుగా నియమించి అనేక అనుమానాలకు తావివ్వడమే కాక విశ్వ విద్యాలయం నిత్య పరి

పాలనా విద్యాభివృద్ధి పథకాల అమలు గూర్చి భయాందోళన కల్గించినందులకు విచారం తెలియజేస్తున్నది.

తీర్మానమునకు చివర యీ క్రింది విషయములు చేర్చాలి :

కాని సాగు చేసుకుంటున్న లక్షలాది బంజరు సాగుదార్లను, భూముల నుండి తొలిగించమని ఉత్తర్వులు జారీ చేసి, వానిని నేటికి రద్దు చేయనందుకు, బంజరు సాగుదార్లకు పట్టాలు ఇప్పించే కార్యక్రమాన్ని పూర్తి చేయకపోవడమే ఆ పట్టాలివ్వడంలో, స్థానిక ఉద్యోగస్థులు, పెత్తందారుల లంచగొండితనాన్ని అక్రమ చర్యలను రాష్ట్ర ప్రభుత్వం నిరోధించజాలక పోతున్నందుకు విచారాన్ని తెలియజేస్తున్నది.

తీర్మానమునకు చివర యీ క్రింది విషయములు చేర్చాలి :

కాని భద్రాచలం, బూర్గంపాడు, తదితర ప్రాంతాలలోని ఆదిమ వాసులచేత ప్రభుత్వ ఉద్యోగస్థులు వెట్టి చేయిస్తుండడము, చేయలేక పోయినందులకు వారికి భూములమీద వంశపారంపర్య సాగు హక్కులిస్తూ పట్టాలు యివ్వనందుకు, భూస్వాములు దానిని ఆక్రమించుకోకుండా కాపాడుకోలేక పోయినందుకు విచారాన్ని తెలియజేస్తూంది.

తీర్మానమునకు చివర యీ క్రింది విషయములు చేర్చాలి:

సహకార సంఘాలలోను, పంచాయతీలలోను ప్రభుత్వం తమ ఆశయాలకు అనుకూలంగా, న్యాయానికి, ప్రభుత్వ నియమాలకు కూడ వ్యతిరేకంగా నిత్య పరిపాలనా వ్యవహారాలలో జోక్యము కల్గించుకుంటున్నందులకు విచారిస్తున్నది.

*Mr. Speaker*: Amendments moved.

*Sri* P. *Rajagopal Naidu (Tavanampalli)*: Sir, I move.

Add the following at the end—

"But regret to find that no mention has been made to the flood havoc in Andhra area and the relief measures to be taken up to help the sufferers."

Add the following at the end—

"But regret to note the absence of any reference to the grave situation caused in the City of Hyderabad due

to the indefinite closure of Colleges and Schools in the twin cities of Hyderabad."

Add the following at the end—

"But regret to note that no mention has been made to the amending of Survey and Boundaries Act to rectify mistakes committed during survey operations which resulted in the deprivation of lands for thousands of peasants in taken over Estates in the State."

Add the following at the end—

"But regret for not mentioning giving up remission to the additional cess on Sugarcane due to the steep fall in the prices of jaggery."

Add the following at the end—

"But regret to note that the Governor has not mentioned regarding allotting funds to rural housing."

Add the following at the end—

"But regret that the Revenue Minister has not sent specific orders to the revenue authorities not to reject applications without survey numbers of the lands for which they require pattas."

Add the following at the end —

"But regret to find that the Government is pursuing an adamant policy of extending Cc-operative Farming even after its complete failure and though package scheme proved very much superior to it in many respects including increased production."

*Mr. Speaker :* Amendments moved.

*Sri Vavilala Gopalakrishnayya* : Sir, I move.

Add the following at the end—

"But regret to note that no contradiction was made to the Statement of Mr. Gulhati that he had yet to scrutinise the way the data was collected and maintained and that he had still to arrive at a formula to assess the discharges in the rivers and that the 1951 agreement on river waters was arrived at an unsufficient data."

*Mr. Speaker:* Amendment moved.

శ్రీ బి. శంకరయ్య (బుచ్చిరెడ్డిపాలెం_జనరల్) : Sir, I move.

తీర్మానమునకు చివర యీ క్రింది విషయాలు చేర్చాలి :

గవర్నరుగారు తన ప్రసంగములో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులకు పెంచిన అదనపు జీతాలను తగ్గించాలని గాని, మూసివేసిన కాలేజీలను స్కూళ్ళను తీయాలని గాని చెప్పనందులకు యీ సభవారు విచారిస్తున్నారు.

తీర్మానమునకు చివర యీ క్రింది విషయాలు చేర్చాలి :

62 వ సంవత్సరము ఇంజనీరింగు కళాశాలలో చేరుటకు అవకాశము లేకుండా చేసిన ప్రభుత్వ విధానాలను తప్పని గవర్నరుగారు తన ప్రసంగంలో చెప్పనందులకు యీ సభవారు విచారము తెలుపుచున్నారు.

తీర్మానమునకు చివర యీ క్రింది విషయాలు చేర్చాలి :

గవర్నరుగారు తన ప్రసంగములో నెల్లూరు జిల్లా కోవూరు తాలూకాలోని కనిగిరి రిజర్వాయరు క్రింద నున్న ఈ క్రింది గ్రామాలకు 20 సంవత్సరములుగా రెండవ కారుకు నీళ్ళు యివ్వక నిరాకరించడమే గాక ప్రస్తుతము చీఫ్ ఇంజనీరుగారు ఇరిగేషను అలగానిపాడు, పురిణి, ఊటుకూరు, దండిగుంట గ్రామాలకు రెండవ కారుకు నీళ్లు ఇచ్చుటకు అంగీకరించినప్పటికి ప్రభుత్వం ఇంతవరకు ఆమోదించని చర్యను విమర్శించనందులకు ఈ సభవారు విచారమును తెలుపుచున్నారు.

తీర్మానమునకు చివర యీ క్రింది విషయాలు చేర్చాలి.

గవర్నరుగారు తన ప్రసంగములో నెల్లూరు జిల్లాలోని కోవూరు నెల్లూరు తాలూకాలోని చెరువు తట్టు భూములు సాగుచేస్తున్న పదివేల కుటుంబాల పేదలకు షుమారు 20 సంవత్సరములుగా సాగు చేసుకొంటున్న భూములలో సాగు చేయరాదని ప్రభుత్వం అక్రమంగా వేసిన ఉత్తరువును రద్దు చేయమని చెప్పనందులకు ఈ సభవారు విచారము తెలుపుచున్నారు.

తీర్మానమునకు చివర యీ క్రింది విషయాలు చేర్చాలి:

కృష్ణా కాలేజి క్రిందనున్న షుమారు 20 వేల యకరాలను సాగుచేస్తున్న పేదలను వెంటివేసి సదరు భూములను వేలంవేసి భూస్వాములకు, ఆ భూములు కట్టిపెట్టుటకు ప్రభుత్వం చేసిన ఆర్డరును ఉపసంహరించుకోవాలని గవర్నరుగారు చెప్పనందులకు ఈ సభవారు విచారము తెలుపుచున్నారు.

తీర్మానమునకు చివర యీ క్రింది విషయాలు చేర్చాలి:

నెల్లూరు జిల్లా కోవూరు తాలూకా ఊటుకూరు గ్రామములో తుంగచెరువు డ్రైయినేజి కాలువ రిపేరు చేయనందున 1960–61 లో పంటలు పూర్తిగా నష్టపడి ప్రభుత్వం రెమిషన్ ఇచ్చినది. స్వల్ప మొత్తముతో త్రవ్వగ సదరు కాలువను ఇంత వరకు రిపేరు చేయని ప్రభుత్వ చర్యను గవర్నరుగారు తన ప్రసంగములో విమర్శించ నందులకు ఈ సభవారు విచారము తెలుపుచున్నారు.

తీర్మానమునకు చివర యీ క్రింది విషయాలు చేర్చాలి:

ఆంధ్ర ప్రదేశ్‌లో చేనేత పారిశ్రామికులు నూలు ధర పెరిగి, రిబేటు తగ్గించబడి నందున అనేక కష్టనష్టాలకు గురి అవుతూ పస్తులుకూడ ఉండవలసిన దుస్థితి యేర్పడి యుండగా గవర్నరుగారు తన ప్రసంగములో ఆ విషయము తెల్పనందులకు ఈ సభ వారు విచారము తెలుపుచున్నారు.

తీర్మానమునకు చివర యీ క్రింది విషయాలు చేర్చాలి:

పాటూరు చేనేత పారిశ్రామిక సహకార సంఘము యొక్క పాలక వర్గమువారు (నెల్లూరు జిల్లా) ఆ గ్రామములోని చేనేత పారిశ్రామికులను సభ్యులుగా చేర్చుకొనక ఇబ్బందుల పాలు చేస్తున్నందున ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ రిజిస్ట్రారుగారు సదరు పాటూరు చేనేత పారిశ్రామిక సహకార సంఘ పాలకవర్గాన్ని రద్దుచేయడం శ్రీ చిన్న

పరిశ్రమల మంత్రిగారు అక్రమంగా అన్యాయంగా కలుగజేసుకొని ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ రిజిష్ట్రారుగారి ఆర్డరుపై స్టే యిచ్చినారు. సంవత్సరంగా యీ విషయాన్ని ముఖ్యమంత్రిగారికి తెలుపుతున్నప్పటికి ఇంతవరకు స్టే తొలగించని ప్రభుత్వ చర్యను, గౌ. గవర్నరుగారు తన ప్రసంగములో విమర్శించనందులకు యీ సభవారు విచారము తెలుపుచున్నారు.

తీర్మానమునకు చివర యీ క్రింది విషయాలు చేర్చాలి :

ఇంజనీరింగు, వైద్యము మొదలగు కళాశాలలో విద్యార్థుల సెలక్షనుకు కమిటీలను తీసివేసిన ప్రభుత్వమే నెల్లూరులోని బి. ఇడి. ట్రైనింగ్ కళాశాలకు కమిటీ నియమించిన అక్రమ చర్యను-సదరు కమిటీ విద్యార్థుల సెలక్షన్‌లో క్రమ విరుద్ధ చర్యలు జరుగుతున్నప్పటికీ విచారణకూడ జరుపని విద్యామంత్రి చర్యను గౌ॥ గవర్నరుగారు పేర్కొనని సందులకు యీ సభవారు విచారము ప్రకటిస్తున్నారు—

*Mr. Speaker* : Amendments moved.

*శ్రీ ఎస్. కాశిరెడ్డి (పొదిలి) : Sir, I move.

తీర్మానమునకు చివర యీ క్రింది విషయాలు చేర్చాలి :

నెల్లూరుజిల్లా పొదిలితాలూకా అభివృద్ధికి సహాయపడు మేకలేరు, దొంగ్లేరు, మూడవ ప్రణాళికలో చేర్చబడిన ముక్కు పాపయ్యచెరువు, అన్లేరు చెరువుల మంజూరును గురించి ప్రస్తావన చేయనందుకు.

తీర్మానమునకు చివర యీ క్రింది విషయాలు చేర్చాలి.

ఫ్లోరిన్‌వల్ల ప్రజలు బాధపడుచుండగా సదరు పట్టణానికి 'నీటి సరఫరా పథకాన్ని మంజూరుచేయు విషయాన్నిగురించి ప్రస్తావన చేయనందులకు—

తీర్మానమునకు చివర యీ క్రింది విషయాలు చేర్చాలి :

గవర్నరుగారి ప్రసంగంలో పొదిలి ఆస్పత్రిని అభివృద్ధి చేయుటను గురించి ప్రస్తావన చేయనందుకు—

తీర్మానమునకు చివర యీ క్రింది విషయాలు చేర్చాలి :

గవర్నరుగారి ప్రసంగంలో నెల్లూరుజిల్లాలో ఆర్. డబ్ల్యు. ఎస్. పథకం పూర్తి చేయబడిన శావులకు యింతవరకు డబ్బు మంజూరు కాకపోవటాన్ని గురించి, సదరు పథకాన్ని 1961–62 సంవత్సరంలో కొనసాగించుటను గురించి ప్రస్తావన చేయనందుకు,

తీర్మానమునకు చివర యీ క్రింది విషయాలు చేర్చాలి.

గవర్నరుగారి ప్రసంగంలో నెల్లూరు జిల్లాలోని దర్శి, పొదిలి, కనిగిరి మొదలగు మెట్టతాలూకాలలో వ్యవసాయానికి విద్యుచ్ఛక్తి సరఫరాను గురించి ప్రస్తావించనందులకు—

*Mr. Speaker* : Amendments moved.

**Sri Vavilala Gopalakrishnayya (Sattenapalli)* : Sir, I move:

Add the following at the end—

"But regret to note that no mention has been made about the implementation of the suggestions of the Administrative Reforms Committee."

Add the following at the end-

"But regret to note that no mention has been made about the solving of the problem of unemployment in Educational and agrarian sectors."

Add the following at the end—

"But regret to note that no mention has been made about the location of Heavy Electricals Projects in full in Andhra Pradesh."

*Mr. Speaker* : Amendments moved.

* శ్రీమతి వై. సీతాకుమారి (బన్స్వాడ): అధ్యక్షా, ఉభయ శాసనసభలను ప్రారంభిస్తూ గవర్నరుగారు ప్రసంగించినందుకు వారికి కృతజ్ఞత తెలియజేస్తున్నాను. గవర్నరు సచార్‌గారు, శ్రీమతి లలితాసచార్‌గారు కూడ అనేక రాష్ట్రాభివృద్ధి కార్యాలలో చాల శ్రద్ధ తీసుకొంటున్నారు. ఇకముందు కూడ అట్లాగే శ్రద్ధతీసుకుంటారని ఆశిస్తూ వారికి కృతజ్ఞత తెలుపుతున్నాను. ఏయే రంగాలలో అభివృద్ధి జరుగుతున్నదో, మనం అనుకున్న దానికంటే బాగా జరుగుతున్నదో వారు చెప్పారు. మనది విశాలమైన రాష్ట్రం కనుక కావలసిన పనులు చాల వున్నాయి. మూడవ ప్రణాళికలో అన్నీ జరగాలని మనం కోరుకొందాము. ఇంకా కొన్ని జిల్లాలలో తెలుగును అధికార భాషగా ప్రవేశ పెట్టుతున్నట్లు చెప్పారు. అన్ని జిల్లాలలో కూడ తెలుగు భాషలో వ్యవహారాలు జరిగేటట్లు చేయాలి. అసెంబ్లీ వ్యవహారాలలో కూడ కొందరు గౌరవ సభ్యులు ఎన్నిసార్లు చెప్పినప్పటికీ అన్ని ప్రకటనలు తెలుగులో యివ్వడంలేదు. Notices, Notifications, Gazettes యీ ముద్రణా విషయాలన్నీకూడ తెలుగులో యిచ్చేటట్లు ప్రయత్నం చేయాలని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: ఇప్పుడున్న పద్ధతిలో జరిగితే బహుశా 50 ఏండ్లు పట్టుతుందేమో !

శ్రీమతి వై. సీతాకుమారి: మనం విద్యా విషయంలో ముందుకు పోయాము, ప్రభుత్వం నిర్బంధ ప్రాథమిక విద్య ప్రవేశ పెట్టుతున్నది. Mid-day meals కూడ పెట్టుతున్నారు. దీనివల్ల చాల ఉపయోగం ఉన్నది. పల్లెటూళ్ళలో 2,3 మైళ్ళ దూర ప్రాంతాలనుంచి పాఠశాలలకు వస్తుంటారు. ప్రభుత్వంవారు శ్రద్ధ తీసుకొని అన్నిచోట్ల కూడ mid-day meals పెట్టించే ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.

గవర్నరుగారు స్త్రీ సంక్షేమ విషయం కూడ ప్రసంగించారు వీరి విషయంలో మన ప్రభుత్వం శ్రద్ధ వహిస్తున్నది, శ్రీమతి దుర్గాబాయిగారు వెనుకబడిన స్త్రీలకు అనాథ స్త్రీలకు విద్యా సౌకర్యాలు కలిగించడానికై అనేక పెద్ద ప్రణాళికలు వేశారు. దీనిని ప్రభుత్వం గమనించి యిప్పుడున్న అనాథాశ్రమాలే కాకుండా యింకా Rescue Homes, After Care Homes ఏర్పాటు చేయాలి. వీటిలోని వయోజనులైన స్త్రీలకు విద్యగరపడానికి ప్రతి జిల్లాలోకూడ పాఠశాలలు పెట్టించాలని కోరుతున్నాను. 3 వ ప్రణాళికలో యింకా ఎక్కువ శరణాలయాలు ఏర్పాటు చేయాలి, దీనివల్ల చాలా పని జరుగుతుంది. భర్తను విడిచిన స్త్రీలు, వితంతువులు మున్నగువారికి ప్రయోజనం కలుగుతుంది. ఇటువంటి స్త్రీలు చాలమంది వున్నారు. కనుక పాఠశాలలు ఎక్కువగా పెట్టి condensed courses ఏర్పాటు చేయాలి. పబ్లిక్ హెల్తుశాఖలో నర్సులు, టీచరుల కొరత ఎక్కువగా వున్నది. ఈ సెంటరులు ఎక్కడెక్కడ పెట్టుతున్నారో,

వాటికి సంబంధించిన విషయాలేమిటో శాసనసభ్యులకు పంపించినట్లయితే మాకు తెలిసిన వారిని అక్కడకు పంపడానికి వీలుగా వుంటుందని మనవిచేస్తున్నాను.

గవర్నరుగారు గుల్హాటి కమిషను రావడం గురించి కృష్ణా గోదావరి నదీజలాల పంపిణీ గురించీ ప్రసంగించారు. ఏ పరిస్థితులలో కూడ మనం 1951 ఒడంబడికను వదిలి వెనుకకు పోము మనకు ఆహార పదార్థాల ఉత్పత్తికి నీరు కావాలి. ఇతర రాష్ట్రాల వారికి పరిశ్రమల కొరకు కావాలి కనుక మనకే ప్రయారిటీ యివ్వవలసి వుంటుంది. ఈ విషయంలో ప్రభుత్వం గట్టిపట్టుదల వహించాలి. గుల్హాటి కమిషను చెప్పేది విని ఏమైనా 1951 ఒడంబడికను వెనుకకు పోకూడదని విన్నవిస్తున్నాను. వెనుకబడిన జాతుల గురించి వారి ప్రసంగంలో లేదు. కాని మన గవర్నమెంటు ఇతర దేశాలకంటె మన దేశంలో వెనుకబడిన జాతులవారికి అండదండ లిస్తున్నది. ఇది చాల ముఖ్యమైన విషయం: యింకా ఎక్కువ చేయవలసియున్నది. హరిజనులలోను, ఇతర వెనుకబడిన జాతులలోను కూడ స్త్రీలు ఎక్కువగా వున్నారు. వీరందరికీ ఎక్కువ సమపాయాలు కలిగించాలి.

మనకు బంజరు భూములు ఎక్కువగా వున్నాయి. భూములు కావలసిన వారు చాలమంది ఉన్నారు. పంపిణీ చాల ఆలస్యంగా జరుగుతోంది, ఇదివరకు మేము జిల్లాలో పాదయాత్రలు చేసినప్పుడు చూచాము. శాసనసభ్యులకు, కాంగ్రెసు వ్యక్తులకు, యింకా యితర పెద్ద మనుషులను ఒక సబ్ కమిటీ క్రింద వేసినట్లయితే బాగుంటుంది. ఎక్కువ భూమి ఉన్నట్లయితే సహకార సేద్యానికి ఏర్పాటు చేసి హరిజనులకు, వెనుకబడినవారికి యివ్వడానికి ప్రయత్నం చేయాలనికూడా చెప్పాము.

స్త్రీల సంక్షేమం కోసం ముందుముందు ప్రభుత్వం బాగా పనిచేసి అన్ని విషయాల లోను వారిని ముందుకు తీసుకురావాలని కోరుతూ గవర్నర్ గారికి కృతజ్ఞత తెలుపు తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

*శ్రీ పి. బాపయ్య (తిరువూర్):- అధ్యక్షా, గవర్నరుగారి ప్రసంగమునకు అభి నందన తెలియజేస్తూ తెచ్చిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. గవర్నరుగారు తమ ప్రసంగంలో ఆంధ్ర ప్రజానీకాన్ని ఆందోళన పరుస్తున్న గుల్హాటీ కమిషను నిర్మాణం విషయంలో మన అభిప్రాయాలను గట్టిగా చెప్పలేదని నేను అభిప్రాయపడుతున్నాను. 1951 కృష్ణా గోదావరి నీటి పంపకం ఒడంబడికను తిరగదోడడానికే ఆ కమిషన్ ఏర్పాటు చేయబడ్డదనే అభిప్రాయం ఆంధ్ర ప్రజానీకంలో బాగా వ్యాపించి ఉంది. అంతేకాక ఈ మధ్య మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయిన చవాన్‌గారు మైసూరు ముఖ్యమంత్రి అయిన శెట్టిగారు ఇస్తున్న స్టేటుమెంట్లు చూస్తే ఆంధ్రులకు అన్యాయం

జరుగుతుందేమో అనే భయం ప్రతివారిలోను లేకపోలేదు. ఈ విషయంలో ప్రభుత్వం గట్టిగానే ఉంది. శాసనసభ ఏకగ్రీవంగానే తీర్మానించింది. కవున్సిలు కూడా ఏకగ్రీవంగానే తీర్మానించింది. అన్ని పార్టీలు గట్టిగా పట్టుదలగా 1951 ఒడంబడిక అమలు జరిగి తీరాలనే అంటున్నారు. ఏమైనప్పటికీ మనకంటె కూడా మహారాష్ట్ర మైసూరు ప్రభుత్వాలు ఇతర రాష్ట్రాల యొక్క సానుభూతిని సంపాదించుకుంటున్నారేమో ఆంధ్రేతర పత్రికలలో ఎక్కువగా వారికి ప్రచారం జరుగుతున్నదేమో అనే భయంఉంది. ప్రభుత్వం శాసనసభ గట్టిగా ఉండడమే కాకుండా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈ ఒడంబడికను ఏ మాత్రం మార్చడానికి వీలులేదని గట్టి పట్టుదలను చూపించవలసి ఉంటుందని అన్నిచోట్ల సభలు జరిపి తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించవలసిన అగత్యం ఉందేమో ఆలోచించాలని కోరుతున్నాను. వారంరోజులు కృష్ణా వరదలు వచ్చి చాలా భీభత్సవము చేసినవి. మద్రాసు, మైసూరు, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాలలో వరదల భీభత్సవము మనకంటె ఎక్కువగా ఉందని చెప్పుకోవచ్చును, కాని ధాన్యాగారం అని చెప్పబడే కృష్ణాజిల్లాలో వరదలవల్ల అమితమైన నష్టం వచ్చింది. వారంరోజులలో కృష్ణకు రెండు సార్లు వరదవచ్చింది. మొదట 18 అడుగుల 5 అంగుళాల వరకు వచ్చింది. దానికే ఎంతో నష్టం జరిగింది. అవనిగడ్డ తాలూకాలో 20 గ్రామాలు నీటిమయమైపోయినవి, దాదాపు 15వేల ఎకరాల వరకు పంట నష్టమైనది. అనేకవేల మంది జనం నిరాశ్రయులైనారు. వెంటనే ఆ వారంలోగానే, రెండవసారి 19అడుగుల 5 అంగుళాల వరకు వచ్చింది. 12 సంవత్సరాలు ఈ మధ్య ఇంత ఎక్కువ వరద ఎప్పుడూ రాలేదు. ఇంతవరకు సరియైన లెక్కలు రాలేదు. కాని ఎన్ని గ్రామాలు నీటి మయమై పోయాయో ఎన్నివేల ఎకరాలు పంట నష్టమై పోయిందో. ఎంతమంది నిరాశ్రయులై పోయినారో చూసుకుంటే భయంగాఉంది. ప్రభుత్వం ఈ విషయంలో తగిన శ్రద్ధ తీసుకోవడం లేదని నేను చెప్పడంలేదు. కలెక్టరు మొదలైన ఉద్యోగులు చేయవలసిన పనులు చేస్తూనే ఉన్నారు' కాని అది చాలదు. శాశ్వత నివారణో పాయానికి ప్రయత్నం చేయాలేకాని అప్పటికప్పుడు వచ్చిన తరువాత ఏదో చేస్తున్నాం అంటే లాభంలేదు. దానివల్ల ఉపయోగంలేదు. కృష్ణా కరకట్టలను ఇదివరకుకంటె ఎక్కువ బలంగా పెంచాడానికి మొదటనే డబ్బు ఎక్కువ ఖర్చుచేస్తే ఇటువంటి భయం లేకుండా ఉండేది. వర్షాకాలం పోలేదు; ఇంకా ప్రారంభంలోనే ఉంది. ఈ వర్షాకాలంలో ఎన్నోసార్లు ఉధృతంగా వరదలు వచ్చి నష్టంకలుగ జేస్తాయనే భయం అందరికి ఉంది. ఆ విషయంలో ప్రభుత్వం శాశ్వత నివారణో పాయానికి ఎక్కువ ప్రయత్నం చేయాలని కోరుతున్నాను. బెజవాడలో కృష్ణలంక మునిగిపోయింది, ఆనకట్టకు దిగువభాగంలో వుండే గ్రామాలు, ఇబ్రహీం పట్నం, కేశనగుంట మొదలైన గ్రామాలు నీటి మయమైపోయాయి, విజయవాడ-హైదరాబాదు రోడ్డు నాలుగు మైళ్ళ పొడవునా నీటి మయమైపోయింది. పడవలలో వెళ్ళవలసిన పరిస్థితి వచ్చింది, విజయవాడ వచ్చేబస్సులు ఆగిపోయాయి. ఈ విషయాలన్నీ గట్టిగా ఆలోచించ

వలసిందని కోరుతున్నాను. పంచాయతీ రాజ్యం ఏర్పాటు చేసుకున్నాము, అన్ని రాష్ట్రాలకంటె మనంముందు ఉన్నాము. 18 మాసాలైనది, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసు కుంటున్నాము, పంచాయితీరాజ్యం వచ్చినతరువాత గ్రామాలు అభివృద్ధి అవుతున్నవని చెప్పడంలో సందేహంలేదు, ఒకటి, రెండు విషయాలున్నాయి, హైవెస్ క్రింద జిల్లా బోర్డులక్రింద ఉండేరోడ్లు పంచాయితీ సమితులకు స్వాధీనపరిచారు, పంచాయితీ సమితులకు వచ్చే ఆదాయం ఎంత? అందులో పెద్ద రోడ్లను ఏవిధంగా maintain చేస్తారు? నానియోజక వర్గంలో తిరువూరునుంచి రాజారాం వెళ్ళే 18 మైళ్ళ రోడ్డువుంది. విస్సన్న పేటనుంచి కృష్ణాపురం వరకు 15 మైళ్ళరోడ్డు ఉంది. ఈ రెండురోడ్లు పంచాయితీ సమితులకు ఇచ్చారు. వీటిపై R. T. C. పెద్ద బస్సులు ఊరికే నడుస్తూవుంటే రోడ్లు గండ్లు పడి ఎందుకు పనికిరాకుండా, బస్సులు, బండ్లు నడవడానికి లేకుండా పోయాయి. వీటిని ఎట్లా maintain చేస్తారు? పంచాయితీ సమితి సుముఖంగానే ఉంది, డబ్బుఎక్కడనుంచి వస్తుంది? పెద్ద పెద్ద రోడ్లను హైవేస్ తీసుకుని maintain చేయాలి, అప్పుడే ప్రయాణ సౌకర్యాలు ఏర్పడే అవకాశం ఉంది, మైనర్ ఇరిగేషన్ కూడా సమితులకు అప్పగించారు, సంతోషం, అక్కడ నష్టంవస్తే వారికే బాగా తెలిసివుంటుంది, కాబట్టి బాగుచేయడానికి అవకాశం ఉంటుంది. ఎక్కడైనా డబ్బుఖర్చుపెట్టి రిపేరు చేయాలంటే సమితిముందు నిర్ణయించాలి. తరువాత అది జిల్లాపరిషత్తుకు పోవాలి, అక్కడ స్టాండింగ్ కమిటీలో శాంక్షన్ అయి తిరిగి వస్తేనే కాని ఏమీ చేయడానికి అవకాశంలేదు, మైనరు ఇరిగేషన్ పనులు చేయాలంటే, అప్పటికప్పుడు ఏ చెరువైనా తెగిపోతే, గండిపడితే రిపేరు చేయించేటట్లు వుండాలి కాని సమితి సమావేశమై నిర్ణయించడం. జిల్లాపరిషత్తుకు పంపడం, అక్కడ స్టాండింగ్ కమిటీ శాంక్షన్‌చేసి తిరిగి పంపడం అంటే ఎంతో కాలం పడుతుంది, దీనివల్ల నకాలంలో మనకు ఏమైనా లాభంకలుగుతుందా? ఇటువంటి జాప్యం జరుగకుండా వుండేపద్ధతి ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.

విద్యవిషయంలో ప్రభుత్వంవారు ఎంతో అభివృద్ధి చేస్తున్నారు. సందేహంలేదు, నిర్బంధ ప్రాథమిక విద్య ఏర్పాటు చేస్తున్నాం మూడవ ఫారంవరకు విద్యను ఇస్తున్నాం ఇవన్నీ పెద్దవిషయాలే.

(Srimathi T. Lakshmikanthamma in the Chair)

అంతేకాదు. ఏరాష్ట్రంలోనూ లేనటువంటిది మన రాష్ట్రంలో స్త్రీలకు పాలిటెక్నికు కళాశాల కూడా ప్రభుత్వమువారు పెడుతున్నారు. ఇవన్నీ అభివృద్ధికార్యక్రమాలు జరుగుతున్నాయి, సందేహంలేదు, అయితే మూడవ ప్రణాళికలో విద్యకు కేటాయించినడబ్బు సరిపోయే టట్లులేదు, ప్రాథమిక విద్య అభివృద్ధి కావా

అంటే పల్లెటూర్లలో ఉన్న పాఠశాలలు పిల్లలను ఆకర్షించ గలిగినస్థితిలో ఉండాలి. ప్రస్తుతం ఆవిధముగాలేదు, సూర్యచంద్రులు ఉంటూ వర్షానికిఅడ్డులేనిచిన్నచిన్నపాకలలో పిల్లలకు ఉత్సాహం ఎట్లావస్తుంది? చదువు ఎట్లావస్తుందిదీనికిడబ్బుఎక్కువఖర్చుచేసి గ్రామాలలో బాలురను బాలికలనుఆకర్షించగలిగినపాఠశాలలుఏర్పాటుచేయాలి. స్వరాజ్యమువచ్చిన తరువాత ఎన్నోపాఠశాలలు పెట్టుకుంటున్నాం. సందేహంలేదు. వైద్యసౌకర్యాలుగ్రామాలలో చాలాతక్కువగా ఉన్నాయి. తాలూకాకు ఒక ఆసుపత్రి కూడా లేని తాలూకాలున్నాయి. L.F. ఆసుపత్రులను గవర్నమెంటు ఆసుపత్రులుగా చేస్తున్నాం అన్నారు. చాలా సంతోషం. ప్రతి తాలూకా ఆసుపత్రికి 30 beds ఉండేటట్లు చేస్తాం అన్నారు. X-ray plants కూడా ఉండాలి. అది లేకపోతే వందమైళ్ళ దూరంలో ఉన్న జిల్లా హెడ్ క్వార్టర్స్ ఆసుపత్రికి పోవాలి. దానివల్ల చాల నష్టమూ, ప్రమాదమూ ఉన్నాయని నేను ప్రత్యేకంగా మనవి చేయవలసిన అవసరంలేదు.

శ్రీ డి. నరసయ్య : నల్లగొండ జిల్లాలో జిల్లా ఆసుపత్రిలో కూడా X-ray plants లేదు.

శ్రీ పి. బాపయ్య : ఇంకొకటి మనవి చేసేదేమంటే తిరువూరు తాలూకా హెడ్‌క్వార్టర్స్‌లో ప్రైమరీ హెల్తు సెంటర్ ఉంది. దానిని తాలూకా హెడ్‌క్వార్టర్సు ఆసుపత్రిగా మార్చి ప్రైమరీ హెల్తుసెంటరును ఇంకొక గ్రామంలో పెట్టించడానికి ప్రణాళికా శాఖామాత్యులు అనుమతియివ్వవలసినదని నేనుమీద్వారా కోరుతున్నాను.

అధ్యక్షా, రోడ్ల విషయం మనవిచేశాను. నాగార్జునసాగర్ ప్రాజెక్టు బ్రహ్మాండముగా సాగుతోందని గవర్నరుగారి ప్రసంగములో చెప్పారు. సంతోషము. నాగార్జునసాగర్ ఎడమ కాలవ విషయంలో చాల సందేహముగా ఉంది. ఎడమకాలవ తిరువూరు నూజివీడు చింతలపూడి తాలూకాలకు వస్తుందని చెప్పారు. ఇప్పుడు second stage లేదంటున్నారు. ఈవిధముగా ఉంది. ఈ పరియాలోనే మొత్తంమీద నాలుగు చిన్నచిన్న స్కీములు, మైనరుఇరిగేషన్ స్కీములు రెండుమూడులక్షలఖర్చుతో పూర్తిఅయేస్కీములున్నాయి.P.W.D. మంత్రి గారిని ఎంతోకాలం నుంచి ప్రార్థిస్తున్నాను. నా నియోజకవర్గంలో నెదుళ్లవాగు స్కీముంది. అన్నీసిద్ధంగాఉన్నాయి. అయిదారుసంవత్సరాలనుంచి కర్నూలు నుంచి ప్రతి పర్యాయం ఈ స్కీము ప్రారంభించవలసిందిగా నేను వారిని కోరుతునే ఉన్నాను. ఇంతవరకు ఆ పని జరగడం లేదు. నా నియోజకవర్గంలో కాకట్టు వెదుళ్ళవాగు స్కీములు తప్పకుండా ఈ సంవత్సరం శాంతును చేయాలి. వర్షాలు తగ్గిన తరువాత అక్టోబరు, నవంబరు నెలలో నయినా foundation మంత్రిగారు వేయవలసినదిగా నేను వారికి మనవి చేస్తున్నాను. మన ముఖ్యమంత్రిగారు వెనుకబడ్డ జాతులవారి సంబంధంలో ఉద్యోగుల ప్రమోషన్సుకు సంబంధించిన ఒక జి.ఓ.

పాసు చేశారు. చాలా సంతోషం. జన సంఖ్యలో సగము మంది వెనుకబడి ఉన్నారు. పూర్వం మదరాసు రాష్ట్రంలో మనం ఉన్నప్పుడు బ్రహ్మణేతర ఉద్యమం వచ్చి ఉద్యోగాలకు సంబంధించి G. O. పాసుచేశాడు. బ్రాహ్మణేతరులు కొంచెం ఎక్కువ సంఖ్యలో వచ్చారు. కాని వెనుకబడ్డ జాతుల వారు రాలేదు. ఈవిషయంలో ముఖ్యమంత్రి గారు పట్టుదలగా ధైర్యముతో చేసినందుకు వారిని అభినందిస్తూ శలవు తీసుకుంటున్నాను.

*శ్రీ షేక్ మౌలాసాహేబ్ (ఉదయగిరి): అధ్యక్షా, గవర్నరు సందేశాన్ని బలపరుస్తూ కొన్ని సూచనలు ఇవ్వదలచాను. మన ప్రణాళిక జయప్రదంగా అమలు జరగడానికి డబ్బు అవసరం. ఆ డబ్బుకోసం అనేక రకాల సెస్సులు పెంచడానికి ప్రయత్నం చేస్తున్నామంటే ఒక సామెత జ్ఞాపకం వస్తోంది. "ఎంగిలి మింగితే ఆకలి తీరదు" అన్నట్లు ఎన్ని సెస్సులు పెంచినప్పటికీ భరించినవారే భరిస్తున్నారు. అనాడు సెటిల్మెంటు ఏ ప్రాతిపదికమీద జరిగిందో అర్థంకాలేదు. ఆ రకంగా కాకుండా చేస్తే ఇప్పటికంటె రెండింతలు land revenue రావడానికి అవకాశముందని ఏడు సంవత్సరాలనుంచి ఎన్నోసార్లు సూచించాను. ఇది ఒక పెద్ద విషయం కాదు. సెటిల్మెంట్ జరిగేటప్పుడు ఏ ప్రాతిపదికమీద జరిగిందో అర్థంకాలేదు. వండేచోట భూమీపన్ను నీటి తీరువ తక్కువ. పంట బొందుపోయినచోట ఇబ్బడిగా వేస్తున్నారు. దానికి మరింత betterment tax, surcharge వేస్తూ మోయరాని బరువునెత్తిన పెట్టారు. ఉదాహరణకు నెల్లూరుజిల్లాలో ఉదయగిరి తాలూకా స్వామి చెరువు వెలుగొండ క్రిందఉన్నది. వర్షాధారమున్న చెరువుకూడా కాదు. మైనరు ఇరిగేషను చెరువుక్రింద జమీందారీ గ్రామాలు గవర్నమెంటు తీసుకున్న తరువాత 30వేల రూపాయలు ఖర్చు పెట్టి మరమ్మత్తులు చేసి సర్వే సెటిల్మెంటు జరిగి land revenue fix చేసినప్పటికీ దానికి వ్యతిరేకంగా ఈనాడు 20 రూపాయలు వేశారు. పండనిచోట చెరువులక్రింద తరం శిస్తు 7-4-0, 8-4-0 వేస్తే దానికి నీటి తీరువ సర్చార్జిని విధించినా పదిరూపాయల లోపు ఉంటుంది. ఆ దామాషా ప్రకారం నీటి వసరున్న చోట సెటిల్మెంట్ జరిపితే ఇప్పుడు వచ్చే land revenue రెండింతలు పెరుగుతుందని ఎన్నోసార్లు చెప్పాను. మరల సవాలుచేసి చెబుతున్నాను,

ఇప్పుడు పన్నులు భూస్వాములు. ధనవంతులు, దానివల్ల ప్రతిఫలం పొందేవారిపై కాకుండా మధ్య తరగతి ప్రజలపై, బీద తరగతి ప్రజలపై, నిస్సారమైన భూములపై ఎక్కువగా వేసి రెవెన్యూ శాఖవారు ఖర్చు పెడుతున్నారని చెప్పకతప్పదు. అందువల్ల ఇప్పటికైనా రిసెటిల్ మెంట్ జరపాలని కోరుతున్నాను. పంచవర్ష ప్రణాళికద్వారా దేశాన్ని ఉత్తేజవంతంగా చేస్తారని ఆశించాము. 1955 వ సంవత్సరంలో కళా వెంకట

రావుగారు ముఖ్యమంత్రిగా వుండే సమయంలో ప్రతిశాసనసభ్యుడికి మీ నియోజకవర్గం యొక్క అభివృద్ధి ప్రణాళికలు ఏమైనా వుంటే 5 సంవత్సరాల కార్యక్రమంలోకి గాను ముందు ఈ సంవత్సరానికి అందచేయండి అని చెప్పారు. వారి అజ్ఞానుసారంగా 24-4-1955లో మా నియోజకవర్గంలో రహదార్లు లేవు. కాలి నడకన తప్ప మరోవిధంగా వెళ్ళటానికి వీలులేకుండా వుంది కనుక లక్షజనాభా గల నా నియోజకవర్గంలో రహదార్లు కావాలని వ్రాసి ఇచ్చాను. రెండవ పంచవర్ష ప్రణాళికలో మూడు కొత్త స్కీమ్సు చేర్చబడతాయని ఒక రోడ్డు అప్పుడే చేర్చబడిందని ఇంజనీరింగ్ డిపార్టుమెంటు వారు చెప్పారు. ఒక జి. వో. ఇస్యూ చేసి తక్షణం ఈ రోడ్డును నిర్మించాలని నెల్లూరు జిల్లా డివిజనల్ ఇంజనీరును కోరటం జరిగింది. కాని ఆ జి. వో.ను నిర్లక్ష్యం చేయటం జరిగింది. నేను ఈ ప్రభుత్వంతో అనేకసార్లు చెప్పుకొన్నాను. ప్రశ్నల కాలంలో పి. డబ్ల్యు. డి. మంత్రి గారు ఈ పీరియడ్‌లోనే మెటల్ రోడ్డు వేస్తామని శాసనసభలో హామీ ఇచ్చారు. కాని చివరకు ఆ రోడ్డు రెండవ పంచవర్ష ప్రణాళికలో కాదు. 20 సంవత్సరాల మాస్టర్ ప్లాన్‌లో చేర్చామని ఎన్‌డార్స్‌మెంట్ ఇచ్చారు. అది చాలా విచారకరమని మనవి చేస్తున్నాను. ఎడ్మినిస్ట్రేషన్ పూర్తిగా దెబ్బతింది. కాగితాలమీద కళ్ళుమూసుకొని సంతకాలు పెడుతున్నారు. లక్షల జనాభాకు ప్రతినిధిగా వచ్చి అభివృద్ధి జరుగకుండా చూడటం కంటె అసలు శాసనసభకు రాకుండా వుంటే బాగుండేదేమోనని ప్రజలు భావిస్తున్నారు. గవర్నరుగారు నెల్లూరు కరువు ప్రాంతాలను చూడటానికి వచ్చినప్పుడు 14-2-60 వ తేదీన తొమ్మది కాలాల మెమొరాండమును ఇచ్చాను. కాని దానిపై కూడ ఏమీ చర్య తీసుకోలేదు. ఆర్థిక మంత్రిగారికి 6–9–60 న ఒక డి. వో. లెటర్ వ్రాశాను. నేనేమి చెప్పినా, వ్రాసినా ప్రభుత్వం ఏమీ పాటించటంలేదు, ప్రజలకు సమాధానం చెప్పటం కష్టంగా వుంది. నేను 17-4-61 న నేను పి. డబ్ల్యు. డి. మంత్రి గారికి 'నా బోటి వాడికి దుష్ప్రచారం జరుగటానికి అవకాశం వుంది. ఇండియా ప్రభుత్వ ఆశయాలకు ఇక్కడ జరిగేదానికి చాల వ్యత్యాసం వుంది.' అని వ్రాశాను. దానికివారు తప్పక చర్యలు తీసుకొంటామని అన్నారు, కాని ఇంతవరకు ఏమీ జరుగ లేదు. నా బోటివాడు వున్నచోట ఏమీ చేయకూడదని ప్రభుత్వం నిర్ణయించుకొన్నదేమోనని చెప్పుకొంటున్నారు. ఆ విధంగా ప్రచారం జరుగకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వంమీద వుంది. ఎస్టేటు గ్రామాలను గవర్నమెంటు కలుపుకొంది. తరువాత సర్వే సెటిల్ మెంటు జరిగింది. అది జరిగేలోపలే ఫారెస్ట్ ప్రక్కన వున్న కంచెలను రద్దు చేసి ఇవి అనాధీనం, మావే అని రెవెన్యూవారు స్వాధీనం చేసుకొన్నారు. గవర్నమెంటు ఇష్యూ్యర్ చేసిన జి.వో. లను నిర్లక్ష్యం చేసి చీఫ్ కన్‌సర్‌వేటర్‌వారు నిరంకుశంగా ప్రవర్తించారు. అక్రమంగా గైడ్‌లైన్‌ను కొట్టారు. ఫారెస్ట్‌లో వుండే పోరంబోకులను అన్ రిజర్వ్‌డ్‌గా వదలాలని జాయింట్ ఇన్‌స్పెక్టరుకు ఉత్తర్వులు వెళ్ళినా ఆయన పూర్తిలోని పోరంబోకుని తప్ప ఇది వదలము అని చెబుతున్నారు. వీరికి లేని—అధికారాన్ని ఉప

యోగించి చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వమును ధిక్కరించిన ఆఫీసర్‌ను ఏమి చేయాలి? రాజ్యాంగ చట్టంప్రకారం ఏవిధంగా శిక్షించాలి? అతను దేశద్రోహి కాక ఏమవుతాడు? ప్రభుత్వం వీటన్నింటి గురించి ఆలోచించాలి. ఈ విషయాన్ని ముఖ్య మంత్రిగారికి రెండుసార్లు వ్రాశాను. వారు దానిని ఎగ్రికల్చరల్ సైడ్‌కు పంపించాను. చర్య తీసుకొంటాము అని చెప్పారు. ఆ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని మనవి చేస్తున్నాను.

మా ప్రాంతంలో త్రాగటానికి నీరు లేదు. కనిగిరి బావుల స్కీము ఇన్వెస్టిగేష న్‌కు, ప్లాను తయారు చేయటానికి ఇంత డబ్బు కేటాయించాలని గవర్నరుగారికి ఇచ్చిన మెమొరాండంలోను, ముఖ్యమంత్రిగారికి వ్రాసిన దానిలోను పంచాయితీవారు కోరారు. డిజైన్ తయారు చేయటానికి ఒక ఇంజనీరు వచ్చారు. వారు కొన్ని రోజుల తరువాత అక్కడినుండి మారారు. ఆ పిదప మరల ఏమీ పని చేయకపోతే ఎస్టిమేట్స్ తయారు చేయిం చవలసిందని నేను మూడుసార్లు ముఖ్యమంత్రిగారికి వ్రాశాను. ముఖ్యమంత్రిగారు సెక్రటరీగారికి వ్రాశారు. సెక్రటరీగారు కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుకు పంపాడు. ఆయన మంత్రులు చెబితే మేము చేయాలా అనే రకంగా మాట్లాడారు. అవన్నీ శాసనసభలో చెప్పటం బాగుండదు. వారు ఎస్టిమేట్స్ తయారు చేయటానికి పూనుకోకుండా ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లను ధిక్కరించి హిట్లర్ మాదిరి ప్రవర్తిస్తూ వుంటే ప్రభుత్వం మౌనం వహించటం విచారకరమని మనవి చేస్తున్నాను. నిన్ననే గృహ పరిశ్రమలను నెలకొల్పి, అభివృద్ధి చేసి వృత్తులు-కల్పిస్తాం, నిరుద్యోగాన్ని నిర్మూలిస్తాంఅని మంత్రిగారు చెప్పారు, దీనికి సంబంధించి డైరెక్టరు ఆఫ్ కాలేజ్ ఇండస్ట్రీస్ డిపార్టుమెంటు వుంది. అక్కడ భారి పరిశ్రమలయితేనేమి, చిన్న పరిశ్రమలయితేనేమి చాలా స్కీములు కాగి తాలపై వున్నాయి. కాని వాటిపై ఎలాంటి శ్రద్ధ చూపిస్తున్నట్లు కన్పించటంలేదు. జాతీయ వికాస కేంద్రాలద్వారా అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేయిస్తారని ఆశిస్తే వారికి ఇచ్చిన డబ్బు చాలదు. మరి బ్లాక్ సమితులద్వారా దేశాన్ని ఉత్తేజ పరు స్తామని చెప్పటం పరదేశాలలో ప్రచారం చేయటానికా అని అడుగుతున్నాను. అచ్చటి ప్రజలు తిండిగింజలు కూడా కొనుక్కొనే స్థితిలో లేరు. ఆకలి యాత్రలకు బయలుదేరు తున్నారు. ఒకవేళ మధ్యాహ్నం అక్కడ ఎంత మంది వస్తుంటారో మనం ఆలోచించాలి. వారి వోట్లమీదనే ఈ ప్రభుత్వం నడుస్తోందనే సంగతి గుర్తుంచుకోవాలి, మళ్లా వారి దగ్గరకు వెళ్ళిఓట్లను యాచించాల్సిన సమయం వచ్చింది, వారికి ఏ సమాధానం ఇస్తారో ఆలోచించుకోవలసిందిగా కోరుతున్నాను. అయిదు సంవత్సరాల కార్యక్రమంలో కనీసం అయిదో భాగం అయినా చేయకపోతే ప్రజలను ఏ విధంగా తృప్తి పరుస్తారని అడుగుతున్నాను. ప్రజా ప్రభుత్వం అనే పేరే గాని ఈనాడు అనేక గ్రూపులు, ముఠా తత్వాలు బయలుదేరినాయి. ఆనాడు కాంగ్రెస్‌పైన అనేక నిందలు వేసి, చెప్పులు

విసిరి, నల్ల జండాలు చూపి, నిందించి, రాళ్ళు వేసినవారు ఈనాడు నాలుగు అణాలు ఖరీదు అయినందువల్ల వచ్చి కాంగ్రెసులో చేర్నారు. చీమలు పెట్టిన పుట్టలో సర్పాలు చేరినట్లు చేరారు. దానికి తగినట్లుగా పరిపాలన చూస్తే, అదంతా భగ్నపరచి, ఈ కాంగ్రెసు ప్రభుత్వాన్ని అవమాన పరచాలనే ఉద్దేశంతో అనేక రకాలుగా చేస్తున్నారు, ఇది అందరికీ తెలిసినదే కాబట్టి తప్పనిసరిగా కాంగ్రెసు ప్రభుత్వాల యొక్క ప్రఖ్యాతి ప్రపంచమంతా విని విభ్రమగావించి మూర్ఛచెందేటట్లు చేయవలసిన అవసరం ఉన్నది, కనుక మన కాంగ్రెసు యొక్క జండా శాశ్వతంగా నిలచి ముఖ్యంగా చదివారు. వెనుకబడిన జాతులవారు ఈ జండా క్రింద శాశ్వతంగా నిలిచి వారు తిండి, గుడ్డను చేకూర్చుకొనేట్లుగా వారుముందంజవేసి ఆశయాలకు తోడ్పడతారని కూడా వారందరికిఈసభ ద్వారా మళ్ళా హెచ్చరిస్తున్నాను, అనేకమంది ఎన్నోరకాలుగా దుష్ప్రచారాలు చేయవచ్చును. కాని వాళ్ళ దుష్ప్రచారాలకు లోను కాకుండా కాంగ్రెసువారు పెట్టినటువంటి అభ్యర్థిని తప్పకుండా జయప్రదం కావిస్తారని ఆశిస్తూ ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు అధ్యక్షులవారికి నా హృదయ పూర్వక వందనములు అర్పిస్తూ సెలవు తీసుకొంటున్నాను

*శ్రీ ఎన్. పి. చంగల్రాయ నాయుడు (పల్మనేరి) : అధ్యక్షా, గవర్నరుగారి సందేశంపైన తీసుకొని వచ్చిన తీర్మానాన్ని నేను కూడా బలపరుస్తూ కొన్ని విషయాలు మాత్రం మనవి చేయదలచుకొన్నాను. ముఖ్యంగా మన ప్రభుత్వంవారు రాష్ట్రములో అనేక రంగాలలో అభివృద్ధి పనులు చేస్తున్నారు. అందుకు నేను మన ముఖ్యమంత్రిగారిని అభినందిస్తున్నాను, ఎక్కడచూచిన, ప్రతి జిల్లాలోను అనేక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడెక్కడ colleges లేవో, అక్కడ colleges కూడా ఏర్పాటు చేస్తున్నారు, ముఖ్యంగా మా చిత్తూరు పట్టణంలో ఒక కాలేజికూడా లేకుండా ఉండినది. అక్కడ కూడా మన ముఖ్యమంత్రిగారు ఒక collegeని ఏర్పాటు చేసేటట్లుఉత్తరువులుచేశారు.దానిని ముఖ్యంగా వారికి నావందనములు తెలుపుతున్నాను. ఇక జిల్లాకూడా ఒక విధంగా కాదు, అనేక విధాలుగా పనులు జరుగుతున్నాయి. అన్ని పనులుకూడా ప్రజల శ్రేయస్సుకోసం జరిపిస్తూ ఉండిన, ఈపనులుజరగకుండ ఉండేందుకు కొంతమంది ప్రయత్నంచేస్తున్నారు. ముఖ్యంగా మన Planning and Development మంత్రిగారు అనేక విధాలుగా శ్రద్ధ తీసుకొని మన రాష్ట్రాన్ని మిగతా రాష్ట్రాలకంటె ఎక్కువ అభివృద్ధికి తీసుకొరావలెనని ఒక కార్యదీక్షతోవారు పనిచేస్తున్నారు, ఆశయాలేమో బాగా ఉన్నాయి. జిల్లాలలో కార్యాలన్ని జరిపించేందుకు జిల్లా పరిషత్తుకు సెక్రటరీలను, పంచాయితీ సమితులకు B.D.O. లను ఏర్పాటు చేసినారు. ఈ ఉద్యోగస్తులలో కొందరు సామాజిక అభివృద్ధి కోసం పాటుపడుతున్నారు. కొందరేమో అభివృద్ధి నిరోధక శక్తులుగా పనిచేస్తున్నారు. ఈ అభివృద్ధి నిరోధక శక్తులు అక్కడక్కడ కూడా ఉన్నారు. కొందరు జిల్లా అభివృద్ధి నిరోధక ఆఫీసర్లని పేరు

కూడా తెస్తున్నారు. వారికి ఆ పేరు ఎందుకు వచ్చినదంటే, జిల్లా పరిషత్తు ఏదైనా పనిచేసేందుకు ఒక తీర్మానం చేస్తే, ఈ అభివృద్ధి నిరోధక ఆఫీసర్లు జిల్లా పరిషత్తు తీసుకొన్న తీర్మానానికి వ్యతిరేకంగా వ్రాయడమో లేకపోతే ఆ పని జరగకుండా ఆ కాగితాలు తొక్కి ఉంచడమో జరుగుతున్నవి. ఈ పని చిత్తూరులో జరుగుతున్నది. చిత్తూరు జిల్లా పరిషత్తువారు అనేక పనులకోసం తీర్మానాలు చేసినా, అక్కడ ఉండే కలెక్టరు కూడా సహకరించి చేస్తూ వచ్చినా, ఈ జిల్లా అభివృద్ధి నిరోధక ఆఫీసర్లు పనులు చేయకుండా ఆ కాగితాలను తొక్కి ఉంచుతున్నారు. దానికి మద్దతు యిచ్చేవారు ఇక్కడ రాష్ట్రి స్థాయిలో ఒక Development Officer ఉన్నారు. ఆ విధంగా పనులు జరగకుండా ఆటంక పరచేదానికి వీరు మద్దతు యిస్తూ పనులు జరుగకుండా చేస్తున్నారు. ఇదిచాలా విచారకరమైన విషయం, ఈ విషయంలో ప్రభుత్వం ముఖ్యంగా శ్రద్ధ తీసుకొని అటువంటి ఉద్యోగస్తులమీదను, దానికి మద్దతు ఇచ్చేవారిపైనకూడా చర్య తీసుకోవలసియున్నది. ఈ అభివృద్ధి నిరోధక శక్తులను మనం అరికట్టకపోయినట్లయితే ఈ సమాజక అభివృద్ధికోసం, మనం ఎంత పాటుపడినా ఎంత డబ్బు ఖర్చుపెట్టినా, మనం అధికారాన్ని అంతా గ్రామాలకు, ప్రజలకు ఇచ్చివేసినామని చెప్పుకొన్నా, లాభంలేదు. కనుక అభివృద్ధి నిరోధక శక్తులపైన విచారణ జరిపి, వారి పైన చర్య తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని, వారిపైన తప్పక చర్య తీసుకోవలెనని మనవిచేస్తున్నాను. కొన్ని జిల్లాలలో లేక పంచాయితీ సమితులలో, ఇప్పుడు ఈ రకమైన అభివృద్ధి నిరోధక శక్తులపైన resolutions కూడా pass చేయవలసి వస్తున్నది. ఇతడు అభివృద్ధి నిరోధకుడు, ఇతనిని ఇక్కడ నుంచి పంపించి వేయండి. అని మొరపెట్టుకోవలసిన పరిస్థితి ఏర్పడుతున్నది. అటువంటి తీర్మానం వచ్చిన తరువాత, అతనిని ఇంకెక్కడికో మార్చివేయడం మంచిది కాదు. అతడు ఇంకొక జిల్లాకు పోయినా, ఆ జిల్లాకూడా నాశనం అవుతూంది. కనుక ఆ విధంగా చేయకుండా, వారి పైన చర్య తీసుకోవాలని మాత్రం నేను ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను. తరువాత minor irrigation పనులు ఏప్రిల్ మొదటి తేదీ నుంచి రివిన్యూ డిపార్టుమెంటు నుంచి పంచాయితీ సమితులకు, జిల్లా పరిషత్తులకు మార్చినారు. మార్చినప్పుడే మేము ముఖ్యమంత్రిగారికి, P. W. D. మంత్రిగారికి, Planning మంత్రిగారికి, ముగ్గురికి కూడామనవి చేసుకొన్నాము ఒక కాంగ్రెస్ పక్షంవారేకాదు, అన్ని పార్టీలవారు వారికి మనవి చేసుకొన్నారు. మీరు ఇప్పుడు మార్చడం సబబు కాదు, ఇప్పుడు మార్చినారంటే ఈminor irrigation పనులన్నీ దెబ్బతింటాయి. మీరు ఇప్పుడుమార్చినారంటే ఒకరి దగ్గరినుంచి ఇంకొకరి దగ్గరకు రావడము, వారు సరిదిద్దుకొని వారికి కావలసిన ఏర్పాట్లు అన్నీ చేసుకోవడం ఈవిధంగా 4 మాసాలవుతుంది.వర్షా కాలంలో పనులుచేయ లేరు అని మేము ముఖ్యమంత్రిగారికి చెప్పినాము. అయినా మేము మంచి పనులు చేసే టప్పుడు,మీరు ఆక్షేపణ చెప్పడం బాగలేదన్నారు. మాకు అవి మార్చడానికి ఆక్షేపణ లేదుగాని,ఆమార్పే పద్ధతిమాత్రం బాగలేదని తెలిపినాము. ఆ విధంగా మార్చినందువల్ల ఏప్రిల్ మొదటితేదీనుంచిఈనాటి వరకుకూడా ఎక్కడకూడా ఈminor irrigation

పనులు జరగకుండా నిలచిపోయినాయి. ఆ సిబ్బందిని అంతాకూడా రివిన్యూ డిపార్టు మెంటు నుంచి జిల్లా పరిషత్తులకు మార్చడము, అక్కడ వారికి పని చేసేందుకు నాథుడు లేకుండా పోవడమూ, లేక వచ్చిన వారికి కావలసిన డబ్బు allotment ఇవ్వక పోవడమూ ఈ ఇబ్బందులవల్ల, ఇంతవరకు ఏ జిల్లాలోగాని లేక ఏ పంచాయితీ సమితిలోగాని పనులు జరగకుండా పోయినాయి. Minor irrigation పనులు మాత్రం చాలా దెబ్బతిన్నాయి, ఏదో వర్షాకాలంలో ఈ మార్పుచేసి ఉంటె బాగుండేది. ఇప్పుడు మాత్రం రైతులకు తీరని అపకారం కలిగిందని నేను మనవి చేస్తున్నాను.

చిత్తూరులో College open చేసేందుకు ప్రభుత్వంవారు ఉత్తరువులు ఇచ్చినారు అని నేను ఇదివరకే మనవి చేసినాను. దానికి మేము, చిత్తూరు జిల్లా ప్రజలు ప్రభుత్వానికి ఎంతో రుణపడి వున్నాము. ముఖ్యంగా ముఖ్యమంత్రిగారికి ఎంతో ఋణపడి ఉన్నాము. అక్కడ college open చేయడానికి ప్రభుత్వమువారు ఉత్తర్వు ఇచ్చినారు. ఒక Special Officer ను కూడా అక్కడ ఏర్పాటుచేశారు. అక్కడ దానికి గాను కట్టడాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. college ని ప్రారంభిస్తామని ఆ Special Officer చెప్పినారు. కనుక, college ఇక్కడనే మా చిత్తూరులోనే వస్తున్నదికదా, ప్రభుత్వం ఉత్తరువు ఇచ్చిందని ప్రజలునమ్మి, వారి వారి బిడ్డలను వేరే కాలేజీలకు పంపకుండా అక్కడనే నిలుపుకొన్నారు. మనబిడ్డలను ఇక్కడే చేర్చుకొందామనే సంతోషంతో అక్కడనే పెట్టుకొన్నారు. కాని జరిగింది ఏమిటంటే. అక్కడ యూనివర్శిటీలో కూడా అభివృద్ధి నిరోదక శక్తి ఒకటి దీనికి అడ్డము వచ్చింది. యూనివర్శిటీ రూల్సు వున్నాయట, వాటి ప్రకారం ఎవరైనా college ని పెట్టుకొనేటట్లు వుంటె, ఒక్క సంవత్సరం ముందుగా affiliation కు apply చేయాలట. ఈ ప్రభుత్వంవారు, సంవత్సరంముందు మాకు అర్జీపెట్టుకోలేదని, కాబట్టి affiliation కు వీలు లేదని యూనివర్శిటీలో కొందరు ఉద్యోగస్థులు చెప్పారు. అయితే యీ affiliationకు ముందుగా ఎందుకు అర్జీ పెట్టుకోలేదంటే—ఇది ప్రభుత్వకాలేజీ పెట్టేవారుంటే, వారియొక్క ఆర్థిక పరిస్థితులు, endowments ఏర్పాటుచేశారా, కట్టడాలు ఏర్పాటు చేశారా, మొదలైన విషయాలు తెలుసుకునేందుకు సంవత్సరం గడువు కావలసియుండవచ్చును. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసే కళాశాలలకు యీ రూల్సు వర్తించ నక్కరలేదు. ప్రభుత్వానికి డబ్బు లేకపోలేదు. కట్టడాలు లేకపోలేదు, పరికరాలు కొనేందుకు డబ్బులేకపోలేదు. అటువంటప్పుడు యీ కళాశాలను రాకుండా చేస్తుండే అభివృద్ధి నిరోధక శక్తులను తొలగించి, వెంటనే ప్రారంభించడానికి ప్రయత్నించాలి. ఒకవేళ యీ వైస్ ఛాన్సెలర్ ఉత్తర్వు చేయడానికి సుముఖంగా లేకుంటె. అవతల చాన్స్‌లర్, ప్రో ఛాన్స్‌లర్ ఉన్నారు. చాన్స్‌లర్ గారినే అడిగి వారిద్వారా స్పెషల్ ఎగ్జెంషన్ తీసుకొంటే బాగుంటుంది. సుమారు మూడు నాలుగు వందల

పిల్లలు యీ కళాశాలలో చేరాలని. ప్రభుత్వం ఉత్తర్వు ఇచ్చింది కాబట్టి తప్పకుండా వస్తుందనే నమ్మకంతో, వేరేచోటకు వెళ్ళకుండ నిలిచిపోయారు. అటువంటి పరిస్థితులలో ఈ కాలేజీని ఏర్పాటు చేయకుండా వుంటే, వారందరిగతి ఏమవుతుందో ఆలోచించాలి. ముఖ్యమంత్రిగారు ఉత్తర్వు ఇచ్చిందికూడ జరగకుండ ఉండటానికి చూస్తున్నారు. అటువంటి అభివృద్ధి నిరోధక పనులు నివారించి, యీ కాలేజీ ఒకటి రెండు రోజులలో ఉత్తర్వులు యిచ్చి ప్రారంభిస్తారని ఆశిస్తూ వారికి వినయ పూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నాను.

మాది వెనుకపడినజిల్లా, చిత్తూరుజిల్లాలో వేరుశనగవేశారు. వానరాకుండావున్నది. ఇది కరువు కాటకాలతో నలిగిపోయేజిల్లా. మాకు ఏదీ పెద్దప్రాజెక్టు రాలేదు. చాలా ఎత్తులో ఉన్నాము. ఏదైనా మైనర్ ఇరిగేషన్ పనులు చేయవలసిన బాధ్యత ఉన్నది, దానికి ప్రభుత్వం కొంతడబ్బు అధికంగా కేటాయించాలి. వ్యవసాయం కొరకు గ్రామాలకు విరివిగా electricity యివ్వాలి. అక్కడ ఏప్రాజెక్టు వచ్చే అవకాశం లేదు కాబట్టి చిత్తూరుజిల్లాకు స్పెషల్ అల్లాట్‌మెంటు యిచ్చి electricity supply చేయడానికి పూనుకోవాలని ముఖ్యమంత్రిగారికి, P. W. D. మంత్రిగారికి, మనవి చేస్తున్నాను. ఈ అవకాశం యిచ్చినందుకు అధ్యక్షులువారికి వందనము అర్పిస్తున్నాను.

* శ్రీ పి. రామాచార్లు (ధర్మవరం) : అధ్యక్షా! గవర్నరుగారు, ఆంధ్ర ప్రదేశ్‌లో జరిగిన అభివృద్ధిని గురించి సమగ్రంగా ఉపన్యాసం చేసినారు. స్వరాజ్యం రాకముందు, ఏ పరిస్థితులు ఎట్లా యుండవలెననుకొన్నామో, ఎట్లా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగవలెననుకొన్నామో, అవన్నీ అన్ని రంగాలలో బాగా జరుగుతున్నదని అందరికీ సంతోషమే. కాని వారి ఉపన్యాసంలో అతివృష్టి, అనావృష్టి భాగాలలో కలిగిన నష్టాలను గురించి ఏమీ పేర్కొనలేదు. కాని దేశం అంతటా, దక్షిణంలో, ఉత్తరంలో, మధ్య ప్రాంతంలో, బ్రహ్మాండమైన వర్షాలు వచ్చి అవస్థలుగాయుంటే, మా అనంతపురం మండలము మాత్రం యింకా క్షామ పీడితమై ఉన్నది. నాలుగు సంవత్సరాలుగా గవర్నమెంటు రెమిషన్ యిస్తున్నారు. కరువు పనులు చేయిస్తున్నారు. ఈ కరువు నివారణకు కావలసిన కార్యములన్నీ చేస్తున్నారు. కాని రెమిషన్ యిచ్చినంత మాత్రంచేత, తక్కావీఋణాలు, కంతులు, వాయిదాలు యిచ్చినంత మాత్రాన ప్రజలకు మేలు కలుగదు. ఇది పెద్ద chronic disease వలెనున్నది. ఈ పాలువ జిల్లాలలో ముఖ్యంగా అనంతపురం జిల్లాలో కొన్ని భాగములలో, చిత్తూరు జిల్లాకు తీరని కరువు ఏర్పడింది. దీనిని గురించి ప్రభుత్వం సమగ్రంగా ఆలోచించి ఏదైనా ప్రణాళిక ఏర్పాటు చేస్తేతప్ప యిది ఎప్పటికీ తీరని సమస్య అవుతోంది. శరీరంలో ఒక పార్శ్వం, కాలో, చెయ్యో పడిపోతే ఏ విధంగా ఉంటుందో, దేశంలో ఒక ప్రాంతం

ఎప్పుడూ కరువు కాటకములచేత నిర్వీర్యమై నిర్జీవమై పోతే ఆ దేశమునకు అభివృద్ధి ఉండదు. కడుపులో కూడు లేనివానికి కళాశాస్త్రము అన్నట్లు గంజి అయినా లేకుండా జాతీయ విస్తరణ, నాటకములు, కళలు, యివన్నీ ఎవరికి పట్టింది. ముఖ్యమంత్రిగారు మా జిల్లాలో పర్యటన చేశారు. రంగారెడ్డిగారు కొన్ని భాగాలు చూశారు. అక్కడ పరిస్థితులు గమనించారు. మాటిమాటికి క్షామం గురించి చెప్పుట మాకుకూడ కష్టముగానే యున్నది, ఎప్పుడూ యిదేనా పని అని. ఒకప్పుడు దత్తమండలం అభివృద్ధి కార్యక్రమాలకు ఒక కమిటీని వేశారు. వారు ఏమి చేశారో తెలియదు. తుంగభద్ర ప్రాజెక్టు వస్తే కరువు తీరుతుందని దాని నిర్మాణం ప్రారంభం చేశారు. కాని అందులో సగంనీరు అప్పుడు నిజాం పంచుకొన్నాడు. తరువాత సగం మైసూరులోకి పోయిన బళ్లారి వారికి పోయింది; ఎగువ కాలువ వస్తోంది, అదికూడ 100 మైళ్ళవరకు మైసూరు వారికేగాని, అనంతపురం చేరేవరకు యింకా నాలుగయిదేళ్లు అవుతుంది. అదికూడ కొంత ప్రదేశానికే పనికి వస్తుంది. చాలా భాగానికి పనికి రాదు. తుంగభద్ర ప్రాజెక్టువల్ల అనంతపురం మండలం బాగుపడుతుందని, దత్త మండలములో కరువు దత్తమవుతుందని భావించారు. కాని అటువంటి తుంగభద్ర ప్రాజెక్టువల్ల ప్రయోజనం కలగలేదు. చిన్న ప్రాజెక్టు కొన్ని ఏర్పాటు చేశారు. Upper Pennar Project ఉన్నది. దానిలో నీరులేదు. అది యిసుక ప్రాజెక్టు అయినది. నీటి ప్రాజెక్టు కాలేదు, పైరీవానితిప్ప ప్రాజెక్టువల్ల మైసూరు సీమలో ఎక్కువ మునక అవుతుందని రిజర్వాయిర్ కట్ట తగ్గించి కొద్దిగా నీరు మిగిలేట్లు చేశారు. దానివల్ల కళ్యాణదుర్గం తాలూకాలో 3 వేల ఎకరములకు నీరు అందుతోంది. తక్కినది ఏటి పాలవుతోంది, వృథాగా పోయే ఆ నీటిని మళ్లించి కళ్యాణదుర్గం భాగములో విశేషంగా పంట భూములకు ఉపయోగించేట్లు చేయవచ్చునని చెబితే, దానికి మైసూరు వారు వప్పుకొనుటలేదని అంటున్నారు. వారికి నీటి మునక ఎక్కువ అవుతుందట. అటులయినచో ఆ నీటి మునక ప్రదేశానికి మూడు నాలుగు వంతులు కాంపెన్సేషన్ యిచ్చి, లేక మన భూభాగము యిచ్చి ఆ నీటి మునక భాగము మనము సంపాదించి ఆ రిజర్వాయర్ కట్టను ఎక్కువ చేస్తే విశేషంగా ప్రయోజనం కలుగుతుంది,

*(Sri P. Narasing Rao in the Chair)*

గవర్నమెంట్ ఏ మాత్రం ప్రయత్నం చేయటంలేదు. ఇంజనీర్స్ మైసూరు ప్రభుత్వముతో మాట్లాడి "మీకు దీనివల్ల నష్టంలేదు. లేకపోతే నీరు వృథాగా పోతుంది" అని చెప్పే శ్రద్ధ భక్తి కూడా వారికి లేకుండా పోతున్నది, అది నా మనసుకు విషాదం కలిగిస్తోంది. పైనుండి నదుల నీరంతా మైసూరు పీఠభూమి నుండి అనంతపురం మండలానికి వస్తూ ఉన్నది, కాని మైసూరు వారు పైన అంతా బిగకట్టి అనంతపురం మండలానికి నీరు లేకుండాచేసి, దానిని క్షామప్రదేశంగా చేశారు. అట్టి క్షామ ప్రదేశాలలోని

రైతులకు బావులు త్రవ్వుకోటానికి విరివిగా గ్రాంట్సు, సబ్సిడీలు ఇచ్చినా, వారికి బావులు త్రవ్వుకోటానికి శక్తిలేదు శక్తి లేనప్పుడు—వారికి ప్రభుత్వం పవర్ డ్రిల్స్ యో లేక ఏవైనా యంత్ర పరికరాలు సప్లయి చేస్తారా అంటే చేయరు. ఈ రాజధానిలో ఒకటో రెండో పవర్ డ్రిల్స్ ఉన్నట్లు ఉన్నదిగాని, మూడవది కావాలంటే దొరకదు. ఎన్ని మార్లు ప్రయత్నం చేసినా జిల్లాలకు పవర్ డ్రిల్స్ పంపే అవకాశం లేకుండా ఉన్నది. బోరింగ్ పంప్స్ కూడ కొద్దిగానే ఉన్నవి. కాబట్టి వాటివల్లకూడ లాభంలేదు. కొన్ని ప్రాంతాలలో బావులు త్రవ్వుకోటానికి వీలుండినా, ఎలక్ట్రిసిటీ లేనందువల్ల వ్యవసాయం చేసుకోటానికి కష్టమైనది. కరువు ఉండినందువలన, నాలుగు సంవత్సరాలు గడ్డిలేక పశువులను ఎద్దులను అమ్ముకొన్నారు. ప్రజలు వలసపోయినారు. అందువల్ల పశువులతో సేద్యము చేయటము కష్టమై పోయింది. అంచనాలు వేసి, కళ్యాణదుర్గానికి ఎలక్ట్రిసిటీ అని 43 లక్షలు గ్రాంటుచేశారు. అలా గ్రాంటుచేసి మూడు నాలుగు సంవత్సరాలైనదిగాని ఇంతవరకు కళ్యాణదుర్గము టౌన్ కైనా ఎలక్ట్రిసిటీ రాలేదు. ఎంతమంది అర్జీలు ఇచ్చినా, పని మందగోడిగానే నడుస్తున్నది. రాయదుర్గం తాలూకా నుండి—త్రోవలో ఉన్న కళ్యాణదుర్గానికి ఎలక్ట్రిసిటీ రావటానికి, అంచనాలు వేసి మంజూరు చేసినా, రాకుండా ఉండటము, కేవలము ఆ కళ్యాణదుర్గము ప్రజల యొక్క దౌర్భాగ్యమని చెప్పకతప్పదు. ధర్మవరము, కళ్యాణదుర్గము, అనంతపురము తాలూకాల లోని ప్రాంతమంతా క్షామ బాధితమైంది. వారి క్షామబాధ ఎన్నటికి తీరుతుంది ? దానికి ఏదైనా ప్రణాళిక వేస్తారా ? ముఖ్యమంత్రిగారు ఏదైనా ఒక కమిటీ ఏర్పాటు చేసి, దత్తమండలంలో శాశ్వత కరువు నివారణకు అవసరమైన ప్రణాళిక అమలు జరిపించే ప్రయత్నం చేస్తే బాగుంటుంది. ఇక్కడ హెచ్చు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయటము, బావులకు ఎలక్ట్రిసిటీ విస్తారంగా ఇవ్వటము, అక్కడున్న మైనర్ ఇరిగేషన్ వర్క్సును అధికంగా అమలు జరపటము, మైసూరు ప్రభుత్వము వారితో పోట్లాడి, ఎక్కువ నీరు నిలవపెట్టి అక్కడకు మరలించటము, తుంగభద్ర ప్రాజెక్టు క్రింద హయ్యర్ లెవెల్ లో కాలవలు తీసి ధర్మవరము తాలూకావరకు తీసుకుపోవటము ప్రభుత్వం వెంటనే చేయించ వలసి ఉంటుంది. అంతేగాని "సంవత్సరము శిస్తు రెమిషన్ ఇస్తున్నాము. తక్కావీలోన్స్ వాయిదా వేస్తున్నాము" అని చెప్పి, ఆ పనిచేసి తృప్తిపడితే, అక్కడి కరువుబాధ ఎన్నటికి తీరుతుంది ? యీ యుగంలో తీరుతుందా ?—అని నాకు సందేహంగా ఉన్నది. అక్కడ మంచినీరులేక చాలా మంది అవస్థ పడుతున్నారు. వారికి మంచినీరు సౌకర్యాలు కలిగించకుండా, ప్రభుత్వం ఎన్ని జాతీయ ప్రణాళికలు అమలు జరిపినా ప్రయోజనము ఉండదు. వారు మంచినీటి బావులులేక, మురికినీరు త్రాగి నారకురుపుతో బాధపడుతున్నారు. వారికి మంచినీటి సౌకర్యాలు కలిగించ వలసిందిగా ప్రభుత్వాన్ని ఆరు సంవత్సరాలనుండి కోరుతూ ఉన్నాను. గ్రామస్తులను కొంతడబ్బు భరించమంటున్నారు. పంచాయితీలను కొంత భరించ మంటున్నారు. మొదట 50 వేలు అంచనా వేసి అందులో సగం ఇవ్వమంటున్నారు. వారు ఆ సగం ఇవ్వటానికి

అంగీకరించిన తర్వాత—మళ్ళీ ఆ అంచనాలు మార్చి, లక్ష రూపాయలకు అంచనావేసి అందులో సగం ఇవ్వమంటున్నారు. ఇప్పటివరకు అక్కడ ఆ కార్యక్రమము నెరవేర లేదు. ఇక అక్కడ ఆ కార్యక్రమము జరగదు అనే అవిశ్వాసం ప్రజలలో కలగకుండా, ప్రభుత్వం వెంటనే అక్కడ కరువు నివారణకై శాశ్వత పథకాలను ఆలోచించి అమలు జరిపించి, వారికి మంచినీటి సదుపాయాలు కలిగించవలసి ఉంటుంది. అవి చాలా కరువు బాధిత ప్రాంతాలు. అక్కడ కేవలం 21 అంగుళాల వర్షం మాత్రమే పడుతుంది. ఇంకా ఇతర జిల్లాలలో క్షామ ప్రాంతాలు ఉన్నప్పటికీ, ఇక్కడంత తక్కువ వర్షాలు కురవవు. కాబట్టి మంత్రిగారు సీరియస్‌గా ఆలోచించి, ప్రణాళికలు వేసి, కరువుబాధ నివారించి, అక్కడి ప్రజల కష్టనష్టములు నివారించటానికి ప్రభుత్వమువారు ప్రయత్నము చేస్తారని ఆశిస్తూ విరమిస్తున్నాను.

*శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య: అధ్యక్షా! బహుశా మనకు-యీశాసనసభ్యులకు-గవర్నర్ గారి సందేశము-వారి భాషణ తుదిభాషణ అవుతుంది. మన ఘోషణకూడ తుది ఘోషణ అవుతుంది జనానికి మాత్రం శోషణ ఎన్నటికీ తప్పదేమోనని తోస్తుంది. ఈ నాడు ఆంధ్ర జాతి జీవితం జలమయంగా ఎట్లా ఉన్నదో, అట్లాగే విషాదమయంగా కూడ కనబడుతున్నది. మద్రాసు రాష్ట్రములో మనం ఉండగా, మనకు ప్రాజెక్టులు రాలేదనుకొన్నాము. ఆంధ్రకు వచ్చిన తర్వాత నందికొండ వస్తుందనుకొన్నాము. కాని ఆ నాడు ఉన్న ప్రభుత్వము నందికొండకు ప్రైయారిటీ ఇవ్వలేక పోయింది, ప్రభుత్వాన్ని కూలద్రోసిన తర్వాత గవర్నర్ పరిపాలనలో నందికొండ ప్రాజెక్టును (పొలిటికల్ కారణం అయినా, ఏ కారణం అయినా) మనకు తిసుకువచ్చి ఇవ్వటం జరిగింది. 1951 ఒడంబడిక ప్రకారం నీళ్ళ పంపకం జరిగిందని మనం అనుకొంటే, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పునర్నిర్మాణ ఫలితంగా వచ్చిన మార్పుల దృష్ట్యా కొద్ది మార్పులు చేసుకోటానికి బదులు—అసలు మొత్తంగా మార్పు చేయాలనే రాష్ట్రాలకు అంత దండలుగా నిలబడి ఆంధ్రకు అన్యాయం చేయటానికి సిద్ధపడుతున్నది. ఒరిస్సాతోటి మాచ్‌ఖండ్ విషయంలో మనం చేసుకొన్న ఒడంబడికలో అది 99 సంవత్సరాలు అమలులో ఉంటుందని, సీలేరులో మన ఇష్టం వచ్చినట్లు వాడుకో వచ్చినని పదహారవ క్లాజులో చెప్పిఉంటే-16 వ క్లాజును మరచిపోయి మళ్ళీ సంజీవరెడ్డిగారు హరేకృష్ణమహతాబ్, త్రివేదిగార్లు 1959 వ సంవత్సరములో ఎందుకు ఒడంబడిక చేసుకొన్నారో ఎవరికి అర్థం కావటంలేదు, దాని ఫలితంగా జరిగిందేమిటంటే, సీలేరులో మనం నీటిని కదిలించలేని స్థితికి వచ్చాము. మన వాళ్ళను జైలులో పెట్టే స్థితికూడా వచ్చింది. అరెస్టుచేసి తీసుకువెళ్లారుగాని తర్వాత ధైర్యంలేక "మేము అరెస్టు చేయలేదు." అని చెప్పారు. బోర్డర్స్ అన్నీ సెంటినల్స్‌గా తయారై మనం శత్రువర్గాల మధ్య ఉన్నామా?- అన్న భయం కలుగుతూ ఉన్నది. ఆంధ్ర రాష్ట్రంలో ఉండగా రాయలసీమను అడ్డం పెట్టారు. విశాలాంధ్రకు సంజీవరెడ్డిగారు, అల్లూరి సత్యనారాయణరాజుగారు గట్టిగా ప్రయత్నం

చేసిన మాట నిజమే. ఆ నాడు మంత్రివర్గంలో ఉండి, యీనాడు మంత్రులుగా ఉన్నవారు కొందరు దానిని వ్యతిరేకించారు. ఆ రోజు ఎవరైతే విశాలాంధ్రకు అడ్డం వచ్చారో, వారే ఇవాళ కూడ ఎడ్మినిస్ట్రేషన్‌లో ఇంటిగ్రేషన్‌కు ప్రతినిమిషం వ్యతిరేకిస్తున్నారని నేను చెప్పక తప్పదు. అదిమాత్రం చాలా ప్రమాదమైన స్థితిలో ఉన్నదని చెబుతున్నాను. అది ఆంధ్ర దేశాన్ని చాలా బలహీన పరుస్తుందని మనవి చేస్తున్నాను. ఆంధ్ర దేశంలో ఏమి సాధించబడినప్పటికీ, అది ప్రజలే సాధించుకొన్నారు గాని, ప్రభుత్వంలో కూర్చున్న పెద్దలు ఒకటి కూడా సాధించలేదని చెబుతున్నాను. సంజీవరెడ్డిగారు చీఫ్ మినిస్టర్‌గా ఉండగా, కేంద్రంతో పోట్లాడుకొన్నారు, ఇవాళ సంజీవయ్యగారు చీఫ్ మినిస్టర్‌గా ఉండగా, తమలో తమయొక్క వివాదాలతోటి కేంద్రంలో మనం బలంలేని స్థితికి వచ్చాము. మద్రాసు రాష్ట్రంలో మనం ఉండగా, మన సంగతి చెప్పినవారులేరు. మొత్తం మీద ఆంధ్రులెప్పుడూ నష్టము పొందే పరిస్థితిలోనే ఉన్నారు. ఆంధ్రులకు ఇరిగేషన్ ప్రాజెక్టులు లేవు. పవర్ ప్రాజెక్టులు లేవు. ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్సు లేవు. వాటిని గురించి కేంద్రాన్ని అడిగే దిక్కులేదు. కేంద్రంనుండి వాటిని సాధించుకొనే పరిస్థితి యీ నాడు మనకు కనుపించటంలేదు. మద్రాసు ప్రభుత్వంవారు ఎట్లా కృషిచేసి సాధించుకొంటున్నారో-వారినుండి అయినా మన ప్రభుత్వం నేర్చుకొన వలసిన అవసరం ఉంది. అందుకు మన ప్రభుత్వం సంసిద్ధం అవుతుందా అని అడుగుతున్నాను. మన గతి అధోగతిలో ఉంది. మనకు మిగిలింది వ్యవసాయం. వ్యవసాయానికి తోడ్పడే ప్రాజెక్టు లైనా తీసుకో బడుతున్నాయా అంటే-ఉన్న ప్రాజెక్టులకు ఎసరు పెట్టే పద్ధతిలో గుల్హాటీ కమీషన్‌ను సెంట్రల్ గవర్నమెంట్ వేసింది. ఆ కమీషన్ ఏర్పాటుకాక పూర్వమే మన శాసనసభ సమావేశం అయింది, గుల్హాటీ కమీషన్ ఏర్పడిన తర్వాత ఇంతవరకు శాసనసభ సమావేశం కాలేదు. కాబట్టి, ఆ కమీషన్ నియామకం పై, తద్వారా ఏర్పడబోయే సమస్యల గురించి ఇక్కడ మనం ప్రత్యేకంగా రెండు మూడు గంటలు చర్చించటం అవసరమని నేను అభిప్రాయ పడుతున్నాను. గుల్హాటీ కమీషన్ వేసిన కాగితంలో 1951 సంవత్సరంలో వాటర్ ఎసెస్‌మెంట్ చేశామని చెప్పారేగాని, ఆ వాటర్ ఎసెస్‌మెంట్ ఏమిటి అన్నది చెప్పలేదు. అది చాలా ప్రధానమైనటువంటిది. నేను ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. గుల్హాటీ కమీషన్ వెయటానికి మీ అంగీకారం ఉన్నదా ? అని మీ అంగీకారం లేదని నాకు తెలుసు. మీ అంగీకారం లేదని మీరు కూడ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం యొక్క అంగీకారం లేకుండా ఎట్లా వేసింది? ఇది డిక్టేటోరియల్ గవర్నమెంటా ? లేక ప్రావెన్షియల్ అటానమీతో నడుస్తున్నటువంటి యూనిటరీ గవర్నమెంట్ కాకుండా, ఫెడరల్ గవర్నమెంటా ? అనే ప్రశ్న వస్తున్నది. దాన్ని తెల్చుకోవలసి ఉన్నది.

గుల్హాటీకమిషన్ వేసిన సందర్భంలో "1951 ఒడంబడికను మీరు ఒప్పుకున్నారా లేదా" అని కేంద్రప్రభుత్వానికి ఉత్తరం వ్రాస్తే దానివిషయం జవాబుచెప్పకుండా

గుల్హాటీ కమిషన్ ప్రాజెక్టులకు అడ్డంరాదు కనుక చేయమన్నారు. ప్రాజెక్టులకు అడ్డం రాదు అని అన్నారు గాని పోచంపాడు శ్రీశైలం ప్రాజెక్టులను వెంటనే ఆపి వేయండి అని ఆరోజే చెప్పారు. ఎందువల్ల చెప్పారు. గుల్హాటీగారు యిక్కడకు వచ్చారు. వారు యిచ్చిన Statement అంతా damaging statement. మనం చదవాల్సిన అవసరం ఉన్నది. ఇంకా వారు రాజమండ్రి వెళ్ళినప్పుడు చెప్పినది. యిది "Gulhati said here today that they have so far not arrived at any definite formula by which they could assess the dependability of the flow of Krishna and Godavari at various points."

గుల్హాటీగారికి appoint చేసినదానిలో గవర్నమెంటు యిచ్చిన referenceలో "in 1951 an assessment was made of the supplies available in these rivers after meeting the requirements of the works *then in operation and of further possible use in the light of* the known new projects" అని assessment చేశాము అని వారు చెపితే assessment చేసిన formula ఏదో నాకు యింతవరకు తెలలేదు. అన్నారు. అంతే కాదు. "Water flow existed at various points in both these rivers, the requirements of various projects in all the States, and the physical possibility of diverting Godavari waters into Krishna...." అంతకన్నా చాలా ప్రధానమైన point ఏమనగా "they said that the study of these records at other places the Commission had already visited did not yield any basis for formulating general principles to assess the flow and other materials regarding river waters. He also said that one of the chief tasks was to scrutinise the way in which the data had been collected and kept at the concerned places."

ఆయన అసలు scrutiny చేయాలి అన్నారు. ఇదివరకు వేసిన డేరా ఏ పద్ధతిలో వేశారో, అది correct అవునా కాదా అనే స్థితికూడా నేను తీసుకోవాలి అన్నారు. కాని ఆయనకు యిచ్చిన reference లో మాత్రం ఆయనకు అధికారం యివ్వలేదు. అంటే దీనివెనుక ఏదో పెద్దకుట్ర జరుగుతున్నదని దీనియొక్క ఉద్దేశ్యం. ఆంధ్రులకు రాష్ట్రం రావాలంటే కుట్ర, నందికొండప్రాజెక్టు రావాలంటే కుట్ర, పోచంపాడు ప్రాజెక్టు రావాలంటే కుట్ర, శ్రీశైలం ప్రాజెక్టు రావాలంటే కుట్ర, పరిశ్రమలు రావాలంటే కుట్ర, ఏ సమస్య

వచ్చినా ఆంధ్రుల దురదృష్టం ఏమోగాని పెద్దకుట్ర జరుగుతున్నది. ఆంధ్రులు ఏకగ్రీవంగానిలిచి ఈ కుట్రను ఎదుర్కొనక పోతే ఆంధ్రజాతి మట్టిపాలు అయిపోయేరోజు వస్తుందని నేను మనవిచేస్తున్నాను. ఇందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉన్నదా? 10 సంవత్సరాల పరిపాలనలో మనం చూసిన పరిస్థితి ఏమిటంటే కుట్రను ఎదుర్కొ-లేక తన్నుకొంటున్నాము. ప్రజా సముదాయం ఒక్కరే ఈ కుట్రను విచ్ఛిన్నం చేస్తున్నారుగాని అధికారంలో ఉన్నవారెవరికీ పట్టలేదు. ఒకవేళ పట్టినా వాళ్ళకు బలంలేకపోయింది. ఈవేళ కేంద్ర ప్రభుత్వాన్ని ఒక ప్రశ్న అడుగుతున్నాము. 1951 సంవత్సరం, ఒడంబడిక మీరు అంగీకరించారా లేదా, standstill గా ఉన్నదా, లేకపోతే రద్దు అయిందా? ఈ విషయం ఎందుకు చెప్పరు? నేను జవహర్ లాల్ నెహ్రూగారికి ఉత్తరం వ్రాస్తే వారు హాఫే మహమ్మద్ గారిని జవాబు వ్రాయమన్నారు. వారు వ్రాసిన జవాబులో "మేము అన్నీ చూశాము. నీళ్ళసంగతి ఆలోచిస్తున్నాము. ప్రాజెక్టులు ఏమి ఆవలేదు అన్నారు. దానిమీద 1951 సంవత్సరం ఒడంబడికను మీరు అంగీకరించారా, త్రోసి పారేశారా, ఆ ఒక్క point మొట్టమొదట చెప్పండి" అని మేము మళ్ళీ అడిగాము. కోర్టుకు వెడతాము అని చెప్పుతున్నారు. ఏ కోర్టుకువెడతారు. గుల్హాతీని వేయడానికి ఏమి అధికారం అన్నది. Constitution ప్రకారం మనం రెండు శాసనాలు చేశాము. (1) Water Dispute Act, (2) Water Canal Dispute Act. Water Canal Dispute Act దీనికి సంబంధించేది కాదు. Water Dispute Act దీనికి సంబంధించినది. దానిని గురించి తగాదావస్తే ఎవరిని వేయాలి? కేంద్ర ప్రభుత్వం తగాదా ఉన్నదని అనుకున్నట్లయితే tribunal ను వేయాలి. ఆ tribunal లో ఎవరిని వేయాలి? High Court జడ్జినో, Supreme Court జడ్జినో retire అయిన వాడిని తీసుకువచ్చి వేయాలని చెపితే వారు Assessor ను ఇద్దరిని తీసుకుంటే వాళ్ళతోటి కావలసిన మనుష్యులు అందరిని తీసుకుంటే మొత్తం కలిసి చేయాలి. కేంద్రప్రభుత్వం మహారాష్ట్ర గవర్నమెంటు పంపించిన కంప్లయింట్ తీసుకున్నారా? మైసూరు గవర్నమెంటు పంపించిన complaint తీసుకున్నారా? States reorganisation తరువాత వచ్చిన ప్రభుత్వాలకు పూర్వపు ఒడంబడికలతో సంబంధం లేదా? సంబంధం లేదు అనగానే ఎప్పుడైతే కేంద్ర ప్రభుత్వం తలఒగ్గిందో అప్పుడు శీలేరు ప్రాజెక్టుకు యిది వరకు 99 సంవత్సరాల వరకు మీ యిష్టం వచ్చినట్లు చేసుకో వచ్చునని చెప్పిన ఒడంబడికను వాళ్లు భగ్నం చేయడానికి సాధ్యం అయిపోయింది. అధ్యక్షా, time అయిపోయినప్పటికీ తమకు ఆ agreement భాగం వినిపిస్తాను.

"Agreement between the Government of Madras and the Government of Orissa regarding the development

of Hydro-Electric Power at the Duduma Falls on the Machkund River.

XVI (a) The Government of Orissa consent to the development of power by the Government of Madras at the two power sites on the Sileru river at the expense and under the sole control of the Government of Madras, and to its full utilisation by that Government for a period of 99 years.

(b) During this period the Government of Madras will make power available from these two sites to the consumers in Orissa on the same terms and conditions as may be applicable from time to time.

(c) Subject to the provisions of Clause VIII, the Government of Madras undertake that the development at either of the two power sites on the Sileru river shall not affect adversely the Machkund Hydro - Electric Scheme as generally outlined in their report of 1944.

(d) The Government of Madras shall keep separate accounts for the two Sileru schemes and shall furnish copies of accounts and progress reports to the Government of Orissa every year.

(e) At the expiry of the period of 99 years, the Government of Orissa shall be entitled to claim upto 50% of the total output at these sites on payment of proportionate share of the capital cost. Thereafter the two Governments

> shall pay maintenance and operation charges in proportion to the power taken by them."

This was the main thing that we have agreed to.

రాష్ట్రం మారేటప్పటికి మనుష్యులు మారేటట్లయితే, మా తండ్రి చనిపోయిన తరువాత ఆయన చేసిన అప్పులన్నీ నేను ఎగ్గొట్టేట్లయితే ఏ Law ఒప్పుకుంటుందో చెప్పండి. అంతకుముందు ఇంగ్లీషువాళ్ళుచేసిన అప్పులన్నిటికీ మనం బాధ్యులము అయినాము. ఇది ఎందువల్లవచ్చింది, కేంద్ర ప్రభుత్వం మన ఎడల చూపిస్తున్న నిరాదరణకు జవాబు ఏమి చెవుతారు? ఆంధ్ర ప్రభుత్వానికి సహజసిద్ధంగా ఉన్నటువంటి వ్యక్తిత్వాన్ని నిలుపుకొనేస్థితి యీవేళ లేకుండా ఉన్నది. Bombay Government లో అధికారంలో ఉన్న చావన్‌గారు "ఆంధ్ర గవర్నమెంటుకు ఏమి హక్కు ఉన్నదని చెప్పవచ్చు. నేనుకూడా ఆమాటే చెప్పవచ్చు. ఆయన ముఖ్యమంత్రిగా చెబితే నేను సభ్యుడుగాచెప్పవచ్చు. "నీకేమి అధికారం ఉన్నదని ఇంతవరకు ఉన్నటువంటి సమస్యలు చాలక రాష్ట్రాలమధ్య ఈ తగాదాలతో దేశాన్నంతా ముక్కలపాలు చేయడమేనా? భాషారాష్ట్ర సమస్యలతోపాటు........"

శ్రీ ఎ. సత్యనారాయణ రాజు : ప్రయత్నం చేస్తున్నాం వారి స్వరం చాలా పెద్దది అయిపోవడం వల్ల ఈ దరికి ఎందుకో వినబడటం లేదు. మైక్ యొక్క defect ఏమో తెలియదు, వినలేకపోతున్నాము.

శ్రీ డి. సంజీవయ్య : మైక్ defect కాదు. వేగం. అది నయాగరా జలపాతం....

శ్రీ ఎ. సత్యనారాయణరాజు : ఏమైనా కానీయండి గోదావరి నీటి ప్రవాహానికంటే కొంచెం తగ్గిస్తే మంచిది.

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య : మొన్ననే ప్రవాహాలు వచ్చాయి కనుక ఆ గోదావరి ప్రవాహంలోనే కొట్టుకు పోతున్నాము. Control చేసుకుంటాను. ఈ ఒడంబడికలు యివన్నీ చిత్తుకాగితముల క్రింద లెక్కా, లేకపోతే వాటికి విలువ ఉన్నదా? అది రాష్ట్రప్రభుత్వం తేల్చుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం బలహీనపడనక్కర లేదు. ఎన్ని అభిప్రాయ భేధాలున్నప్పటికీ ప్రాజెక్టులు తెస్తామని, పరిశ్రమలు తెస్తామని చెబితే—తెలుగువాళ్ల చెప్పే సామెత ఒకటి ఉన్నది. కోడలు కంటానంటే వద్దనే అత్త ఉన్నదా? అని అలాగే-తీసుకువచ్చే సామర్థ్యమే ఉంటే, ఆ సామర్థ్యం తక్కువైతే మా బలం కూడా యిస్తాము. ఉపయోగించండి అని శాసనసభ ప్రాజెక్టులమీద చర్చ

జరిగినప్పుడు చెప్పింది. అంతకు ముందు పరిశ్రమల విషయంలో కూడా చెప్పింది. ఈ రెండింటి విషయంలో ఏమి చేస్తారు. గవర్నరుగారి speechలో అమోఘంగా చెప్పారు. Electrical project, చావుకబురు చల్లగా చెప్పినట్లు, సగం వస్తుందని చెప్పారు. అది వచ్చేదో కాదో ఇంకా తేలలేదు. అప్పుడే కేరళ ప్రభుత్వం తమకు కావాలంటున్నది. మద్రాసు ప్రభుత్వం మాకు వచ్చినది, మా ఇంజనీర్లుఅంతా పనిచేస్తున్నారు అంటున్నారు. మనం కూడా అమాదిరిగానే చెపుతున్నాము. కాని ఒకటి మాత్రం జ్ఞాపకం ఉంచుకోవాలి. సంజీవరెడ్డిగారు ఈమధ్య చెప్పారు. మనకన్న ఎక్కువ బలం వాళ్ళకు ఉన్నదని చెప్పారు. బొంబాయి గవర్నమెంటుకు ఎక్కువబలం ఉన్నదనే సంగతి మనకందరకు తెలుసు. వాళ్ళకు బలం ఉండడం తప్పుకాదు. మనకు వ్యతిరేకంగా వాళ్ళకు బలం ఉంటేతప్పు. దానిని ఎదుర్కోవాలి. వాళ్ళకు బలం ఉండాలి. మనకు బలం ఉండాలి. సహజబలం ఉండాలి. ప్రాజెక్టుల నిర్మాణంలో మనకు వున్న అధికారాలను సద్వినియోగం చేసుకునేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రయత్నం చేయకపోయినట్లయితే రానున్న ప్రమాదాలను మనమందరము ఎదుర్కోవలసి వస్తుంది. రానున్న తరాలన్నీ మనలను తిడతాయి.

గవర్నరుగారి speechలో అధికార భాషగా తెలుగు వాడడానికి ప్రయత్నిస్తున్నాము అన్నారు. Thanksgiving తీర్మానం తెచ్చిన నరసింహారావుగారు చెప్పారు. ఉర్దురాదు, తెలుగురాదు, ఇంగ్లీషురాదు, వాళ్ళందరినీ మళ్ళీ ఉర్దు ఇంగ్లీషు నేర్చుకోమని చెప్పేబదులు తెలుగే నేర్చుకొమని చెపితే సరిపోతుందని చెప్పినందుకు వారిని అభినందిస్తూ వారి ఉపన్యాసాన్ని నేను బలపరుస్తున్నాను. మన ప్రభుత్వం ఉర్దూ రానివారంతా రెండు, మూడు సంవత్సరాలలో ఉర్దూ నేర్చుకోవాలని, లేకపోతే వారి యింక్రిమెంట్సు ఆపివేయబడతాయని ఒక G.O. పాస్ చేసినది. ఇది చాలా ప్రమాదకరమైన G. O. దీనిని వెంటనే withdraw చేసుకోవలసిన అవసరమున్నది. తెలుగు రాకపోతే అవిధంగా చేస్తామనడం న్యాయంగా వుంటుంది. ఎందుకంటే తెలుగు అధికారభాషగా అవుతున్నది, అంతేగాక, అధ్యక్షా, తెలుగు అధికారభాషగా రూపొందించుకొనడానికి మనం చేస్తున్న ప్రయత్నాలకు enablingగా ఉండడానికి దానికి సంబంధించి ఒక శాసనం అవసరమనే విషయం గుర్తించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అవిధంగా చేయడానికి వెంటనే ప్రయత్నించవలసి ఉంది.

విద్యకు సంబంధించిన ఒక విషయం చెబుతాను. Text books ముఖ్యం అంతా nationalise చేశారు. కాని పుస్తకాలు యింతవరకు పిల్లలకు అందలేదు. ఇంక పిల్లలు ఏమి చదువుకుంటారు చెప్పండి. పుస్తకాలు వారికి వెంటనే అందే ప్రయత్నాలు చేయాలి. లేకపోతే మనం వారి విద్యను నాశనం చేసిన వారమవుతామని ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను.

ఈనాడు బంజర్లు ఒక సమస్యగా తయారైనాయి. ప్రభుత్వంమాత్రం ఉద్దేశ పూర్వకంగా యింతవరకు చేయలేదు. 1953 వ సంవత్సరంలో, కర్నూలులో వుండగా ప్రభుత్వం వుండే, పోయే పరిస్థితిలో ఏపూట కాపూట బ్రతకడమా. చావడమా అనే పరిస్థితిలో ఒక తీర్మానం అపొజిషన్‌నుండి వస్తే, చివరకు వారికైనా వుపయోగపడితే బాగుంటుందని తలవొగ్గి తీర్మానం చేశారు. దానిని అమలుజరపడానికి ఎన్నో ప్రతిబంధకాలు వస్తున్నాయి. శ్రీ సంజీవయ్యగారు బీదకుటుంబానికి చెందినవారు, హరిజన కుటుంబములో పుట్టినవారు అయివుండవచ్చు, కాని, ఆయన నడుపుతున్న ప్రభుత్వం భూస్వాములచేతిలో వుందనే విషయం మరచిపోవద్దని చెబుతున్నాను. అందువలన భూస్వాములు చెప్పినట్లుగా ఆయన చేయాలి. సంజీవయ్యగారు బీదకుటుంబంనుండి వచ్చినా, అది ఆయనకు చదువుకునేటప్పుడు మాత్రమే గుర్తువుంది. ఆ తరువాత మరిచి పోయినారు ఆయన అడుగనవున్న జనాన్ని. జి. ఓలు మాచ్చశంతప్ప ఆచరణలో బంజరు భూముల పంపకం జరగడంలేదు. సంజీవయ్యగారు యిక్కడవుండగానే, సమయం ఎంతోలేదు, అధ్యక్షా, 9 మాసాలేవుంది, ఆ తరువాతమళ్లీవస్తే సంతోషమే. మళ్ళీ రావడానికి యీ బలంతోనే ముందుకు వెళ్ళమనండి. ఆ విధంగా గాకుండా, చచ్చేదాక వుంటే పెళ్లిచేస్తానంటే పెళ్లవకుండానే చచ్చేపరిస్థితి వస్తుంది. అధ్యక్షా, యీ నాడు బీదలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. నా నియోజకవర్గంలో జనం అంతా మొత్తుకుంటూ 925 మంది సంతకాలతో విన్నపమును యిస్తున్నారు, వారి విన్నపాలను ముఖ్యమంత్రిగారికి నేను అందజేస్తాను.

*శ్రీ యల్. లక్ష్మణదాసు (పాతపట్నం—జనరల్): తన చేతిలోవున్న పెళ్లే ఆయన చేసుకోలేకపోతున్నారు, మరి యిన్ని బంజర్లు పంచడం కష్టంగదా (నవ్వులు)

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య:- అధ్యక్షా, ఆ విషయాన్ని చెప్పడానికికూడ మీరు టైము ఇవ్వాలి. ఆ స్థితిలోవస్తే అక్కరలేదు. దేశానికి సేవచేస్తాను అన్నాను. అడిగారు కాబట్టి వారికి చెబుతున్నాను. గాంధీగారు నా జీవితంలో మొట్టమొదట నేర్పింది —ఐచ్ఛిక దారిద్ర్యం, ప్రజాసేవ చేతనైనంత చేయమన్నారు. దానితోనే గతించిపోతే అంతకంటే కోరగలిగింది ఏమీలేదని నా విశ్వాసం. అందుకోసమే నేను నిలబడ్డాను, నిలబడతాను.

అధ్యక్షా, ఇక మన వైద్యశాలలు ఎలావున్నాయో చెబుతాను. వైద్యశాలలకు పోతే కొత్తగా రోగాలు వస్తున్నాయి. జబ్బుతో అక్కడకువచ్చినప్పుడు వారిని లోపలకు రానివ్వకపోతే, వారు స్పృహతప్పి పడిపోతే యింకా వారిని శ్మశానానికే తీసుకెళ్లవలసి వుంటుంది, దీని విషయమై ఏమైనా చేస్తారా, లేదా అని నేను ప్రభుత్వాన్ని అడుగుతున్నాను.

సెక్రటేరియట్ బిల్డింగ్ కడతామంటున్నారు, బాగానేవుంది. ఆంధ్రులు బహుళః జలగండంలోనైనా పుట్టివుండాలి, లేకపోతే జలరాశిలోనైనా పుట్టివుండాలి— ఈ రెండింటిలో ఏదో ఒకటి అయివుండాలి. ఎక్కడో- బీగంపేటలో కడతామంటున్నారు- ఆ ప్రదేశం ఏలావుంటుందో చూసివద్దామని వెళ్లాను- దాదాపు అయిదారు నిలువుల లోతులోవుంది ఆ ప్రదేశం. అది అంతా సరిజేసి బిల్డింగుకడితే, అది క్రాక్ యిస్తే, కర్నూలులో మనకా అనుభవంవుంది, లేచివచ్చేసినాము కాబట్టి సరిపోయింది లేకపోతే ప్రమాదం జరిగివుండేది. అటువంటిపరిస్థితి వద్దు, వద్దు, వద్దు - ముమ్మాటికి వద్దు అని చెబుతున్నాను. అంతకంటె ఎత్తుప్రదేశానికి తీసుకువెళ్లి, అన్ని సౌకర్యాలు యివ్వండి.

పంచాయితీరాజ్యం వచ్చింది. అధ్యక్షా, తెలుగులో పంచాయితీ అంటే రెండు అర్థాలువున్నాయి. ఇద్దరు కొట్టుకుని ఎవరిదగ్గరకో వెళ్లి తీర్పు అడగడం ఒకటి, అందరు కలిసి సుఖంగా రాజ్యం ఏలుకోవడం మరొకటి. మొదటిదానికి దగ్గరగా అనుమానం కలుగుతోంది. ఎవరో తీర్పుచెప్పవలసిన పరిస్థితి వచ్చింది. నిన్న సామర్లకోట మునిసిపాలిటీని రద్దుచేస్తూ, అందుకు కారణాలు చెప్పారు. అక్కడి చైర్మన్ తన పార్టీవారికే కంట్రాక్టులు, మొదలైనవి యిచ్చాడని - ఇదే కారణంతో ఆ మునిసిపాలిటీని రద్దు చేయవలసివస్తే, యీనాడు పంచాయితీసమితులన్నింటిని. జిల్లాపరిషత్తులన్నింటిని, యీవాళవున్న గవర్నమెంటును, ప్రతిమంత్రిని రద్దుచేయకతప్పని స్థితివుందని చెబుతున్నాను. దానిని మీరు ఆలోచించండి. ప్రతి లెవెల్‌లోను, జిల్లాపరిషత్తులుగాని, పంచాయితీ సమితులుగాని, మంత్రులనుండి ముఖ్యమంత్రివరకు గ్రూపురాజకీయాలు—వీటితో నాకుసంబంధంలేదు. కనుక వాటినితీసిపారవేయండి, అంటే అలాకుదరదు, డెమోక్రసీలో ఇవి వుంటాయి. అయితే పంచాయతీలలో యివి కాస్త ఎక్కువగా జరుగుతున్నాయి. వాటినిసరిదిద్ది వాటికికావలసిన సౌకర్యాలు కలుగజేసి సక్రమముగా కార్యక్రమములన్నీ అమలు జరిగేట్లుచేయుటకు ప్రయత్నించవలసిందిగా కోరుతున్నాను. డెమోక్రసీగూర్చి లాస్కీ ఏమి చెప్పాడో ఒక్కసారి అవగాహన చేయండి—బొంబాయి గవర్నమెంటు డీసెంట్రలైజేషన్‌పై యిచ్చిన రిపోర్టులో ఆది ఉదహరించారు—తమవద్ద నున్న ఉద్యోగులను సమర్థవంతంగా కార్యాచరణలో వుపయోగించుకోగలిగించే డెమోక్రసీ అని చెప్పారాయన.

మరొక్కమాట చెప్పి నా ఉపన్యాసమును ముగిస్తాను. ఇవాళ మన మంత్రులు ఎంత శక్తి కలిగి వున్నారంటే—తాము కావాలనుకున్న కాగితంకూడా వారికిరాదండి- సెక్రెటరీస్ హోల్డప్ చేస్తారు. ముఖ్యమంత్రిగారికి, యితర మంత్రులకు కూడా నేనీ విషయాన్ని జ్ఞాపకం చేస్తున్నాను. ఒక కాగితం కనుక వారు కావలెను ననుకుంటే

మనరాష్ట్రం. అందువల్ల యీ విషయంలో కూడ detailed గా ఆలోచించి ఒక నిర్ణయానికి రావడానికి ఒక కమిటీని నియమించాలని నేను suggest చేస్తున్నాను. ప్రజల మీద direct taxes వేస్తే కష్టం కలుగుతుంది. Indirect taxes వేస్తే ప్రజలకు యివ్వడంలోగాని ప్రభుత్వానికి collect చేయడంలోగాని ఏమీ కష్టం వుండదు. Market లో automatic గా purchases మీద tax పడుతుంది. రైతులకంత బాధ అనిపించదు. చాల మందికి గుర్తే వుండదు. Village Officers వుండరు, యీ system పోతుంది. కొద్ది భూముల మీద ఆధారపడివున్న చిన్న రైతులు ఏ taxes లేకుండా free గా వుంటారు. కాబట్టి వారిలో సంతృప్తి వుంటుంది. ప్రభుత్వం యివన్నీ ఆలోచించడానికి నిపుణులతో కూడిన ఒక కమిటీని వేసి యీ land revenue ను abolish చేస్తే బాగుంటుంది. 3rd grade tax అయిన ల్యాండ్ రెవిన్యూ తీసేస్తే ప్రజలకు మేలు చేసినట్లు అవుతుంది.

మైనరు ఇరిగేషనుకు సంబంధించి రీజనలు కమిటీ ఒక రిజల్యూషను కూడ pass చేసింది. 300 చెరువులు శాంక్షను అయినాయి, 900 చెరువులు యింకా శాంక్షను కాకుండా వున్నాయని తెలుపబడ్డది. నీటిని శాంక్షను చేయడానికి చాల కాలం పట్టుతోంది. Minor Irrigation tanks తొందరగా శాంక్షను చేయించడానికి ప్రయత్నం చేయాలని కోరుతున్నాను. జహీరాబాద్ కన్‌స్టిట్యుయన్సీ జాగీరు గ్రామాలు కలిసి వున్నటువంటిది. 6,7 సంవత్సరాలకు పూర్వం జాగీరు గ్రామాలలో ల్యాండ్ రెవిన్యూ ఎక్కువగా వున్నది. అప్పుడున్నటువంటి ప్రభుత్వం 1/4 రెమిషను యిచ్చింది. ప్రతి సంవత్సరం రెవిన్యూ బోర్డునుంచి సర్క్యులరు వెళ్లడం, 1/4 రెమిషను యివ్వడం జరిగేది. కాని, ఒక్కొక్క సంవత్సరం land revenue వసూలైన తరువాత Orders వెడుతున్నాయి. Collect అయినది తిరిగి వారికివ్వాలంటే, వారికి చేరే సరికి సగమే అవుతోంది. మిగతా సగం పటేలుపట్వారీల చేతులలోనికిపోతోంది. Permanentగా 1/4 రెమిషను యిచ్చేటట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.

*శ్రీ యస్. సి.శేషాద్రి(రాయదుర్గ్):అధ్యక్షా, గౌరవనీయులైన గవర్నరుగారు ఉభయసభలలోను చేసిన ప్రసంగంపై తీసుకురాబడిన అభినందన తీర్మానాన్ని నేను బలపరుస్తున్నాను. వారియొక్క భాషణ చాలా ఔచిత్యంగాను ఏ విధమైన అతిశయోక్తులు లేకుండా సహజంగా ఉన్నందుకు మనం అందరమూ సంతోషించవలసిందే. గత సంవత్సరం రెండవప్రణాళిక ఆఖరుసంవత్సరం కావడంవల్ల అందులో మనం సాధించుకున్న విజయాలను గురించి చర్చించారు. ఆదేప్రకారం మూడవ ప్రణాళికలో మనం ఎదుర్కొన్న సమస్యలనుగురించి కూడ చెప్పడం జరిగింది. మూడవప్రణాళికలో ఖర్చుకు మనం 305 కోట్ల రూపాయలు కేటాయించినాము. చాలావరకు మన సమస్యలు తీర

గలవని కూడా వారి భాషణలో చెప్పారు. రెండవప్రణాళిక తీసుకున్నపుడు కూడా ప్రజల అవసరాలు ఇంకా ఎక్కువగాఉన్నా ఆర్థికలోపం రీత్యా మనం కొంత తక్కువ చేసుకోవలసివచ్చింది. అలా తక్కువచేసుకున్నప్పటికి పన్నులరూపంగా ప్రజలు చాల ఇబ్బందులకు గురి కావలసివచ్చింది. అయినా ఓర్పుతో పన్నులను ఇచ్చుకున్నారు. రెండవప్రణాళికలో మన ఆశయాలు చాలావరకు సాధించామని మనం అనుకుంటున్నాము. దానికి ప్రభుత్వాన్ని అభినందించవలసి ఉంది. మూడవప్రణాళికలో 305 కోట్ల రూపాయలు కేటాయించినా, అందులో 76 కోట్లు నీటి పారుదలకు, విద్యుచ్ఛక్తికి 65 కోట్లు, వ్యవసాయానికి 73 కోట్లు – ఇంత పెద్ద మొత్తాలను కేటాయించినా, వివరాలలోనికి వెడితే మనకు ఏమంత ఆశాజనకంగా కనిపించడంలేదు. మూడవ ప్రణాళిక కేటాయింపులలో నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 40 కోట్లు, తుంగభద్రకు 7.52 కోట్లు ఉన్నాయి. తుంగభద్ర ఎగువ కాలువను గురించి ఇక్కడ కొంచెం చెప్పవలసి ఉంది. తుంగభద్ర ఎగువకాలువ దాదాపు 20 కోట్లుమించిన ఖర్చుతో రాయలసీమ ప్రాంతానికి ఉపయోగించే ముఖ్యమైన నీటిపారుదల ప్రాజెక్టులలో ఒకటి. ఇది రెండు దశలలో కూడుకున్నది. ముందు తుంగభద్ర డామ్‌నుంచి కాలువతెచ్చి రాయదుర్గం, ఉరవకొండ తాలూకాలద్వారా పెన్నార్‌నదిలో నీటిని వేసి తరువాత mid-Pennar ప్రాజెక్టువద్ద రిగ్యులేటరుకట్టి కాలువలద్వారా నీటిని సరఫరా చేయవలసిన ప్రాజెక్టు ఇది. కాని ఈనాటివరకు జరుగుతున్న కార్యక్రమం చూస్తున్నా, మూడవ ప్రణాళికలో ఈ ప్రాజెక్టుకు కేటాయించబడిన మొత్తం చూచినా, ఎంతవరకు నెరవేరుతుందనే అనుమానం కలుగుతోంది, ఇది 20 కోట్ల రూపాయల ప్రాజెక్టు అందులో వెనుకబడి, నిరంతరక్షామ పీడితమైన ప్రాంతానికి ఉపయోగపడే ప్రాజెక్టు, దీనిని కనీసం ఒక్క ప్రణాళికా కాలంలోనైనా చేయలేకపోతే తరతరాలుగా వస్తున్న క్షామబాధను ఏ విధంగా నివారించడానికి ప్రభుత్వం పూనుకుంటుందో నాకు అర్థంకావడంలేదు. మిడ్ పెన్నార్ ప్రాజెక్టువద్ద కొంత పని జరుగుతోంది కాని రాయదుర్గ్, ఉరవకొండ తాలూకాలలో కాలువ excavationకు సంబంధించినపని ఈనాటికివరకు ప్రారంభించలేదు. ప్రిలిమినరీ ఇన్వెస్టిగేషన్ జరిగి రెండు సంవత్సరాలక్రితమే ప్రారంభం చేస్తామని చెబుతూవచ్చారు. ఈనాటివరకు ప్రారంభించే సదుద్దేశంమాత్రం కన్పించడంలేదు. ఉరవకొండ రాయదుర్గం ప్రాంతాలలో canal excavation work త్వరగా ప్రారంభం చేస్తే అక్కడ వుండే ప్రజలకు, పెద్ద చెరువులన్నీ ఎండిపోతున్నాయి కాబట్టి, ఇరిగేషన్ ద్వారా assured supply వస్తుందనే ధైర్యం కలుగుతుంది. క్షామప్రాంతంలోని ప్రజలు కొంత సంతృప్తి పడడానికి అవకాశం ఉంటుంది. కనీసం ఆ పనియైనా ప్రారంభించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఇక విద్యుచ్ఛక్తిగురించి, విద్యుచ్ఛక్తికి మూడవప్రణాళికలో 65 కోట్లు ఖర్చుచేస్తామని అన్నారు. రెండవప్రణాళికలో దాదాపు 2500 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరాచేస్తే, మూడవప్రణాళిక target 925 గ్రామాలు మాత్రమే అంటే ఇదివరకు ఏ రేటుతోను keep up చేస్తూవచ్చామో, ప్రణా

ళికలు ఎక్కువైనకొద్దీ దానిని ఎక్కువచేసేందుకు మూడవప్రణాళికలో రెండవప్రణాళికలో విద్యుచ్ఛక్తి ఇచ్చిన గ్రామాలసంఖ్యలో సగానికే ఇవ్వగలుగుతున్నామన్న మాట. ఇది ప్రజలలో ఎంత నిరుత్సాహానికి దారితీస్తుందో, ఎంత వ్యతిరేకతను కలిగిస్తుందో ప్రభుత్వం గుర్తించాలి. ఇతరరాష్ట్రాలతో పోల్చి చూసుకుంటే మనం ఇదివరకే విద్యుచ్ఛక్తి సరఫరావిషయంలో వెనుకబడిఉన్నాము. రెండవప్రణాళికలో విద్యుచ్ఛక్తి సరఫరా చేయగలిగినన్ని గ్రామాలకైనా మూడవప్రణాళికలో కూడా సరఫరా చేయలేకపోతే దానికి కారణం ధనాభావమా, లేక విద్యుచ్ఛక్తి సరిగా లభించకపోవడమా అనేది ప్రభుత్వం బాగా యోచనచేయవలసిఉంది. International Bank for recon-struction and development- World Bank ఉన్నది, వారు ప్రత్యేకంగా రూరల్ ఎలక్ట్రిఫికేషన్‌కోసం loans ఇస్తున్నారని తెలుస్తోంది. మద్రాసు, మైసూరు ప్రభుత్వాలు ఆ రకంగా లోను సంపాదించి గ్రామీణ విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రత్యేకమైన శ్రద్ధవహిస్తున్నట్లు తెలుస్తోంది. మన రాష్ట్రంకూడా World Bank కు లోన్సుకు అప్లయిచేసి సహాయం తీసుకుని గ్రామీణ విద్యుచ్ఛక్తి సరఫరాకు సహాయపడడానికి పూనుకొన్నదా అనే విషయం గవర్నరుగారి ప్రసంగంలో లేదు. ఈ విషయంలో ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటున్నదో తెలపాలని కోరుతున్నాను. అంతే కాకుండా మాకు ఇంకొక భయంఉంది. మనం shortage of power ను ఎదుర్కొనవలసి వస్తున్నదా అనే విషయం ఇది ఒక్క అనుమానమే కాదు. Facts and figures బట్టి కూడా తెలుస్తున్నది. 1961 అంతానికి దాదాపు 220 మెగావాట్ల డిమాండు మనకు ఉంటే మనకు 150 మెగావాట్లు మాత్రమే సప్లయి ఉంటుంది. 70 మెగావాట్లవరకు మనకు power shortfall ఉంది. మూడవప్రణాళిక అంతానికి total demand 452 మెగావాట్లు ఉంటే 291 మెగావాట్ల విద్యుచ్ఛక్తిమాత్రమే లభిస్తుంది. 161 మెగావాట్ల power shortage కనబడుతోంది. దీనిని get over చేయడానికి ప్రభుత్వం ఏమి ప్రయత్నాలు చేస్తున్నదో తెలుసుకోవలసిఉంది. హోస్పేటదగ్గర మునిరాబాదు పవర్ స్టేషన్‌కు సంబంధించి కొంతభాగం మనకు రావలసి ఉంటుందనే విషయమై ఇదివరకు ఒక ఒప్పందం జరిగింది. ఇటీవల మాకు తెలియవచ్చిన విషయం-ఏమిటంటే ఇదివరకు చేసుకున్న అగ్రిమెంటు విషయంలో వారు వెనుక్కుపోతున్నారని అగ్రిమెంటు కాగితాలు లేవని ఎగగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వం ఎట్టిచర్యలు తీసుకొని ఇదివరకు చేసుకున్న అగ్రిమెంటు ప్రకారం మనకు రావలసిన వాటాను సాధించడానికి ప్రయత్నం చేయవలసిన అగత్యం ఉంది. ఆ పవర్ కూడావస్తే కొంతవరకైనా నేడు ఉండే shortage ని పూడ్చగలుగుతామని మనవి చేస్తున్నాను. తరువాత ప్రత్యేక రైల్వే మండలం కావాలని చాలా కాలంగా ఆందోళన చేస్తున్నాము. ఈ విషయమై గవర్నరుగారి ప్రసంగంలో ఏమిలేదు ఇది చాలా అవసరమైనది. Goods సరఫరాలో కాని పాసింజర్ ట్రాఫిక్‌లో కాని ఉండే ఇబ్బందులను తొలగించాలంటే, ప్రజల ఉపయోగానికి అవస

రాలకు రైల్వేలను మార్చుకోవాలంటే ప్రత్యేక రైల్వే మండలం అవసరం. ఈ విషయంలో మంత్రివర్గం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోలేదని భావిస్తున్నాను. మనకు చాలా lines ఉన్నాయి. ఇక ముందైనా ప్రత్యేక రైల్వేమండలానికి కృషి చేయాలని భావిస్తున్నాను. రాజ్యాంగంలో ఉన్న డైరక్టర్ ప్రిన్సిపల్సుకు అనుగుణంగా కంపల్సరీ ఎడ్యుకేషన్ స్కీము ప్రవేశ పెట్టబడింది. ఇందుకు 3300 మంది అడిషనల్ టీచర్సు కావాలనికూడా చెబుతూవచ్చారు. నిజానికి ఆశయం నెరవేరినట్లు వ్రాసుకోడానికి ప్రవేశపెట్టామే కాని కావలసినంతమంది trained teachers లేరు. Training institutions మూడు, నాలుగు మాత్రమే వున్నాయి. ఈ స్కీము క్రింద ఉద్యోగాలకు పెట్టుకొమ్మని జిల్లా పరిషత్తు అంటే కావలసినన్ని దరఖాస్తులుకూడా రాలేదు, కారణం trained teachers లేకపోవడమే ట్రయినింగ్ కావడానికి కావలసిన facilities లేవు. కంపల్సరీ ఎడ్యుకేషన్ స్కీము విజయవంతం కావాలంటే ట్రయినింగ్ సంస్థలను జాస్తీ చేస్తేతప్ప trained personnel దొరుకరు. అదిలేకపోతే పేపర్ స్కీముగా ఉంటుందేకాని విజయవంతంగా కొనసాగదు. జిల్లాకు రెండు చొప్పున అయినా ఎక్కువగా ట్రయినింగ్ సంస్థలు open చేస్తే తప్ప ఇది successful కాదని ప్రభుత్వ దృష్టికి తెస్తున్నాను.

*శ్రీ వి. విశ్వేశ్వరరావు (మైలవరం):- అధ్యక్షా, గవర్నరుగారు ఉపన్యాసము చేశారు, అందులో ఈనాటి కృష్ణవరదల గురించి ఒక మాట చెబుతారను కున్నాను. వరదల విషయం ప్రస్తావన చేయలేదు. గవర్నరుగారికి కూడా తెలుసు. వరదలు వచ్చాయని, వరద బాధితుల సహాయ నిధినుంచి రెండు వేల రూపాయలు మాత్రం పంపించారు. ప్రభుత్వమునకు వరదలను గురించి తెలిసి కూడా వరదనివారణకు ఎటువంటి చర్య తీసుకున్నారో కూడా చెప్పలేదు. కృష్ణ వరదవల్ల కృష్ణాజిల్లా. గుంటూరు జిల్లాలలో 35 గ్రామాలు వరదమయం అయినవి. అనేకమంది ప్రజలకు నిలువ నీడలేకుండా పోయి బయట ప్రాంతాలకుతరలించవలసిన అవసరం ఏర్పడింది. ప్రతిసంవత్సరం కృష్ణవరద వచ్చినప్పుడల్లా యిదే అవసరం ఏర్పడుతూ ఉంది. అందులో ప్రత్యేకించి పల్లపు ప్రాంతాలలోవున్న క్షీణ హరిజనుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించవలసిన అవసరముంది. కృష్ణనీరు 14' వచ్చిందనే సరికి పల్లపు ప్రాంతాలు మునిగిపోవడం అక్కడున్నవారిని తరలించవలసి రావడం జరుగుతోంది. ఎక్కడైనా మెరక ప్రాంతాలలో వరదపట్టని ప్రాంతాలకు ఇండ్లస్థలాలు యిచ్చిన ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని పదేపదే విన్నవించినప్పటికీ అటువంటిచర్యలు తీసుకోవడంలేదు. బెజవాడ తాలూకాలో పాముల్లంక ప్రాంతం అనగా కృష్ణ మధ్యనున్నవారు బయటికి వస్తాం. ఇండ్ల స్థలాలు చూపించవలసిందని కోరారు. 11 సంవత్సరాలనాడు కోరినప్పటికీ ఇంత వరకు ఫైనలైజ్ చేయ

లేదు. జాగుజరుగుతోంది, సోషల్ వెల్ఫేరు డిపార్టుమెంటు వారు మామూలు పద్ధతిని అవలంబించి ఆలస్యం చేస్తున్నారు.

కృష్ణ వరదలవల్ల బయటనుంచి వచ్చే ప్రజలకు బియ్యం యివ్వడం జరుగుతోందికాని మంచిచెడ్డలు ఆలోచించడానికి ప్రభుత్వం పూనుకోవడం లేదు. ఈ వరదలవల్ల 35 గ్రామాలు మునిగిపోయాయి. ఆగ్రామాలలో ఉండే రైతాంగం ప్రభుత్వమునకు చెల్లించవలసిన అప్పుల విషయంలోగాని బకాయిల విషయంలోగాని వచ్చే సంవత్సరం వరకు వాయిదా కోరినారు, దానివిషయం వెంటనే చర్య తీసుకోవలసిన అవసరముంది. పల్లపు ప్రాంతాల ప్రజలకు మెరక ప్రాంతాలలో ఇండ్ల స్థలాలు ఇస్తే వాటిని ప్రతి సంవత్సరం బయటికి చేర్చాలనే సమస్య లేకుండా పోతుంది. కృష్ణలంకలో సుమారు 2—3 వేలమంది ప్రజలను తరలించాలి. కృష్ణలంక దగ్గర పెద్ద కట్టకూడా వేశారు. అది బలంగా లేదని ప్రవాహాన్ని అడ్డుకొనే స్థితిలో లేదని ప్రభుత్వానికి తెలుసును. బెజవాడ మునిసిపాలిటీకి 10 లక్షల రూపాయలు అప్పు ఇస్తామని చెప్పారు. అప్పు ఇవ్వడంలో శ్రద్ధ వహించక పోవడంవల్ల మంజూరు చేయక పోవడంవల్ల కృష్ణవరదనుంచికాపాడి రక్షణ చేయలేకపోయింది ప్రభుత్వం, ఇప్పుడే బెజవాడ నీటి సప్లయి స్కీముకూడా ప్రారంభించారు. ముఖ్యమంత్రిగారు నెలరోజులక్రితం నీటిసరఫరాకు ప్రారంభోత్సవం చేశారు. నెలరోజులు కాకపూర్వమే 4 bore wells మునిగిపోయాయి. బెజవాడ నీటి సప్లయి ఆపుచేశామని మునిసిపాలిటీవారు ప్రకటించారు. ప్రభుత్వకార్యకలాపాలు ఎంత అసందర్భంగా జరుగుతున్నాయో ఆలోచించాలి. 30 లక్షల రూపాయలు ఖర్చుపెట్టినప్పటికి ప్రజలకు నీటిసరఫరా చేయలేకపోవడం చివరకు కృష్ణవరదవల్ల ఆపుచేయవలసిన పరిస్థితులు రావడం శోచనీయం. ఇదిసరిపోదు. బెజవాడకు డైరెక్టుగా కృష్ణానదిలోంచి నీరుసప్లయి చేసేస్కీము ఉంది, వెంటనే దానిని మంజూరుచేయడానికి అవసరమైన డబ్బు ప్రభుత్వం అప్పుగా యివ్వాలనికోరుతున్నాను. గవర్నరుగారు తమ ఉపన్యాసంలో "అడవులకుకావలసినభూములను అటవీశాఖ వారికి లభ్యమయ్యేటట్లు చేయవలసిందని గ్రామాల విస్తీరణ నిమిత్తం పచ్చిక బయళ్లు. వంటచెరకు. అడవులకు కావలసిన భూములను అరికట్టవలసిందని కూడ ఉత్తరువులు జారీ చేయబడ్డాయి" అని చెప్పారు. ఇదిచాలా పెద్ద statement చేశారు. మానవులకు తిండిలేక పస్తులు పడివుంటే ఫరవాలేదు కంప, కట్టె కావాలి. వంటచెరకు కోసం అడవులను తయారు చేస్తామని చెప్పారు. దీనిసేమనాలో అర్థం కావడంలేదు.

కృష్ణాజిల్లాలో వెల్లటూరు, వెంపసం, గణపవరం, కోడూరు గ్రామాలలో 10—15 సంవత్సరాల నుంచి సొసైటీలు స్థాపించుకుని వేయి వేయి కుటుంబాలవారు ఆ భూము లను సాగుచేసుకుని జీవిస్తున్నారు. మనం ఉమ్మడి మదరాసు రాష్ట్రంలో వుండగా వారికి యివ్వడం జరిగింది. 15 సంవత్సరాలనాడు యిచ్చారు అప్పటినుంచి సాగు చేస్తున్నారు. ఇప్పుడు అడవులు కావాలనే కారణంతో వారిని భూములలోంచి వెళ్ళగొట్టడానికి నిర్ణయం తీసుకోవడం అన్యాయమని దానిని మరల ఆలోచించాలని కోరుతున్నాను, చంద్రాల గణపవరం తిరువూరుదగ్గర కోడూరుదగ్గర plantation కార్యక్రమంజరుగుతోంది. Plantation కార్యక్రమం చూస్తే ఎన్నిలక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఎన్నిచెట్లు పెంచారో, ముఖ్యమంత్రిగారిని స్వయంగా చూడవలసిందిగా కోరు తున్నాను. అడవుల పెంపకం కార్యక్రమం ఎంత జయప్రదంగా జరుగుతోందో చూడ వలసిందని కోరుతున్నాను. ఎలా చేసినది ప్రభుత్వబులిటెన్‌లో చెప్పారు. "State afforestation towards the development of forests in the State: Afforestation was done, plants were raised in an area of 12878 acres" అని చెప్పారు, 5 సంవత్సరాలలో సుమారు13వేలఎకరాలలోafforestationజరిగింద? ప్రభుత్వంప్రకటించిన లెక్కలలో ఉంది, లెక్కలప్రకారం చూసినప్పటికీ ఎంత భూమిని అడవులుగా పెంచారు. ఎన్ని చెట్లు ఉన్నాయి. ఎనిచెట్లు చచ్చిపోతున్నాయి చూడమని కోరుచున్నాను. అడ వులు పెంచేచోటకూడా లంబాడీలు యాదవులు పశువులను మేపుకొంటూ జీవించే వారు. వారుఅడవులలోకివెళ్ళకూడదనిపశువులనుమేపడానికి conditions పెట్టడంవల్ల పశువులను బందిలదొడ్డిలో పెట్టడంవల్ల పశువులను అమ్ముకోవలసిన పరిస్థితి వచ్చింది, అందువల్ల ప్రభుత్వాన్ని కోరేది. అడవులు పెంచే కార్యక్రమం జయప్రదం చేయా లంటే అనేక ప్రాంతాలలో చేయవచ్చు. నూజవీడు తాలూకాలోమక్కళ్ళపాడు వగైరా గ్రామాలు నాలుగు వేలమంది రైతులు నాలుగు వేల ఎకరాలు సాగుచేస్తున్నారు, వారిని భూమినుంచి వెళ్ళ గొట్టడం న్యాయం కాదు, కరువునుంచి ప్రజానీకాన్ని కాపాడాలంటే అధికావోత్పత్తి జరగాలంటే వారిని భూమినుంచి వెళ్ళగొట్టకూడదు, సాగుచేసుకోనివ్వాలి, అందువల్ల ప్రభుత్వం తిరిగి ఆలోచించాలని కోరుతున్నాను.

సహకార సేద్యం గురించి మాట్లాడుతూ 35 సహకార క్షేత్రాలను పెడతామని చెప్పారు, అసలు మన రాష్ట్రంలో ప్రారంభించినవి ఎన్ని? జయప్రదంగా జరిగేవి ఎన్ని? వాటిమీద ప్రభుత్వానికి వచ్చిన రిపోర్టు ఏమిటి అనే విషయాలను ఆలోచించవల సిందిగా కోరుతున్నాను. 1961-62 సంవత్సరంలో ఈ క్షేత్రాలను స్థాపించటానికి ప్రభుత్వం తీసుకొన్న చర్యలేమిటి అని అడుగుతున్నాను. అయిదు సంవత్సరముల నుండి ప్రభుత్వం పదే పదే వాగ్దానాలు చేస్తూ వచ్చింది. సమగ్రమైన సహకార చట్టాన్ని

తీసుకు వస్తామని చెబుతున్నారు. కాని ఇంతవరకు ఆ చట్టం ప్రవేశపెట్టబడలేదు. ఆ విషయంలో సత్వరమే తగిన చర్యలు తీసుకోవాలని మనవి చేస్తున్నాను.

ఇక, ప్రైవేట్ వర్కర్స్ గురించి అనేకసార్లు చెప్పటం జరిగింది. బెజవాడలోని ఎలక్ట్రిసిటీ వర్కర్స్‌తోను. పి. డబ్ల్యు. డి. వర్కర్స్‌తోనూ సమానంగా ప్రైవేట్ వర్కర్స్‌ను చేస్తామని మంత్రిగారు వాగ్దానం చేశారు. పి. డబ్ల్యు. డి. వారికి. ఎలక్ట్రిసిటీ వారికి జీతాలు అమలు జరపటం జరిగింది. కాని ప్రైవేట్ కార్మికులకు మాత్రం ఏమీ అమలు జరపటంలేదు. ఆఫీసులో ఫైల్స్ అడుగున పడివున్నాయేమోనని అనుమానంగా వుంటున్నది. అందరిని సమానం చేస్తామని మంత్రిగారు వాగ్దానం చేశారు. ఆ వాగ్దానం ప్రకారమే సమ్మె విరమించటం జరిగింది. కనుక దానిని అమలు జరపాలని కోరుతూ ఇంతటితో సెలవు తీసికొంటున్నాను.

*శ్రీ టి. రామచంద్రారెడ్డి: (షట్లూరు) అధ్యక్షా, ఈనాడు నాకు అవకాశం ఇచ్చినందుకు మీకు నా ధన్యవాదాలు. గవర్నరుగారి ప్రసంగాన్ని నేను హృదయపూర్వకంగా బలపరుస్తూ మీ ద్వారా ప్రభుత్వ దృష్టికి కొన్ని విషయాలను తేదలచుకొన్నాను. ఇదివరకు ఎన్ని సూచనలు చేసినా ఏమీ ఉపయోగం లేకుండా వుంది. కాని మేము ప్రతినిధులం కాబట్టి మా నియోజక వర్గములలోని సాధక బాధకాలను ఎసెంబ్లీలో చెప్పకతప్పదు. కనుక మా ప్రాంతములోని సాధక బాధకాలను మనవి చేయాలనుకొంటున్నాను.

రాయలసీమ ప్రాంతంలో ముఖ్యంగా అనంతపురం జిల్లాలో, చిత్తూరు జిల్లాలో 4,5 సంవత్సరముల నుండి క్షామం తాండవం చేస్తోంది. ఆ విషయం ప్రభుత్వ రికార్డులోనే వుంది. ఆ ప్రాంతాలలో ప్రభుత్వం రెమిషన్ కూడా ఇస్తున్నది. కాని ఈ క్షామాన్ని ఎలా నివారించాలి అనే విషయంలో ప్రభుత్వం ఒక ఫైనల్ అభిప్రాయానికి రాలేకుండా వున్నది. చేయవలసిన పనులన్నీ మూలకు నెట్టి కాలహరణం చేస్తున్నారు. రాయలసీమ ప్రాంతంలోని రైతుల కష్టాలను వినే స్థితిలో ప్రభుత్వం లేకపోవటం శోచనీయమైన విషయమని మనవి చేస్తున్నాను. గత నాలుగైదు సంవత్సరాల నుండి అనంతపురం జిల్లాలోనూ, రాయలసీమలోని ఇతర ప్రాంతాలలోనూ వేరుసెనగ, పత్తి పైరులను గొంగళీ పురుగులు సర్వనాశనం చేస్తున్నాయి. ఈ విషయాన్ని అనేకసార్లు ఈ ఎసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చాను. కాని ప్రభుత్వం కొంచెం కూడా ఆందోళన చెందుతున్నట్లు కన్పించటంలేదు. రాయలసీమలో వేరుసెనగ పత్తి పంటలు కాష్ క్రాప్స్. వాటివల్లనే రైతుకు కొద్ది ధర గిట్టుతుంది. ఈ పంటలు దెబ్బతింటే రైతులు చాలానష్టపడతారు. ఈవిషయాన్ని ముఖ్యమంత్రి, ఎగ్రికల్చరల్ మంత్రిగార్ల దృష్టికి తీసుకువచ్చారు. గొంగళీ పురుగు ఎందుకు వ్యాపకం అవుతున్నది? ఎలా

నాశనం చేయూలి అనేవాటి గురించి రిపెర్పి చేయించటానికి ప్రభుత్వం ఎందుకు ప్రయత్నించటంలేదో అర్థం కావడంలేదు. అది వారి అసమర్థతా? చేతకానితనమా? చేయకూడదనే అభిప్రాయమా ఏమిటో నాకు అర్థం కావటంలేదు. నేను కూడా ఒక రైతునే. రైతు ఏ విధంగా అధఃపాతాళానికి పోతున్నాడో నాకు తెలుసు. వేరుసెనగ 117 రూపాయలు ఖర్చుచేసి వేస్తే విత్తనంకూడా రాలేదంటే ఎంత బాధగావుంటుందో ఆలోచించాలనికోరుతున్నాను. ఇక వ్యవసాయఖర్చుకు, పిల్లల పోషణకువారెన్ని కష్టాలుపడాలో నేను వేరే చెప్పనక్కరలేదు. అక్కడ వున్న పరిస్థితులను బాగు చేయటానికి ఏనాడో పెద్దలు తుంగభద్ర హైలెవెల్ కెనాల్ స్కీమును ఏర్పాటు చేశారు. కాని అది మందకొడిగా జరుగుతోంది. ఈ విషయాన్ని గత ఎసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చాను. ఒక సెపరేట్ సర్కిల్ ఏర్పాటు చేసి తుంగభద్ర హైలెవెల్ కెనాల్‌ను రాయలసీమలో క్షామ పరిస్థితిని పరిష్కారం చేయటకు తీసుకురండి అని చెప్పాను. చేస్తాము, అది ఆలోచనలో వుంది అని పి. డబ్ల్యు. డి. మంత్రిగారు చెప్పారు. కాని ఎప్పుడు చేస్తారో తెలియకుండా వుంది. సత్వరం ప్రారంభించండి అని చెబితే మాకు ఫండ్స్ లేవని చెబుతారు. కాని రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి గారు ఇదే సమావేశంలో ముఖ్యమంత్రి గారు ఒకటిన్నర కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి మేము సెక్రటేరియట్ బిల్డింగ్స్ కట్టబోతున్నామని చెప్పారు. రాయలసీమలో తిండిగింజలు లేక క్షామంతో బాధ పడుతుంటే బిల్డింగులకు, వైభోగాలకు ఫాన్సీగా ఖర్చు పెట్టటం సవ్యమా ఇది ముఖ్యమా, లేక రాయలసీమ క్షామ పరిస్థితి ముఖ్యమా అనే విషయం ఆలోచించకుండా ప్రభుత్వం పొరబాటుగా వ్యవహరిస్తోంది, దేశంలో అవసరమైన తిండి గింజలను, ఇతర ముఖ్యావసరాలను సమకూర్చుకొన్న తరువాత సెక్రటేరియట్ బిల్డింగ్స్, మంత్రులకు కావలసిన ప్యాలెస్‌లు కట్టుకోవచ్చు. కాని అవన్నీ పెండింగ్‌లో పెట్టి ఇవి చేసి డబ్బు దుర్వినియోగం చేయటం అన్యాయమని, దానికి ప్రజలు ఒప్పుకోరని మనవిచేస్తున్నాను. కనుక ప్రభుత్వం ఆ విషయాన్ని పునరాలోచించాలని కోరుతున్నాను.

విద్యుచ్ఛక్తి విషయం గురించి చెబుతూ 3281 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సప్లయి చేశామని చెప్పారు. ఈ లెక్కలు ఎలా నమ్మాలో నాకు అర్థం కావడంలేదు. జగ్లరీ ఆఫ్ ఫిగర్స్ వల్ల ఈణంలో రిమ్యునరేటివ్ అవుతున్నాయి. ఈ స్కీమును ప్రవేశ పెడుతున్న ప్రతిచోటా తమకు కావలసిన చోట్లలో చేస్తున్నారు తప్పితే చేసిన ప్రతిచోటా రెమ్యునరేటివ్ కాదు. ఐ చాలెంజ్ ఆల్ దిస్. విద్యుచ్ఛక్తి మన రాష్ట్రానికి ఎంత అవసరమో అందరకూ బాగా తెలుసు. అటువంటిపరిస్థితులలో మన ప్రభుత్వం లోన్స్ రైజ్ చేసి, 4,5 కోట్ల వరకుపెంచి గ్రామాలన్నిటికి విద్యుచ్ఛక్తి విరివిగా సరఫరా చేయకూడదా? ప్రభుత్వం మీద విశ్వాసం లేక లోన్స్ రావనే భయం ప్రభుత్వానికి వున్నదా? అటువంటి భయం పెట్టుకోకుండా లోన్స్‌రైజ్ చేసి

గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయాలని మనవిచేస్తూ ఇంతటితో సెలవు తీసు కొంటున్నాను.

*శ్రీ ఎన్. వెంకయ్య (అద్దంకి)- అధ్యక్షా, ఇంతకుముందు శ్రీ రాజగోపాల నాయుడు గారు సూచించిన అంశాలన్నింటిని నేను బలపరుస్తూ అదనంగా కొన్ని అంశా లను చెప్పదలచుకొన్నాను. గవర్నరుగారి ప్రసంగాన్ని పరిశీలించిన అనంతరం ఎందరో ఎన్నోవిధాలుగా విమర్శిస్తున్నారు. గవర్నరుగారి ప్రసంగంలో ఆంధ్రదేశం యొక్క ఆర్థిక స్థితిని పెంచటానికి సూచనలే కన్పించలేదు.

పైగా, సూచించదగిన కొన్ని అంశాలుకూడా లేవు. ఈ రోజున వరదలతో ఆంధ్ర దేశము కూడా కొంత బాధ అనుభవిస్తున్నది. ఆ విషయం గురించి ఒకమాట అందులో లేదు. అలాగే ఇంకా మన మనస్సును కలవరపరిచే అంశాలు ఉన్నాయి. అవికూడా కొన్ని వారి ప్రసంగంలో లేవు. అందులో మనం కొంత ఆదాయాన్ని పోగొట్టుకొన్న మద్యపాన నిషేధంకూడా ఒకటి. దానిని మన ప్రభుత్వం జయప్రదంగా నడపగలుగు తున్నారా అంటే నడుపలేకుండా ఉన్నది. కాని దృష్టిని మార్చడానికి మాత్రం దానిని కొన్ని వేల మంది పోలీసుల నుంచి తప్పించి కొలది పోలీసులతో ఒక ప్రత్యేక శాఖ చేసి వారికి అప్పగించారు. కాని ఎక్కువ మంది చేయలేని పని కొలది మంది ఏ మాత్రం చేయగలుగుతారు? కాబట్టి ఇప్పుడు అజమాయిషీ లేకుండానే ఇష్టంవచ్చినట్లుగా, ఇదివరకు మోస్తరుగానే అది విజృంభించడము, ఎక్కువ ఉత్పత్తి జరగడం దానివల్ల ప్రజలు అనా రోగ్యం పాలుకావడంకూడా జరుగుతున్నవి. కల్లులో కొంత ఆహారశక్తి కూడా ఉంటుం దని చాలామంది అభిప్రాయము, కాని అదైనా ఉంచకుండా తీసివేయడంవల్ల ప్రమాద కరమైన సారా త్రాగుడు పెరిగిపోతున్నది. ఏమైనప్పటికినీ నేను ఈ మద్యమునకు చాలా వ్యతిరేకిని 1939 సంవత్సరం నుంచి 1940 సంవత్సరం వరకు మా గ్రామంలో సారా, కల్లు లేకుండా చేసినవాణ్ణి. చుట్టుపట్లకూడా లేకుండా చేసినాను. నాకు పట్టుదల ఉన్నది. మద్యాన్ని ఎవరుకూడా త్రాగకుండా చేయడం అవసరం, దానివల్ల కలిగే సాధక బాధకాలు అన్నీ మానసికంగా తట్టి త్రాగకుండా చేసేందుకు తగినంత ప్రచారం చేయండి. అంతేగాని ఆ త్రాగేవారిని నిరోధించడం వలన చేతగాని, చేయలేని మద్య నిషేధం అమలువలన ప్రభుత్వ ఆదాయాన్ని కోల్పోతున్నదేగాని దాని ఉత్పత్తి తగ్గడం లేదు, త్రాగడం తగ్గడంలేదు, పైగా లంచగొండితనం, ఇంకా ఇతర విపరీత పరిస్థితులు కూడా ఏర్పడి, ఆఖరుకు అనారోగ్యం పాలుకూడా కావడం జరుగుతున్నది. మామూలు మద్యం వలెగాక ఇప్పుడు జరుగుతున్న విధంగా అశాస్త్రీయంగా తయారు చేయబడే మద్యంవలన అందరు అనారోగ్యం పాలు కావడం కూడా జరుగుతున్నది. కాబట్టి ప్రభుత్వము ఆ విషయంలో ఎంతవరకు శ్రద్ధ తీసుకొంటుంది అనేది ఈ ఉపన్యాసములో ఎక్కడా కన్పడటం లేదు. అలాగే ప్రభుత్వ పరిపాలనలో ఎన్నోలోట్లు ఉన్నాయి.

చాలా అధ్వాన్న దశలో నడుస్తున్నదని మేమే కాదు, ప్రభుత్వం పక్షంవారే అనేక విధాలుగా సూచిస్తున్నారు. ఆ లోట్లు ఏమీ వారి చెవిలో దూరలేదా? దూరినట్లయితే వాటిని సవరించడానికి ప్రయత్నాలు చేసినట్టుగా గాని, చేయబోతున్నట్లుగా గాని ఎందుకు ప్రభుత్వము సూచించడం లేదు? ఒంగోలులో ముఖ్యమంత్రిగారి ఉపన్యాసం నేను కూడా వినడం తటస్థించినది. ఒంగోలు మునిసిపల్ చైర్మన్ గారికి "మీ లాగు కొంచెం మడచి, చొక్కా విడిచి ఏదో పాకలకు వెళ్లి కొంతపని చేయండి" అనివారికి ఉపదేశించారు. కాని ఇక్కడ జరుగుతున్నది ఏమిటి? ప్రభుత్వంలో లంచగొండితనం, అవినీతి, దుబారా వ్యయం, ఇవి విచ్చలవిడిగా పెరిగిపోతూ ఉంటే, దానిని అరికట్టడానికి ఏమైనా ప్రయత్నం చేస్తున్నారా? వారు తమ ఉపన్యాసాన్ని గుర్తు ఉంచుకొని మామూలుగా ఇళ్లులేక, ఆహారంకూడా తగినంత ఉత్పత్తి లేక ప్రజలు బాధపడుతున్న పరిస్థితులలో, వారు ఏమైనా కృషి చేస్తున్నారా, వారేమైనా త్యాగాలు చేస్తున్నారా? వారు air-condition భవనాలు వదలడంలేదే? హద్దులేని అద్దెలు ఇచ్చుకొంటూ వార్టీ ఖర్చుకు పరిమితి లేదు. వారికొరకు ఒక బిల్లునుకూడా పాస్ చేసుకొన్నారు. పార్టీ చేతిలో ఉన్నదని పూరిళ్ళకుకూడా గతిలేని వారిదగ్గర వసూలుచేసి, వారి శ్రమమీద ఆధారపడి, వారు కొన్ని వస్తువులమీద ఆధారపడిన పన్నులువల్ల వచ్చే ఆదాయంతో హద్దులేని అద్దెలతో పెద్ద పెద్ద భవనాలు తీసుకొని అనుభవిస్తున్నారు. ఉన్న భవనాలు చాలవని, ఇంకా బ్రహ్మాండమైన భవనాలు, ఉన్నతోన్నత ఆర్థిక జీవనానికి అవకాశం ఉన్న దేశాలలో లాగు, ఇక్కడకూడా నిర్మించడానికి మళ్ళీ బేగంపేటలో ఒక సచివాలయ భవనాన్ని నిర్మించేందుకు కోటికాదు, air condition ఉండాలని, 1 1/2 కోటి ఖర్చు చేయాలని ఆలోచిస్తున్నారు. ఈ రోజు ప్రజలకు సరియైన దారులులేక, వెళ్ళడానికి రావడానికి అవకాశాలులేని గ్రామాలు అనేకం ఉన్నాయి అలాగే నివసించడానికి స్థలంలేక, ఇల్లులేక పూరిపాకకూడా లేకుండా చాలామంది ఉంటున్నారు. ఇవన్నీ ఆలోచించకుండా, అమెరికాకు కోట్లకొలది ధనాన్ని ధారబోస్తూ, తగిన జలాశయాలు నిర్మాణం త్వరత్వరగా జరగకుండా, అందుకు తగిన ప్రయత్నం చేయకుండా డబ్బులేదు అనేసాకుతో అన్నీ వాయిదాలు వేసుకొంటూ, ఇలాంటి భవనాల నిర్మాణం ఏమిటి? ఈ నూతనంగా కట్టబోయే భవనాలవలన 8 లక్షలు అద్దె కలిసివస్తుందని అంటున్నారు. 8 లక్షలు అంటే మాటికి దాదాపు వారు పెట్టే ఖర్చులో అయిదవవంతు వడ్డీగిట్టుతుంది. కాని భవనాల యొక్క ఆయుపు ప్రమాణము తగ్గేకొద్ది ఇంకా ఈ వడ్డీలో తీసివేయవలసి వస్తుంది. కాబట్టి మూడు per cent మాత్రమే గిట్టుతుంది. కాని ఈ రోజున రాజగోపాలనాయుడుగారు చెప్పినట్టుగా, మరికొందరు సూచించినట్టుగా జలాశయం నిర్మించినా మన దేశంనుంచి సంవత్సరానికి కోటికిపైగా పంపిస్తూన్న ధనం ఆగిపోతుందని ఆవిధంగా ఎందుకు చేయకూడదు. దానికి ఎందుకు ప్రభుత్వము డబ్బును వినియోగించకూడదు. అందరికి హితోపదేశం చేసే ముఖ్యమంత్రిగారు జాగ్రత్తగా విషయాలు ఆలోచించి ప్రజల జీవనానికి అత్యావశ్యకమైన అంశాలలో తమ దృష్టిని ఉంచి వారు కొంత త్యాగా

లకు అలవాటై ప్రజలయొక్క జీవితాన్ని కొంచెం ముందుకు తీసుకుపోవడానికి ప్రయత్నం చేస్తారని ఆశిస్తున్నాము.

తెలుగులో పరిపాలన జరవడానికి చర్యలు తీసుకొంటున్నామని అంటున్నారు. అవికూడా తాలూకా వరకేనని అంటున్నారు. కాని దానికి ముద్రణా సౌకర్యాలు లేవంటున్నారు. సరి అయిన key boards ను ఏర్పాటు చేయడానికి, సంక్షిప్త లేఖనమునకు తగిన విధానాలను సూచిస్తూ రెండు సంవత్సరముల క్రిందట ఒక రిపోర్టు వచ్చింది, దానిపైన ఎందుకు ప్రభుత్వము చర్యలు తీసుకోకూడదు? పోగా కొలది మార్పులతో లిపిని ఎంతో సౌలభ్యంగా అచ్చుకు, టైపుకు అన్ని విధాలుగా ఉపయోగించడానికి అవకాశం ఉన్నప్పుడు, అలాంటి రిపోర్టు వస్తున్నప్పుడు, దానిని ఎందుకు పరిశీలించి అమలు చేయకూడదు? కాబట్టి త్వరలో తెలుగులో పరిపాలన జరిపించడానికి ప్రభుత్వానికి ఉద్దేశం లేదేమో అనిపిస్తున్నది,

అలాగే, ప్రభుత్వము plan లో కోట్లు ఖర్చు పెట్టామని గర్వపడుతున్నది. కాని అది ఎంతవరకు సద్వినియోగం అయింది. ఎంతవరకు ప్రజల సౌభాగ్యానికి, మామూలు ప్రజానీకంయొక్క అభివృద్ధికి వినియోగించబడిందని విచారణ చేయలేదు అటువంటి పరిశీలన ఏమీ లేకుండా, కోట్లకొలది ఖర్చుపెట్టామనే తృప్తిని మాత్రం వెల్లడిస్తున్నారు, ఆ విధంగా కాకుండా అది ఎంతవరకు సక్రమంగా ఉపయోగకరంగా వినియోగింపబడిందో పరిశీలించడానికి అన్ని పార్టీలతో కూడిన ఒక కమిటీని చేయండి ఆ విధంగా చేసి ఇక ముందు ముందు plans లోనైనా పనులు సక్రమంగా, ప్రజలకు ఉపయోగకరంగా నడవడానికి డబ్బు సద్వినియోగం కావడానికి అవకాశాలు కల్పించవలసిందిగా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

*శ్రీ యమ్. వి. యస్. సుబ్బరాజు (కొత్తపేట): అధ్యక్షా గవర్నరుగారి ప్రసంగానికి శ్రీ నరసింహారావుగారు ప్రవేశపెట్టిన అభినందన తీర్మానానికి నాహార్ధ్హ మోదాలము తెలియచేస్తూ ప్రభుత్వమునకు కొన్ని సూచనలు చేయదలచుకొన్నాను.

ఈ రెండవ పంచవర్ష ప్రణాళికా కార్యక్రమాలు అమలు జరుపు కొనుటలో మనం నిర్ణయించుకొన్న ధ్యేయానికి మించి ముందుకు వెళ్ళగలిగినందుకు ప్రత్యేకంగా ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను.అయితేమనం అధికార వికేంద్రీకరణజరిపి అధికారాన్ని ప్రజాయత్తం చేయాలనే దృష్టితో పంచాయతీ సమితులు జిల్లా పరిషత్తులు ఏర్పాటు చేసుకొన్నాము. రెండు సంవత్సరములయినది వాటి నిర్వహణ జయప్రదంగా జరుగుతోందని ప్రజాభిప్రాయం అనుకూలంగా ఉందని తెలుసు. మన రాష్ట్రంలో యీ ప్రయోగం ఏ విధంగా జరుగుతున్నదో తెలుసుకొనుటకు దేశం అంతా మనవంక

చూస్తున్నారు. ఈ సందర్భంలో కొన్ని విమర్శలుకూడా వస్తున్నవి. ఈ సమితులు పరిషత్తులలో కొన్ని చోట్ల అధికారం దుర్వినియోగం అవుతున్నదని స్టాట్యుటరీ పవర్సు మాండేటరీ పవర్సు అమలు జరుగుట లేదని విమర్శలు వస్తున్నాయి. ఈ అధికార వికేంద్రీకరణను ప్రయోగాత్మకంగా తలపెట్టాము. దీని పరిశీలనకు ఒక కమిటినో కలెక్టరునో జిల్లాప్లానింగ్ ఆఫీసరునో వేసి అన్ని సమితులు పర్యటన చేసి స్టాట్యుటరీ పవర్సు, మాండేటరీ పవర్సు ఏ విధంగా అమలు జరుగుతున్నవో పరిశీలన చేసి లోపాలున్నచో సవరించుకొని సవ్యంగా నిర్వహించుకొనుటకు తగిన కార్యక్రమాలు రూపొందించాలని కోరుతున్నాను. వీటికి స్వతంత్ర ప్రతిపత్తిలేదు. శాసనం ప్రకారం పంచాయితీ సమితులు నడుచుకొనక పోతే అజ్మాయిషి చేయుటకు ప్రభుత్వం ఉన్నది. అధికార దుర్వినియోగం ఎక్కడైనా జరిగితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొంటుందిఅనే అభిప్రాయం వస్తే ఎక్కడాకూడ అధికారం దుర్వినియోగం జరగకుండ ఉండటానికి వీలుంటుంది.

హెల్తుకు సంబంధించి ప్రభుత్వం ప్రముఖపాత్ర నిర్వహిస్తోంది. యాంటీ మలేరియా, యాంటీ ఫైలేరియా యాంటీ టి. బి. ఉద్యమములు చాల జయప్రదంగా నిర్వహించటం జరుగుతోంది. కాని తాలూకా హెడ్‌క్వార్టర్సు హాస్పిటల్సు ఏ విధంగా నిర్వహింపబడుతున్నవీ పరిశీలిస్తే అవి చాల అధ్వాన్న పరిస్థితులలో ఉన్నవి. ఉదాహరణకు నా కాన్‌స్టిట్యుయన్సీకి సంబంధించి. కొత్తపేటలో జిల్లాబోర్డు ఆధ్వర్యాన ఒక రెగ్యులర్ డిస్పెన్సరీ ఉన్నది. 1956లో కళా వెంకటరావు గారు హెల్త్ మినిస్టరుగా ఉన్నప్పుడు తాలూకా హెడ్‌క్వార్టర్సు హాస్పిటల్‌గా మార్చారు. ఇదివరకు అక్కడ ఒక మేల్ డాక్టరు. ఒక లేడీ డాక్టరు ఉండేవారు. ప్రభుత్వం తీసుకొన్న తరువాత అక్కడఒక్క డాక్టరుకూడా లేకుండ ఉండటం యింతవరకు బెడ్స్‌ప్రొవిజన్ కల్పించకుండ ఉండటం చాల అధ్వాన్న పరిస్థితిలో ఉన్నది. తాలూకా హెడ్‌క్వార్టర్సు హాస్పిటల్సులో బెడ్స్ ప్రొవిజన్ కల్పించ వలసినదిగా కోరుతున్నాను.

ప్రతి సంవత్సరం గోదావరి వరదలు తీవ్ర సమస్యగా ఉన్నది. నా నియోజకవర్గం గోదావరి నది మధ్య ఉన్న లంక ప్రాంతం. గోదావరి ఒక ప్రక్క గౌతమి వశిష్ఠ మరియొకప్రక్క అవతల సముద్రం ఉండి ప్రతి సంవత్సరం వరదలకు ప్రజలుభయాందోళనలు పడుతూ ఉండే ప్రాంతం. ప్రభుత్వంవారు గత సంవత్సరం వరద గట్ల నిర్మాణం బలపరిచే కార్యక్రమం చేపట్టి పని చాలచురుకుగా నిర్వహించటం జరిగినందుకు ప్రత్యేకంగా అభినందించవలసియున్నది. ఆ నదీ గర్భములోని లంకలలో నివసిస్తూ వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నారు. కాని ప్రతి సంవత్సరం వరద ప్రవాహానికి లంకలు మునిగిపోవటం, ఇండ్లు నదీగర్భములో కలిసిపోవటం జరుగుతోంది కొన్ని దశాబ్దాలనుంచి అక్కడి ప్రజల ఇక్కట్లు, అవస్థలు ప్రభుత్వానికి నివే

దించుకొనటం జరుగుతోంది. కాని ఆ నివేదనలను ప్రభుత్వం పెడచెవిని పెట్టటకు కారణం తెలియదు. మన రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నాము. కాని ఆ ప్రజల అవసరాలను తీర్చుటకు ఎందుకు పూనుకోలేక పోతున్నామో తెలియదు; వరదలలో వారికి దున్నుకునేందుకు భూమికూడ ఉండదు తరువాత యిసకమేట వేసుకుపోయి ఆముదం మొక్కకూడ మొలవని పరిస్థితి ఉంటే, వారిమీద పన్ను వేస్తున్నారు. దున్నుకొనుటకు లేక, ఏమీ ఆదాయం లేనప్పుడు పన్ను వసూలు చేయటం న్యాయంకాదు. కొన్ని దశాబ్దాలుగా మా ప్రతినిధులు మొరపెట్టుకొని పోరాటం జరిపినప్పటికీ యింతవరకు పరిష్కారం కాలేదు. కళా వెంకటరావుగారు రెవిన్యూమంత్రిగా ఉన్నప్పుడు, అక్కడ స్థానికపరిస్థితుల విషయం తెలిసినవారుగనుక, పన్నులు రైటాఫ్ చేయాలని నిర్ణయం చేసుకొన్నారుగాని కేబినెట్‌లో సగంపన్నూ వసూలుచేయాలని నిర్ణయం జరిగింది. సగం వసూలు చేయటంకూడ న్యాయంకాదు. దున్నుకొనేందుకు భూమిలేక, ఆదాయంలేక, జీవనోపాధిలేక, ఇండ్లులేక అవస్థ పడుతున్నవారికి సబ్సిడీలు యిచ్చి, బంజరు భూములుంటే సొసయిటీలక్రింద యిచ్చి, సురక్షిత ప్రాంతాలలో నివాస సౌకర్యములు కల్పించవలసియున్నది. గోదావరి లంకలలో ప్రతి గ్రామంలో వ్యవసాయకూలీలు ఫీల్డులేబర్ కోఆపరేటివ్ సొసయిటీస్ రిజిష్టరు చేసుకొన్నారు. వాటికి ప్రభుత్వభూములు లీజుకు యిచ్చారు. రైతాంగం, వ్యవసాయకూలీలు వ్యవసాయం చేసుకొంటున్నారు. ప్రతి సంవత్సరం శిస్తు చెల్లిస్తున్నారు. బకాయీలు లేని సొసయిటీలు ఉన్నవి. వారు తిరిగి సకాలంలో భూములకొరకు దరఖాస్తులు పెట్టుకొనవలెనని గజెటులో ప్రకటించారు. అక్కడివారికి ఓనమాలు కూడ రావు. అటువంటివారినుంచి సకాలంలో దరఖాస్తులు రాలేదని భూములు యివ్వకుండ నిరాకరించటం చాల విచారకరమైన విషయం బాకీలులేని సొసయిటీలుంటే తిరిగి వారికే ఆ భూములను లీజుకు యివ్వవలెనని మనవి చేస్తున్నాను.

ఇళ్ళ స్థలాలుకూడ— ప్రధాన సమస్యగా ఉన్నది, మనకు స్వతంత్రంవచ్చి 12 సంవత్సరాలైనది. అయినప్పటికి యింతవరకు యీ సమస్య పరిష్కరించబడలేదు. హరిజనులకుకూడ ఇండ్లస్థలాలు యివ్వలేనిపరిస్థితిలో ఉన్నాము. హరిజనులేకాకుండ యితర వర్ణాలవారు పేదలు వ్యవసాయకూలీలుగా జీవిస్తున్నవారు ఉన్నారు. ఇండ్లులేక ఏ చెట్టుక్రిందనో నివసిస్తున్న పరిస్థితి ఉన్నది. కొందరు ఈనాందార్ల భూములలో గుడిసెలు వేసుకొనిఉంటే వారు ఆ భూస్వాములకు వెట్టిచాకిరీచేసి ఉండవలసివస్తోంది. ఇటువంటి నిరుపేదలకు ఇండ్లస్థలాలు యిప్పించుటకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొనవలెనని కోరుతూ, నాకు ఈ అవకాశము యిచ్చినందుకు అధ్యక్షులవారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

*శ్రీ జి. రామలింగం (జనగాం-రిజర్వుడ్) : అధ్యక్షా, గవర్నర్‌గారి ప్రసంగాన్ని నేను బలపరుస్తూ ప్రభుత్వానికి కొన్ని సూచనలు ఇస్తున్నాను. 1956కు ముందు హైదరాబాదు ప్రభుత్వములో ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంటు నల్లగొండ జనగాం మొదలైన 14 గ్రామాలకు ఎలక్ట్రిసిటీ సరఫరా చేయడానికి మంజూరు యిచ్చింది కాని 1956 తర్వాతనే ఆ స్కీము మంజూరయి ఆ ఎలక్ట్రిసిటీ యొక్క సరఫరా జరుగుతున్నది. ఇతర ప్రాంతాలలో యూనిట్‌కు 20 పైసలే వసూలు చేస్తూ, ఆ ప్రాంతములో మాత్రం 40 పైసలు వసూలు చేస్తున్నారు. ఆంధ్రలో తక్కువ తెలంగాణాలో ఎక్కువ వసూలు చేయటం ఉన్నది కాబట్టి గవర్నమెంట్ త్వరగా ఒక నిర్ణయానికి వచ్చి, యీ రెండు ప్రాంతాలలో వసూలు చేసే రేటును ఏకీకరణ చేసి, తెలంగాణాలో ఆంధ్ర ప్రాంతములోని రేటుతో సమానంగా తగ్గించాలని కోరుతున్నాను. హరిజన హాస్టల్స్ ఎక్కువ చేయాలని మేము ప్రభుత్వానికి ప్రతిసంవత్సరము చెబుతూనే వస్తున్నాము. ఎక్కువ హాస్టల్స్ పెడతామని. ఒక్కొక్క పిల్లవానికి 20 రూ. చొప్పున ఎక్కువ ఖర్చు చేస్తామని ముఖ్యమంత్రిగారు చెప్పారు. కాని పర్మినెంట్ బోర్డర్స్‌కే మంజూరు ఇస్తామని టెంపరరీ బోర్డర్సుకు మంజూరు యివ్వము అని ఈ సంవత్సరం చెబుతున్నారు. ఆ విధంగా యీసంవత్సరం ఒక సర్క్యులర్ జారీచేశారు. ఇట్లా ఎందుకు జరిగిందని డైరక్టర్‌గారిని అడిగితే, తెలంగాణాకు రెండు లక్షల రూపాయలు మాత్రమే కేటాయించబడిందని, ఆంధ్రకు 29 లక్షలు కేటాయించబడినవని, ఏమి చేస్తామని అంటున్నారు. హరిజనులలో చాలా పేదతనము ఉన్నది. వారు తమ పిల్లలను చదివించలేని స్థితిలో ఉన్నారు. హాస్టల్స్ లేకపోతే వారెంతో బాధపడతారనేది ప్రభుత్వం గుర్తించి, ఒక నిర్ణయం తీసుకొని తెలంగాణాలో ఎక్కువ ప్రతి తాలూకాకు నాలుగైదు హాస్టల్స్ పెట్టివారికి భోజన విద్యా సౌకర్యాలు కలుగజేయవలసిందిగా కోరుతున్నాను. నిర్బంధ ప్రాథమిక విద్యా విధానాన్ని అమలు జరిపి హరిజన పిల్లలను తీసుకువచ్చి విద్య నేర్పుతున్నప్పుడు, వారికి తగినన్ని హాస్టల్స్ లేకపోతే చాలా ఇబ్బంది పడతారు. ప్రభుత్వం ఈ విషయంలో సక్రమమైన పంథా అవలంభించవలసిందిగా మనవి చేస్తున్నాను. తెలంగాణాలో 14 వ సర్క్యులర్ ద్వారా హరిజనులకు భూములిస్తామని చెప్పారు. 1950వ సంవత్సరంలో పది పర్సెంట్ తక్కువగానున్న భూములను వారు కాస్తు చేసుకోవచ్చునని అన్నారు, 1960 వరకు కాస్తు చేసుకుంటున్న వారికి అవి ఇచ్చేటట్లు చూస్తామన్నారు. కాని వారుకాస్తు చేస్తున్నటు పహాణి పత్రాలలో, ప్రభుత్వ రికార్డులలో వ్రాయబడలేదు. పటేల్ పట్వారీలు వ్రాయలేదు మీకు భూములున్నట్లయితే కాగితాల్లో చూపించండి, మీకు పట్టాలిస్తామని నాయబ్ తహశీల్‌దార్లు అంటున్నారు. కాని వారి దగ్గర ఒక్క కాగితముకూడా లేదు. ఇదివరకు లావనీ కమిటీలు ప్రభుత్వము వేసినట్లుగానే, ఇప్పుడుకూడా ప్రభుత్వం కమిటీలు వేసి నిజంగా ఆ భూములు హరిజనులు దున్నుకొంటున్నారా లేదా అని చూసి, వారికి పట్టాలు ఇవ్వవలసిందిగా కోరుతున్నాను. వారికి ఇచ్చిన భూమికూడా దున్నుకోటానికి ఆర్థిక స్తోమత లేక చాలా

కష్టాలు పడుతున్నారు. కాబట్టి ప్రభుత్వము వారికి ప్రత్యేకంగా లోన్స్ సబ్సిడీలు ఇస్తేవారు తమయొక్క భూమి సేద్యము చేసుకోగలుగుతారు. ప్రభుత్వము ఈ విషయములో తగు శ్రద్ధ తీసుకోవాలని మనవి చేస్తున్నాను. నిన్న ప్రగడకోటయ్యగారు వీవర్స్ కో ఆపరేటివు సొసైటీలకు సంబంధించి మాట్లాడారు. నేను 1952 నుండి యీ బోర్డులో మెంబరుగా ఉంటూవచ్చాను. 49–50 లో కంట్రోల్సు ఉన్నప్పుడు, ఎక్కువగా ఈ నూలుధర పెరిగిపోయి వీవర్స్ చాలా అవస్తలు పడుతున్న సందర్భంలో శ్రీ కొండాలక్ష్మణ్ గారు గవర్నమెంటుతో కొట్లాడి ఈ ఎపెక్ సొసైటీని తయారు చేశారు. నూలు మీద కంట్రోలు ఉన్నందువల్ల, బట్టరేటు తగ్గిపోయినందువల్ల ఆరేడు లక్షల రూపాయలు అక్కడ నష్టం వచ్చింది. అదేవిధంగా ఆంధ్రలోకూడా 40, 50 లక్షల రూపాయలు నష్టం వచ్చినట్లువింటున్నాము, అక్కడ నిజంగా అంతనష్టం జరిగిందా? లేక తిన్నారా? మొదలయిన ఇన్ఫర్మేషన్ సేకరించి అక్కడి ఆడిట్ రిపోర్టులు తెప్పించి, అక్కడ నిజంగా తిన్నరా లేదా అన్నది చూడవలసిన బాధ్యత మంత్రిగారిపైన ఉన్నది. తిరుపతిలో యీ హాండ్ లూమ్‌బోర్డుయొక్క మీటింగు జరిగింది. అందులో ఆంధ్ర తెలంగాణా అపెక్స్‌సొసైటీలు రెండు కలిసిపోవాలని ఒక నిర్ణయము తీసుకొన్నాము. తమది ఏదోపోతుందని నలుగురైదుగురు ఆంధ్రసోదరులు అలా చేయటానికి వీలులేదని అంటున్నారు. విశాలాంధ్ర తప్పకుండా కావాలని అన్న పెద్దమనుష్యులే ఆంధ్ర అపెక్స సొసైటీ హైదరాబాద్ అపెక్స్‌సొసైటీలో కలవకూడదని, తమకేవో అసెట్స్ ఎక్కువ ఉన్నవని చెప్పి ఏదోవిధంగా మభ్యపెడుతూ, అవి రెండూ ఒకటి కాకూడదనిచెప్పి చేస్తున్నారు. అది మంచిదికాదు. ఆంధ్ర తెలంగాణాలు కలిసి ఎప్పుడైతే విశాలాంధ్ర అయినదో, అప్పుడు ఆ సొసైటీలు రెండూకూడ కలిసి ఒకటి అవటం ఏమంత కష్టం కాదు. కాబట్టి ప్రభుత్వం యీ విషయంలో ఒక నిర్ణయం తీసుకోవాలని మనవిచేస్తున్నాను. ఈనాడు హరిజనవీవర్స్ చాలా అవస్థలు పడుతున్నారు. హరిజనవీవర్స్ నాలుగువేలమంది నల్లగొండ జిల్లాలలో ఉన్నారు. వారిని కొన్ని సంఘాలుగా పెట్టి వారికి మంచి బట్టనేసే అవకాశం కలుగజేయాలని కోరుతున్నాను. ఈ విషయంలో ప్రభుత్వం తగు శ్రద్ధతీసుకోలేదు. అర్ట్‌సిల్క్, కలర్స్ పంపిణీ విషయంలో ఏమి జరిగిందో తెలియదు, అవి డైరక్టర్ ఎవరికి ఇస్తున్నారో—ఆంధ్రవాళ్లకు ఇస్తున్నారో, తెలంగాణావారికి ఇస్తున్నారో—నాకు తెలియటంలేదు. దానికి సంబంధించిన మంత్రిగారు యీ విషయంలో శ్రద్ధతీసుకొని అవి నిజంగా యీ వీవర్స్‌కు అందుతున్నవా లేదా అనేది పరిశీలించి చూడవలసిఉన్నది. ఈ విషయంలో ప్రభుత్వం తగు శ్రద్ధతీసుకోవాలని కోరుతూ ఇంతటితో సెలవు తీసుకొంటున్నాను.

*శ్రీ కె. రామచంద్రారెడ్డి (రామన్నపేట):- అధ్యక్షా, గవర్నర్ గారి ప్రసంగముపై మూడు రోజులనుండి చర్చ జరుగుతున్నది. గవర్నర్ గారు తమ ప్రసంగములో శాంతిభద్రతలనుగురించి చెబుతూ. శాంతిభద్రతలు సంతృప్తికరంగా ఉన్నవని, అందుకు

చాలా సంతోషదాయకమని సెలవిచ్చారు. కాని మాజిల్లాలోని పరిస్థితులు వారు చెప్పిన దానికి భిన్నంగా ఉన్నవి. సింగారం గ్రామంలో ప్రెసిడెంట్ డబ్బు కాజేసినట్లు వైస్ ప్రెసిడెంట్ రుజువుచేస్తే — ఇన్స్పెక్టర్ ముందరనే వారిద్దరిమధ్యా తగాదా జరిగింది. అది జరిగిన వారం రోజులకే ప్రెసిడెంట్ కొంతమంది రౌడీలను బాగా తాపి, జూన్ 18 వ తేదీనాడు పట్టపగలు ఒంటిగంట కొట్టేసమయాన ఇంటిమీద తోలించి విపరీతంగా కొట్టించాడు. రక్తపాతం చేయించాడు.

ఉస్మానియా ఆస్పత్రికి పోలీసులు తీసుకువచ్చి శరీక్ చేస్తే జూన్ 25 వ తేదీన చని పోయాడు. నామకార్థానికి పదముగ్గురిని arrest చేసి వెంటనే bail పైన release చేయడం జరిగింది ఆ గ్రామంలో కొట్టారని సాక్ష్యం యిచ్చిన వారందరిని మాకు వ్యతి రేకంగా ఇస్తారా అని బెదిరిస్తున్నారు. ఆ అధ్యక్షుని దగ్గర రెండు తుపాకులు ఉన్నాయి. ప్రభుత్వానికి, అధికారులకు తెలిసినప్పటికీ యింతవరకు ఆ తుపాకులను జప్తు చేయలేదు. ఈ ప్రకారంగా సింగారం అనే గ్రామంలోని ప్రజలను భయపెట్టడం జరుగుతోంది. అదే తాలూకాలో కోటమర్తి అనే గ్రామం ఉన్నది. కోటమర్తి జమీం దారిణి కౌసల్యాదేవి హరిజనులు, చాకలి, మంగలి మొదలైన క్రింది జాతి వారందరినీ 53 ఎకరాల తరి, 19 ఎకరాల కుష్కీమీద ఉన్న రక్షిత కౌలుదారులను 60, 70 ఏండ్ల నుంచి ఉంటూ ఉండే, High Court యొక్క తీర్పు ననుసరించి శాసనం రద్దు అయిపోయిందనే సాకుతోచే దఖలు చేయడానికి ప్రయత్నం చేసినది. పోలీసులు కూడ జమిందారిణి పక్షం వహించి వాళ్ళు ఖబ్జాకురాకుండా తగాదా భూమి అని 145 వ సెక్షన్ క్రింద report చేయించి జైలు చేయించారు. ఫాణీ పత్రికలలో కాసారా ఘారాలలో ప్రతి సంవత్సరం చేస్తున్నట్లు రసీదులు వగైరా ఉన్నప్పటికీ విచక్షణ చేయ కుండా పోలీసులు 145 వ సెక్షన్ క్రింద ఆ భూమిని తీసుకుని రక్షిత కౌలుదారులను బేదఖలు చేసేటందుకు జమిందారులకు మద్దతు యివ్వడం జరిగింది. Chief Minis-ter గారికూడ రైతులు application పెట్టుకోవడం జరిగింది. ఇంతవరకు ఏమి చర్య తీసుకోలేదు అక్కడ local గా ఉండే పోలీసులు ఖామాన్‌కు వ్యతిరేకంగా జమీందారు పక్షం వహించి ఆ విధంగా సహాయం చేయడం జరుగుతోంది. రెండు నెలల క్రితం హుజూర్‌నగర్ తాలూకాలో బూర్గుటి అనే గ్రామంలో కొట్లాట జరిగితే విచా రణ చేసి ప్రజలకు సహాయం చేయాలని అక్కడి జిల్లా కమిటీ సభ్యుడైన అరవణి లక్ష్మినారాయణ వెడితే కొంత మంది కాంగ్రెసు అని పేరు పెట్టుకొని ఆయనను విపరీతంగా కొట్టి కాళ్ళు చేతులు విరగ గొట్టారు. నామకార్థం కేసులు పెట్టారు. కాని arrest ఏమి చేయలేదు. నిన్నగాక మొన్ననే ఉస్మానియా ఆస్పత్రి నుంచి కొంత బాగు అయి వెళ్ళారు. ఇదే నెలలో సూర్యాపేట తాలూకాలో వెంపటి అనే గ్రామంలో పంచాయతీ ఎన్నికలు జరుపుతున్న సందర్భంలో ఉప్పల మల్సూరు M.L.A. గారు ఒక గ్రామం నుంచి యింకొక గ్రామానికి పోతుంటే దారి గాచి విపరీతంగా

దెబ్బలు కొట్టారు. దారి గాచి దెబ్బలు కొట్టే పద్ధతి అకస్మాత్తుగా వచ్చినది కాదు. Plan ప్రకారంగా చేయాలనే చేయడం జరుగుతోంది. Law and Order ఎక్కడ ఉన్నది? అధికారులకు చెప్పుకొన్నప్పటికీ న్యాయమో అన్యాయమో అని విచారణ చేయడానికి కూడ క్రింది పోలీసు అధికారులు పూనుకోవడంలేదు. రక్షిత కౌలుదారుల విషయంలో కూడ Law and Order ఎలా ఉన్నదో చూడండి. మిరియాల గూడెం తాలూకా వేంపాడు వెంగమ్మ గూడెం అనే గ్రామం ఉన్నది. గంగినేని నరసింగ రెడ్డి అనే రక్షిత కౌలుదారు 60, 70 ఏండ్ల నుంచిసాగుచేస్తున్నాడు. భూస్వాములు అంతా కలిసి అక్కడి బావిని పూడ్చారు. ఆయనకు 50 జీవాలు ఉంటే, ఆ గొర్రెల మందలను దొంగతనంగా లారీలలో వేసుకొచ్చి హైదరాబాద్‌లో అమ్ముకొన్నారు. ఆయనను బేదఖలు చేశారు. వీటన్నిట గురించి పోలీసు అధికారులకు దరఖాస్తులు పెట్టుకున్నప్పటికీ arrest లేదు. కేసులేదు ఈ విధంగా జరుగుతూ ఉంటే శాంతి ఎక్కడ ఉన్నదో, భద్రత ఎక్కడ ఉన్నదో చెప్పమని తమద్వారా ప్రభుత్వాన్ని అడుగుతున్నాను, మా నల్లగొండ జిల్లాలో యిలాంటివి అనేకం దినదినము పెరిగిపోతున్నాయి. Detention Act లోని 110 వ సెక్షన్, 151 వ సెక్షన్ 145 వ సెక్షన్ ప్రకారం యిలాంటి కేసులలో judicial powers Deputy Collector కు, Sub-Divisional Officer కు ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తరువాత ఈ ప్రభుత్వం ఒప్పజెప్పడం జరిగింది. దీనివల్ల ఎన్నో అనర్థకాలు జరుగుతున్నాయి. Executive Officer, Deputy Collector కావడంవల్ల ఒక్కొక్క case 50 మంది మీద, 40 మంది మీద పెట్టి సంవత్సరం రెండు సంవత్సరాలదాకా కోర్టు చుట్టూ త్రిప్పడం జరుగుతోంది. ఈ ప్రకారంగా చేయడంవల్ల మా నల్లగొండ జిల్లాలో దాదాపు ఆరు ఏడు వందల మీద యిలాంటి కేసులు నడుస్తున్నాయి. ఆ డిప్యూటీ కలెక్టరుగారికి ఎన్నో పనులు ఉంటాయి. రెవెన్యూ పనులు ఉంటాయి Municipal Elections, Panchayat Elections, development కార్యక్రమాలు యివన్నీ ఉండగా judicial powers కూడ వారికి ఒప్పజెప్పడం చాల అన్యాయం. దేవరకొండ తాలూకాలో కేసు నడుస్తున్నట్లయితే Deputy Collector మిరియాల గూడెంలో ఉంటారు అక్కడనుంచి జనం 60, 70 మైళ్ళు నడిచి రావలసి ఉంటుంది. అక్కడ మునిసిఫల్ కోర్టు ఉన్నప్పటికీ ఆ కోర్టును తీసివేసి ఫిరికి ఒప్పజెప్పడం వల్ల ప్రజలు ఈ విధంగా యిక్కట్లపాలు కావలసి వస్తున్నది అందువల్ల యిలాంటి కేసులలో ఈ powers అన్ని తిరిగి మునిసిపల్ కోర్టుకు ఒప్పజెప్పడం చాల సమంజసంగా, న్యాయంగా ఉంటుంది. వారికి కేసులు కూడ చాల తక్కువ ఉన్నాయి. మునిసిపల్ మేజిస్ట్రేటుకు అప్పజెప్పినట్లయితే న్యాయం జరిగే అవకాశం బాగాఉన్నది. Judicial powers Deputy Collectorsకు ఒప్పజెప్పడం వల్ల చాల పక్షపాతంఅన్యాయం జరుగుతూ ఉన్నది. ఉదహరణకు కోటమర్తి కేసు విషయములో 145 వ సెక్షన్ క్రింద Deputy Collector Party వాళ్ళకు తెలపకుండా attachment చేశాడు

కనీసం ఒక్క వేలం కూడ చేయకుండా చేశేశాడు. ఇలాంటి అన్యాయాలు జరుగుతున్నాయని Chief Minister గారికి మేము మెమోరాండం కూడ యిచ్చాము. కాని ఏమి చర్య తీసుకోవడంలేదు. తెలంగాణాలో యిదివరకు యిలాంటి కేసులు అన్ని మునిసిఫ్ మేజిస్ట్రేటు అధికారంలో ఉంటూ ఉండేవి. అవి తీసి వీరికి అప్పజెప్పడం వల్ల ఈ అవస్థలన్నీ జరుగుతున్నాయి. అందువల్ల యివన్నీ తీసి తిరిగి మునిసిఫ్ మేజిస్ట్రేట్ కు అప్పజెప్పాలని మీ ద్వారా వారికి మనవి చేస్తున్నాను.

ఇళ్ళ సమస్య చాల తీవ్రంగా ఎదుర్కొంటున్నది. గ్రామాలలో ఎన్నడో 100 ఏండ్ల క్రింద settlement చేసి గ్రామ కంఠాలు విడిచి పెట్టడం జరిగింది. ఆనాటి నుంచి ఈ నాటి వరకు re-settlement జరగలేదు. జనాభా విపరీతంగా పెరిగి పోతున్నది. ఇళ్ళు ఎక్కువ కట్టుకుంటున్నారు. ఇళ్ళ స్థలం చాలడం లేదు, గ్రామాలలో ఇళ్ళ స్థలాలు విడిచి పెట్టడం చాల అవసరం. ప్రత్యేకంగా హరిజనుల ఇళ్ళ స్థలాల సమస్య చాల క్లిష్టంగా ఉన్నది. ఈ సమస్య గురించి గత 10 సంవత్సరాల నుంచి అసెంబ్లీలో చెప్పుకుంటున్నాము. ఏదో తాలూకాలో 1, 2 గ్రామాలలో ఇళ్ళు కట్టించడం లేకపోతే కొంత భూమి ఇవ్వడం జరుగుతున్నది. ఆ ఇచ్చిన భూములలో కూడ మాల్ గుజారీ ఫర్మాన్ ప్రకారం ఎన్నో చిక్కులు వస్తున్నాయని, వాటిని acquire చేయడంలో ఆలస్యం కావడం ఇవన్నీ జరుగుతున్నాయి. వీటి మూలంగా ప్రభుత్వం, వారికి ఇళ్ళ స్థలాలు యివ్వలేక పోయింది. ప్రత్యేక కలెక్టరు ఉన్నప్పటికి కలెక్టరు తన యొక్క powers ను వినియోగించలేక పోతున్నాడు, రోజు వారి సమస్యలలో, అధికార పక్షమైన కాంగ్రెసులో ఉన్న గ్రూపు అధికారులపైన ఒత్తిడి తీసుకు రావడం వల్ల ఆయన చేయలేక పోతున్నాడు. ఒక ఆయన వచ్చి ఒకటి చెప్పుతాడు యింకొక ఆయన వచ్చి యింకొకటి చెప్తాడు. రోజు వారి పరిపాలన కూడ సాగనివ్వకుండా యిలాంటి ఒత్తిడిలు జరుగుతున్న కారణంగానే మేము ఏమీ చేయలేక పోతున్నామని అధికారులు చెప్పడం జరుగుతోంది. అందువల్లనే యిళ్ళ సమస్య అలానే ఉండిపోయింది. వెంటనే విచారణ చేసి గ్రామాలలో యిళ్ళ స్థలాలు విడిచి పెట్టేటందుకు ప్రభుత్వం పూనుకోవాలి. ప్రత్యేకంగా హరిజనులకు యిళ్ళ స్థలాలు చూపెట్టేందుకొరకు పూనుకోవాలని మనవి చేస్తున్నాను.

తెలంగాణాలో దాదాపు కొన్ని లక్షల ఎకరాలు తరీభూమి పక్షాలవల్ల సేద్యం అవుతున్నది 1954 పూర్వం ఎకరానికి 18, 19 రూపాయలు తరిధార వసూలు చేస్తూ ఉండేవారు. ప్రజల యొక్క ఆందోళనను ప్రభుత్వం గుర్తించి 54 లో ప్రతి ఎకరానికి వాన కాలంలో అయినట్లయితే పాలిస్తు 5 రూపాయలు, వేసంగిలిస్తు 2 1/2 రూపాయలు వసూలు చేయాలని ఒక G. O. పంపించి ఆ ప్రకారంగా అమలు జరుపుతూ ఉన్నది. కాని ఇప్పుడు ఏక్ సాల్ క్రింద పెట్టి శాశ్వత రేటు నిర్ణయించ

కుండా temporary గా వసూలు చేస్తున్నాము అని చెపుతూ గిర్దావర్, పటేల్, పట్వారీలు మాకు కొంచెం డబ్బు యిస్తేనే పత్తి కాలవ క్రింద లెక్క వ్రాస్తాము లేకుంటే వ్రాయనని బెదరిస్తున్నారు. దానివలన పటేల్ పట్వారీలకు గిర్దావరులకు ఆదాయం దొరికేటందుకు ప్రభుత్వం అవకాశం యిచ్చినట్లు అవుతోంది. కనుక దానిని యిప్పటికైనా ప్రభుత్వం గుర్తించి వానకాలం శిస్తు 5 రూపాయలు వేసంగి శిస్తు 2 1/2 రూపాయలు ఈ ప్రకారం శాశ్వత రేటు నిర్ణయించి orders పంపించాలని నేను మీ ద్వారా వారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

ఈ నాడు విద్యుచ్ఛక్తి యొక్క అవశ్యకతను గూర్చి నేను మీకు ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. అందులో, ముఖ్యంగా, మా నల్లగొండ జిల్లా చాలా వెనుక బడి యున్నది అయితే, అక్కడ నాగార్జునసాగర్ వుందిగదా అని ఎవరయినా అనవచ్చు. మా జిల్లాలోని పదు తాలూకాలలో రెండు తాలూకాలకు మాత్రమే నాగార్జునసాగర్ వుపయోగపడుతున్నది. మిగతా అయిదు తాలూకాలకు గ్యారంటీ యిచ్చే నీటి వనరులేమీ లేవు. అందువలన అలాంటి మెట్ట ప్రాంతాలకు యిందులో ప్రత్యేక ప్రాధాన్యము యివ్వవలసిన అవసరమున్నదని నేను ప్రభుత్వమునకు మీ ద్వారా తెలియజేయుచున్నాను. ఈ విధముగా యీ ఒక్క ప్రాంతమునకే గాకుండా, ఆంధ్ర ప్రదేశ్ మొత్తములో నీటి వనరులు లేని ప్రాంతములకు యీ ప్రత్యేక ప్రాధాన్యతను యివ్వవలసిన అవసరం ఎంత అయినా వున్నదనే విషయమును గమనించవలసిందిగా ప్రభుత్వమును కోరుతున్నాను. ఆయా ప్రాంతాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేయడానికి ప్రభుత్వం వెంటనే పూనుకోవాలి. కాని, ఇలా పూనుకొనడంలేదు. తెలంగాణా ప్రాంతములో ప్రతి సంవత్సరం వంద గ్రామములు విద్యుచ్ఛక్తి విద్యుద్దీకరణకు తీసుకొంటున్నట్లు గవర్నరుగారు తమ గత ప్రసంగములో చెప్పారు. కాని, యీ సంవత్సరం తెలంగాణాలో 25 ఆంధ్రలో 150 మాత్రం తీసుకొంటున్నట్లు బడ్జెటులో పేర్కొన్నారు. అట్లాగాకుండా, వెనుకబడిన ప్రాంతమును అభివృద్ధి చేయవలసిన అవసరమెంతయినా వున్నది గనుక యిక్కడ ఎక్కువ ప్రాముఖ్యమునిచ్చి, అదీగాక, తెలంగాణాకు వున్న సెక్యూరిటీస్‌ను వినియోగించి అయినా మెట్ట ప్రాంతాలకు విద్యుచ్ఛక్తిని వెంటనే సరఫరా చేయుటకు ప్రభుత్వం పూనుకొని, అధికోత్పత్తికి సహాయపడ వలసిందిగా కోరుతూ యింతటితో విరమిస్తున్నాను.

*శ్రీ కె. జనార్దనరెడ్డి(నాగర్‌కర్నూల్-జనరల్) : అధ్యక్షా, గవర్నరుగారి ప్రసంగముపై ప్రవేశ పెట్టబడిన అభినందన తీర్మానమును నేను బలపరుస్తున్నాను. ఈ సందర్భములో కొన్ని విషయాలు మీ ద్వారా ప్రభుత్వానికి మనవి చేయదలచు కున్నాను.

గవర్నరుగారు ద్వితీయ పంచవర్ష ప్రణాళిక చాలా జయప్రదముగా ముగిసినది, అంచనా వేసుకున్న 120 కోట్లకంటే యింకా అదనంగా సుమారు పదికోట్ల రూపాయల వరకు ఖర్చు పెట్టాము, ప్రజలు చక్కగా సహకరించారు అని చెప్పారు. అది సంతోషకరమైన విషయమే. కాని ఈ సందర్భములో మనం ఒక విషయం మాత్రం మరువకూడదు. మనం ద్వితీయ ప్రణాళికలో ఏవైతే టార్గెట్స్ పెట్టుకున్నామో, వాటిని మాత్రం పూర్తి చేయలేక పోయినాం. గత సంవత్సరం మహబూబ్ నగర్ జిల్లాలో ఒక conference జరిగింది. ఆ conference లో అడిషనల్ డెవలప్ మెంట్ కమిషనర్ గారు మనం plan లో ఏవైతే టార్గెట్స్ పెట్టుకున్నామో, వాటిలో 65 % వరకే సాధించ గలిగామని, పూర్తిగా achieve చేయలేక పోయినామని, యిది చాలా విచారించవలసిన విషయమని చెప్పారు. గవర్నరుగారు ప్రణాళిక విజయవంతంగా ముగిసింది అంటున్నారు. డెవలప్ మెంటు కమిషనర్ గారు 65 % మాత్రమే టార్గెట్స్ సాధించగలిగినామంటున్నారు. ఇది ఆలోచించ వలసిన విషయం. డబ్బు మాత్రం ఎక్కువగా ఖర్చు పెట్టడం జరిగింది. పదికోట్ల రూపాయలు అదనంగా ఖర్చు పెట్టినామని గవర్నరుగారే చెప్పినారు. కాని, ఫలితాలుమాత్రం మనంసాధించవలసినంత రావడంలేదు. కనుక డబ్బు అంతా సక్రమంగా ప్రణాళికా కార్యక్రమాలపై ఖర్చు చేయబడింది, లేనిదీ లేక ఎక్కడయినా work జరిగిందేమో విచారించవలసిన అవసరం ఎంతయినా ఉన్నది. దీనికి సంబంధించి నేను గత బడ్జెటు సమావేశంలో ఒక సూచన కూడ చేసివున్నాను. ఒక నిపుణుల కమిటీని నియమించి, మనం నిజంగా ప్రణాళికలో వేసుకున్న టార్గెట్స్ ఎంతవరకు సాధించింది, Waste ఎక్కడ జరుగుతున్నది పరిశీలింప జేయవలసి ఉన్నది. కనీసం వాయిదా సూచన మూడవ ప్రణాళికకు సంబంధించి అయినా అమలు జరుపవలసిందిగా కోరుతున్నాను,

మూడవ ప్రణాళికలో ముఖ్యమైన అంశం విద్యుచ్ఛక్తి. దీనికొరకు 65 కోట్ల రూపాయిలు ఖర్చు పెడుతున్నట్లు వారు తమ ప్రసంగములో చెప్పారు. విద్యుచ్ఛక్తి చాలా అవసరమైనదనే విషయాన్ని నేను ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరంలేదు. అయితే ఈ నాడు విద్యుచ్ఛక్తికి ఇవ్వవలసినంత ప్రాముఖ్యం యివ్వటం లేదేమోనని సిస్తున్నది. ప్రాజెక్టులుగాని, నీటి వనరులుగాని లేక, విద్యుచ్ఛక్తి పైనే ఆధారపడి యున్న మెట్ట ప్రాంతాలనేకం మన రాష్ట్రంలో ఉన్నాయి. ఉదాహరణకు మహబూబ్ నగర్ జిల్లా తీసుకోండి. అక్కడ ఏ పెద్ద ప్రాజెక్టులేదు. ఆ ప్రాంతం పూర్తిగా విద్యుచ్ఛక్తిపై ఆధారపడి యున్నది. ఆ విధంగా చూసినప్పుడు యీ 65 కోట్ల రూపాయిలు ఏ మాత్రం యీ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి చాలవు. ఇంకా ఎక్కువ సొమ్ము యిందుకు కేటాయించవలసిన అవసరమున్నది. చాలా విచారకరమైన విషయమేమిటంటే దాదాపు పది సంవత్సరముల నుండి చేస్తున్నప్పటికి, యిప్పటికి మనం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్య క్రమమును పూర్తిచేయలేక పోయినాము.

మొత్తం ఆంధ్ర ప్రదేశ్‌లో 25 వేల గ్రామాలుంటే అందులో 3,281 గ్రామాలను మాత్రమే యిప్పటి వరకు మనం electrify చేయగలిగినాము. ఈ విధంగా చేస్తూ పోతే ఈ కార్యక్రమం ఎన్ని సంవత్సరాలకు పూర్తి అవుతుందో చెప్పలేము. కనుక ప్రభుత్వం ఈ నాడు విద్యుచ్ఛక్తి యొక్క అవసరాన్ని మరింత గుర్తించి ఒక మాస్టర్ ప్లాన్‌ను దీనికొరకు వేసి ప్రతి సంవత్సరం ఒక వెయ్యి గ్రామాలైనా electrify అయ్యేందుకు ప్రయత్నించాలని నేను కోరుతున్నాను.

ఇంకొక ప్రధానమైన విషయం గవర్నరుగారు తమ ప్రసంగములో చెప్పలేదు. ఈ నాడు మన దృష్టి అంతా పట్టణాల అభివృద్ధిపైనే వుంది. ఇది చాల విచారకరమైన విషయం. పల్లెటూళ్ళవంక ఒకసారి చూడండి. అక్కడ నిరుద్యోగం పెరిగి పోతున్నది. ప్రభుత్వం ఈ నాడు తీసుకుంటున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమం పట్టణాలను అభివృద్ధి పరుస్తున్నది తప్ప పల్లెటూర్లు గత యాభై ఏళ్ళ క్రిందట ఎలా వున్నాయో యిప్పుడు అలాగే వున్నాయి. దానికితోడు నిరుద్యోగ సమస్య మాత్రం విపరీతంగా పెరిగి పోతూ వున్నది, ఎంతవరకు మనం అక్కడ ఆ సమస్యను పరిష్కరించమో, అంతకాలమూ మనం సోషలిస్టు సమాజాన్ని సాధించలేమని మనవి చేస్తున్నాను. అందుకు పల్లెటూళ్ళలో కాటేజ్ యిండస్ట్రీస్‌ను ఎక్కువగా నెలకొల్పే ప్రయత్నించండి, ప్రతి పంచాయితీ కమిటీక్రింద కొన్ని పరిశ్రమలను వుంచండి, తద్వారా ఈ సమస్య కొంతవరకు పరిష్కారం కాగలదు. ప్రభుత్వం ఈ విషయాన్ని ఆలోచించి అందుకు ఒక మాస్టర్ ప్లాన్ తయారు చేయవలసిందిగా కోరుతున్నాను.

గవర్నరుగారు తమ ప్రసంగములో యిర్రిగేషన్ గూర్చి చెప్పినారు. అయితే మైనర్ యిర్రిగేషన్ గూర్చి వారేమీ ప్రత్యేకంగా చెప్పలేదు. మైనర్ యిర్రిగేషన్ మన దేశానికి చాలా అవసరమైనది. పెద్ద పెద్ద ప్రాజెక్టులు కూడా దేశానికి అవసరమే, వాటివలన పంట పండడమే గాక, విద్యుచ్ఛక్తి కూడ మనకు వస్తుంది, అయితే పంట అధికంగా పండాలంటే మైనర్ యిర్రిగేషన్ అభివృద్ధి కావాలి. దీనికి సంబంధించి వేరొక సూచన చేయదలచుకున్నాను. ఇప్పటి నుండి బడ్జెటులో మైనర్ యిర్రిగేషన్ ఒక ప్రత్యేక ఐటమ్ తీసుకుని దానికి కేటాయిస్తే బాగుంటుంది. దానిక్రిందకు అయా గ్రామాలలో తెగిపోయిన చెరువులు, గుంటలు మొదలైనవన్నీ వస్తాయి. ఆ విధంగా చేస్తే ఈ నాడు మనం పండిస్తున్న పంటకంటె 50 % పంట అదనంగా పండించడానికి అవకాశముంది. తద్వారా దేశంలో ఆహార కొరత తీరుతుంది. అప్పుడు నిరుద్యోగ సమస్యకూడ చాలవరకు అది తీరడానికి అవకాశముందని మనవి చేస్తున్నాను.

మరొక ముఖ్య విషయం తెలంగాణాకు సంబంధించిన సెక్యూరిటీస్ 11 కోట్ల రూపాయల వరకు ఉన్నాయి, అవిగాక 12, 13 కోట్ల రూపాయిలు తెలంగాణాకు

సంబంధించినవి ఆంధ్రపై ఖర్చు పెట్టడం జరిగింది. ఈ సందర్భంలో ప్రభుత్వం ఒక విషయం గుర్తించాలి. శరీరంలో ఒక అంగం బలహీనంగా వుంటే మొత్తం శరీరం అనారోగ్యము పాలైనట్లే ఒకే రాష్ట్రములో ఒక ప్రాంతము బలహీనముగా వుండడం మొత్తం రాష్ట్రానికే నష్టం కలిగిస్తుందని మనవి చేస్తున్నాను. దీనిని సరిచేయవలసిన బాధ్యత ప్రభుత్వంపైన వున్నదని మనవి జేస్తున్నాను.

సుమారు 23 కోట్ల రూపాయల తెలంగాణా డబ్బును ఆంధ్రపైన ఖర్చు చేశారు. పోచంపాడు శ్రీశైలం ప్రాజెక్టులపైన ఖర్చు చేయాలి, ఇంకా డబ్బు మిగిలితే rural electrification కొరకు ఖర్చు చేయాలి. ఈ మూడింటికి సమానంగా ఖర్చు చేయాలని నేను సవినయంగా మనవి చేస్తున్నాను. ప్రభుత్వం ఉదారంగా ఆలోచిస్తుందని ఆశిస్తూ యీ అవకాశం యిచ్చినందుకు మీకు కృతజ్ఞత తెలుపుతూ విరమిస్తున్నాను.

*శ్రీ బి. ధర్మభిక్షం: (నక్కిరేకల్):- అధ్యక్షా, గవర్నర్ గారు అడ్రసులో ఎన్నో విషయాలు చెప్పినప్పటికిన్నీ, కో-ఆపరేటివ్ సొసైటీలు మున్నగు వివిధరంగాలలో ప్రభుత్వ పాలసీని చక్కగా వివరించడం జరగలేదు. ఈవేళ ఇక్కడ ప్రశ్నోత్తరాల సమయంలో తెలంగాణాలో ఏర్పడివున్న Tappers, Co-operative Societiesకు అప్పులు ఇతర aids ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధంగా వున్నదా అని అడిగితే సంఘాల నుంచి అటువంటి proposals రాలేదు. మేముగూడ పెట్టలేదని మంత్రిగారు చెప్పారు. కో-ఆపరేటివ్ సొసైటీలను స్థాపించడంలో ధనవంతులనుంచి వడ్డీ వ్యాపారుల నుండి పెట్టుబడిదారులనుండి పేద ప్రజలు రక్షింపబడి ఆర్థిక స్తోమతనభివృద్ధి చేసుకోడానికి అవకాశం వుండాలనేది ప్రధాన general policy. Co-operative Society అని పేరుపెట్టి అందరినీ అందులో చేర్చి పెద్దవారే dominate చేసే విధంగా ఉంటే యిక దాని అర్థంఏమిటి? పాత కంట్రాక్టులతో చేరి పాతపద్ధతిలోనే వ్యవహారాలు, జరిపించడానికి ప్రభుత్వం అవకాశం తీసుకొంటోందని చెప్పవలసి వస్తున్నది. ఈ విషయం అసెంబ్లీలో చాలాసార్లు వచ్చినప్పటికీ వారు దీనిని లక్ష్యపెట్టడం లేదు. అన్నిరకాలజనం Tappers, Co-operative Societiesలో బ్రతకాలనేది ప్రభుత్వ సంకల్పంగా వున్నట్లు కనిపిస్తోంది. కష్టపడేవారికి యిందులో స్థానంలేకపోగా వారిని exploit చేసేవారికి ఇందులో ప్రవేశంఉన్నట్లు కనుపిస్తోంది. ఇతర పరిశ్రమలకు సంబంధించికూడా కో-ఆపరేటివ్ సొసైటీలకు పెట్టాలని ప్రభుత్వం ఒక general policyగా పెట్టుకుంది. ఎవరు సొసైటీ పెట్టుకున్నా వెంటనే శాంక్షను చేసే విధానం ప్రభుత్వం అవలంబిస్తోంది. మన ప్రభుత్వం 1957లో experimentalగా 7 సొసైటీలకు శాంక్షను యిచ్చింది, 1958-59లో 9 సొసైటీలకు శాంక్షనుఇచ్చింది. 1959-60లో 157 సొసైటీలకు, 1960-61లో 700 సొసైటీలకు శాంక్షన్ ఇచ్చింది. అందులో నూటికి85 సొసైటీల విషయంలో జనం కూడడంలేదని re-auction చేయడం జరిగింది.

Reauction చేయబడిన సొసైటీలలో వారికి అవి ఉండడం ఇష్టంలేదని తెల్లకాగితం మీద వ్రాయించి వాటిని రద్దుచేయించి కొత్త సొసైటీలు పెట్టడానికి మరికొంతమందికి అవకాశం ఇవ్వడమనేది కూడ వున్నది. నూటికి 85 సొసైటీలు ఆ పద్ధతిలోనే జరిగాయి. కొంతమంది జనానికి ఇష్టంలేకుండానే తీసుకుపోయి ఇప్పించడం జరిగింది. ఈ సొసైటీలను శాంక్షను చేసే అధికారం Cabinet తన చేతులలో పెట్టుకుంది. పెద్ద కంట్రాక్టరులు నేరుగా మంత్రులతో సెక్రటేరియట్‌లో సంబంధాలు పెట్టుకొని వారు చేసే ప్రయత్నాలవల్లనే సొసైటీలు దొరుకుతున్నాయి. కాని జనం ఎక్కడ కో-ఆపరేటివ్ సొసైటీ పెట్టుకుందామంటే అక్కడ ఏర్పాటయేటట్లు లేదు. తెలంగాణాలో ప్రతి విలేజిలో కూడ సొసైటీ ఏర్పాటుచేసే అవకాశాలను వెంటనే కల్గించాలి; అట్లా చేయకపోతే చాల అనర్థకాలకు దారితీస్తుంది. 14 గ్రూపు సొసైటీలకు లీజు ఇవ్వకుండా రద్దుచేయడం జరిగిందని నిన్ననే ఒక మంత్రిగారు పత్రికలవారితో చెప్పడం జరిగింది. 500 విలేజి కో-ఆపరేటివ్ సొసైటీలకు శాంక్షను ఇవ్వడానికి నిర్ణయించారని కూడా ఆ పత్రిక ప్రకటనలో చెప్పారు. ఇది మనం ఆహ్వానించదగిన విషయమే. గ్రూపు సొసైటీలు ఎప్పటికైనా దేశానికి నష్టం, పెద్ద capitalists కంట్రాక్టరులు వాటిలో చేరి exploit చేస్తున్నారని ప్రభుత్వం గుర్తించింది. కంట్రాక్టరులకు సంబంధించినవారు కూడ ఒక press conferen;e పిలిచి ఇంత profits పంచాము. Labour conditions బాగుచేశాము అని ప్రకటించారు. గత బడ్జెట్ సమావేశంలో కూడ కొండా లక్ష్మణ్ గారు ఇదే విషయం తెలిపారు.

(*Mr. Speaker in the Chair*)

1959 వరకూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రూపు సొసైటీలున్నాయి. Shareholders ఎంతమంది, ఎంత డబ్బు పంచారు అని అడిగితే audit అవుతున్నది, అయిన తరువాత గాని లెక్క తేలదు అన్నారు. ఇప్పుడు మాత్రం డబ్బు పంచేటట్లు కనబడుట లేదన్నారు. ప్రతి సంవత్సరం audit చేయించి profits పంచాలా లేదా అనేది ఆలోచించవలసి వుంటుంది. ఇక్కడ అదేమీ లేదు. కొంతమంది యిందులో నామకః చేర్చబడ్డారు. ఆ profits లో shares యిప్పటికైనా tappers కు యిప్పించే ప్రయత్నం చేయాలని కోరుతున్నాను. ఇప్పుడు కొన్నివందల గ్రామాలలో గ్రూపులు వున్నాయి. అచ్చట వెంటనే సొసైటీలు ఏర్పరచి excise lease ఇవ్వాలని కోరుతున్నాను. Tappers, Co-operatives కు ప్రభుత్వం centralise చేసి, ఆర్గనైజుచేసి ఒక ఫెడరేషనును ఏర్పాటు చేసింది. అది మంత్రిగారు, రిజిష్ట్రారుగారు కలిసి ప్రకటించిన ఒక లిస్టు తప్ప Tappers, Co-operative Societies కు ఏమీ సంబంధంలేదు. వారే డైరెక్టరులను, ప్రెసిడెంటును, వైస్-ప్రెసిడెంటును, రిజిష్ట్రారును 3 సంవత్సరముల వరకు nominate చేయవచ్చునని ఒక

provision పెట్టారు. పెద్ద గ్రూపుకు సంబంధించిన నలుగురు individual groups కు సంబంధించినవారు 7 మంది. Excise Commissioner, వారు nominate చేసిన ప్రతినిధి, ఇండస్ట్రీస్ డైరెక్టరు, ఇంకా కొంతమంది non-members తో. మొత్తం 17 మందితో ఒక federation ఏర్పాటు చేశారు. ఇదంతా ఒక తతంగం వలె వున్నది. ప్రతి సొసైటీనుంచి 100 రూపాయలు తెప్పించు కుంటున్నారు. ఎట్లా ఖర్చుచేస్తున్నారో చూడడానికి సొసైటీకి రిప్రెజెంటేషను లేదు. ఈ federation ను democratise చేయవలసిన అవసరం వున్నది.

Prohibition కు సంబంధించినది. 10,000 మంది జనం prohibition ను నిరశిస్తూ హైదరాబాదు వీధులవెంట ప్రదర్శనలు చేశారు. ప్రభుత్వ దృష్టికి, ప్రజల దృష్టికి తెచ్చారు. ప్రభుత్వపార్టీ తమ చర్చలలో, తెలంగాణా శాసనసభ్యుల చర్చల తోను యిక్కడ prohibition ప్రవేశ పెట్టడానికి పరిశీలిస్తున్నట్లు, కొంతమంది మంత్రులు అనుకూలంగా వున్నట్లు మరికొంతమంది వ్యతిరేకంగా వున్నట్లు పత్రికలలో వస్తోంది. Cabinet లో పరోక్షంగా ఒప్పుకొంటున్నట్లు పత్రికలలో వస్తున్నది. మన దేశంలో నైతికసేవ చేద్దామనే ఆశ వున్నప్పటికినీ మనం ఆర్థికంగా చాల దెబ్బ తింటున్నాము.

ఆంధ్ర బడ్జటు Deficit Budget గా తయారయింది. సంవత్సరానికి 18,19 కోట్ల రూపాయల ఆదాయం రావలసినదిపోయి. staff మీద ఒక కోటి రూపాయల వరకు ఖర్చు చేస్తున్నారు. తెలంగాణాలో సర్‌ప్లస్ బడ్జటు వున్నది. ఈ డబ్బు ఎటూ తేల్చకుండా మంత్రులు తమ యిష్టం వచ్చినట్లు తమ తమ నియోజకవర్గాలలో, జిల్లా లలో ఖర్చుచేసే విధానం అవలంభించారు. 21 కోట్ల రూపాయలు లేకుండా చేశారు. ఇది స్పష్టంగా బయటకు వస్తోంది. Fees ఎక్కువ చేశారని యూనివర్సిటీ విద్యార్థుల నుంచి ఆందోళన వచ్చింది.

ప్రొహిబిషన్‌ను తెలంగాణా ప్రాంతానికి కూడా extend చేయాలనే పద్ధతిని వదలివేసి, ఆంధ్రలో కూడా దానిని రద్దు చేయాలని అప్పటివరకు గీతపనివారలకు పనులు కల్పించాలని కోరుతూ విరమిస్తున్నాను.

*శ్రీ ఇ. నాగయ్య (వరవర) : అధ్యక్షా, గవర్నరుగారు తమ ప్రసంగంలో పంచాయతీ రాజ్యం అమలు చేసుకుంటున్నామని అన్నారు. పంచాయతీ రాజ్యం అనడంలో పంచాయతీలను పటిష్టం చేస్తామనే అర్థమే బాగుగా చలిస్తోంది. పేదరైతులకు రు 750 లు subsidy ఇస్తున్నారు, కాని అందులో రైతుకు ముట్టేది రు. 500

మాత్రమే. మిగిలినది దుర్వినియోగం చేస్తూ రైతులకు అందకుండా చేస్తున్నారు. కొందరు రైతులు లోన్స్ తెచ్చుకుంటున్నారు. రు. 500 లు లోన్‌కు పెట్టుకుంటే రు. 100 లు పైన ఖర్చు చేస్తేనే కాని చేతికి ముట్టడంలేదు. ఇది ఏమి అన్యాయం అంటే లోన్ ఇంకా శాంక్షన్ కాలేదు, ఇంకా కొంతకాలం పడుతుంది. అయినా అవసరం అయితేనే లోన్స్ ఇస్తామని రు. 400 లు చేతిలో పెట్టి పొమ్మంటున్నారు. అమోనియం సల్ఫేటును సూపర్ ఫాస్ఫేటును రైతులకు సప్లయి చేయకుండా వచ్చే అమోనియం సల్ఫేటును బ్లాక్ మార్కెట్‌లో రు. 82 లు చొప్పున అమ్ముతున్నారు. రైతులు అడిగితే ఈ నెలలో వస్తుంది, వచ్చే నెలలో వస్తుంది అని పంటల కాలం పూర్తి అయ్యేవరకు కాలక్షేపం చేస్తున్నారు. ఎరువులు, విత్తనాలు సరఫరా చేయడంలో చాలా అన్యాయం జరుగుతోందని తమ దృష్టికి తెస్తున్నాను. సహకార సేద్యం గురించి గవర్నరుగారు చెప్పారు.

ఆ పేరుతో ఎంత డబ్బు దుర్వినియోగం చేస్తున్నారో తమరు ఆలోచించాలి. మార్చి నెలలో సహకార సేద్యానికి లోను శాంక్షన్ చేసి మార్చి నెలాఖరుకు ఖర్చు అవుతోంది అంటే ఏ విధంగా ఖర్చు అవుతున్నదో పరిశీలిస్తారని తమ దృష్టికి తెస్తున్నాను, మైనర్ ఇరిగేషన్ పనులు పంచాయితీ సమితులకు ఇచ్చారు. డబ్బులేదు. ఎస్టిమేట్స్ కాలేదు, అని కాలక్షేపంచేస్తూ repairs కూడా చేయటానికి అవకాశంలేకుండా ఉంది. రెండవ ప్రణాళిక పూర్తి అయి మూడవ ప్రణాళిక నడుస్తోంది. ఇందులోనైనా రామపాదసాగర్ ప్రాజెక్టు include చేస్తారేమోనని ఆశిస్తే దానిగతి ఏమైనదో ఇంత వరకు తెలియదు. భూములులేని వారికి బంజరు భూములను పంచుతామని అన్నారు, ఈ మధ్య విశాఖపట్నం తాలూకాలో ముదిగుడి గ్రామంలో ఒక షావుకారుకు 120 ఎకరాల భూమి సాగు చేసుకోవడం దుకు ఇచ్చారు. అక్కడ జీడిమామిడితోట వేయిస్తున్నారు. ప్రభుత్వం వారికి subsidy ఇస్తోందని rumourగా ఉంది. ఆ గ్రామంలో పంచములు 10 ఎకరాలు భూమి కావాలని అడిగితే ఇవ్వడానికి వీలులేదు. నాకే వ్యవసాయానికి చాలదు అని దబాయించి పూర్తిగా ఆక్రమించారు. ఈ విషయాలన్నీ మంత్రిగారు పరిశీలించి న్యాయం ఇప్పిస్తారని కోరుతున్నాను, ఈ తీర్మానాన్ని నేను బలపరచలేక పోతున్నాను.

మిస్టర్ స్పీకర్: సామర్లకోట మునిసిపాలిటీపై అరగంట చర్చకు రేపు అవకాశం ఇస్తానని చెప్పాను. రేపు కాకుండా 1-8-61న ఆ చర్చ పెట్టుకుందాము.

Question hour తరువాత పెట్టుకుందాము. రేపు 11నుంచి పక్షాలు మాట్లాడ్డానికి ఉండదు, ప్రతిపక్షం తరఫున ఒక అరగంట తరువాత ప్రభుత్వానికి రెండుగంటలు ఇవ్వవలసి ఉంటుంది. ముఖ్యమంత్రి గారి ఇష్టంప్రకారం ఆయన, ఇతర మంత్రులు చెబుతారు. సరిగా 9-30 గంటలకే ప్రశ్నలు పూర్తిచేస్తాను. 9-30 నుండి 11 వరకే అవకాశం ఉంటుంది.

రేపు ఉదయం 8-30 గంటలకు తిరిగి సమావేశం అవుదాము.

(The House then adjourned till Half Past Eight of the Clock on Saturday the 29th July 1961)